ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 17, మే 2025







నేడు అంతర్జాతీయ హైపర్ టెన్షన్ డే

బీపీ నియంత్రణ మీ చేతిలోనే..

7

- ఎక్కువ మందిలో రక్తపోటు
- వ్యాయామంతోనే ఆరోగ్యం
- రోజూ ఓ గంట కేటాయిస్తే చాలు

ఉపాధ్యాయుల పోరుబాట

21న డీఈవో కార్యాలయం ముట్టడి

ఒంగోలు విద్య, మే 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యలో ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలను నిరసిస్తూ ఉపాధ్యాయులు పోరుబాటకు సిద్ధమయ్యారు. అందుకోసం ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఐక్యవేదికను ఏర్పాటు చేశాయి. ఈ నెల 21న ఉమ్మడి జిల్లా డీఈవో కార్యాలయం ముట్టడి, 23న రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి ఐక్యవేదిక పిలుపునిచ్చింది. పోరాటాలకు అన్ని ఉపాధ్యాయ సంఘాల సంఘీభావంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ప్రతి శుక్రవారం పాఠశాల విద్యకమిషనర్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఆసమావేశానికి హాజరైన సంఘాల నాయకులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వీటిని పాఠశాల విద్య కమిషనర్ పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో శుక్రవారం జరగాల్సిన ఉపాధ్యాయ సంఘాల సమావేశాన్ని నాయకులు బహిష్కరించి పోరుబాటకు పిలుపునిచ్చారు.

జయహో.. సైనికా..

ఒంగోలులో దేశభక్తి ఉప్పొంగింది. భారత్ మాతాకీ జై.. నినాదాలతో నగరం మార్మోగింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతం, భారత సైనికులకు సంఘీభావంగా ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం త్రివర్ణ పతాకాలు చేతపట్టి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

6





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, పక్కన గుండె వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేశ్వరరావు

గుండెకు భరోసా..!

ఒంగోలు జీజీహెచ్‌లో యాంజియో ప్లాస్టీ విజయవంతం

సూపరింటెండెంట్ ఏడుకొండలు, కార్డియాలజిస్ట్ వెంకటేశ్వరరావు వెల్లడి

ఒంగోలు, కార్పొరేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో గుండె సంబంధిత వ్యాధులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ఎంతో ఖరీదైన యాంజియో ప్లాస్టీని విజయవంతంగా చేశామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఇది జీజీహెచ్ చరిత్రలోనే నూతన అధ్యాయం అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో గుండె వ్యాధులకు వైద్యం అందించడంతోపాటు యాంజియో ప్లాస్టీ, ఇతర ఆపరేషన్‌లు చేస్తామని తెలిపారు. జీజీహెచ్ కార్డియాలజీ హెచ్‌వోడీ, గుండె వైద్యనిపుణులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతనెల రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాతోపాటు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు కార్డియాలజీ

మిగతా 6వ పేజీలో..

ప్రభుత్వ యంత్రాంగంలో బదిలీల సందడి నెలకొంది. ఎట్టకేలకు శుక్రవారం నుంచి ఉద్యోగుల స్థానచలనాలకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అన్ని శాఖల్లో వచ్చేనెల 2వతేదీలోపు ఆ ప్రక్రియను పూర్తిచేయాలని మార్గదర్శకాలను జారీ చేసింది. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది కొన్ని శాఖల్లో మాత్రమే ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించింది. ఈసారి అన్ని శాఖల్లోని వారిని మార్పు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ బదిలీల ప్రక్రియ కొనసాగనుంది.



బదిలీలకు వేళాయె!

ప్రభుత్వ ఉద్యోగులకు గ్రీన్‌సిగ్నల్

- అన్ని శాఖల్లో మార్పులకు శ్రీకారం
- ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ప్రక్రియ
- వచ్చేనెల 2వతేదీ వరకు అవకాశం
- ఆ తర్వాత మళ్లీ నిషేధం

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి) :ఎట్టకేలకు ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్నిశాఖల్లో అత్యవసరమైన ఉద్యోగులను మాత్రమే మార్చగా.. వైద్యారోగ్యం, ఇరిగేషన్ లాంటి శాఖల్లో బదిలీలు జరగలేదు. ప్రస్తుతం ఆశాఖల్లో భారీగా ఉద్యోగుల బదిలీలు కొనసాగనున్నాయి. అలా అన్ని శాఖల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ బదిలీలు చేసే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2025 మే 31 నాటికి ఒకేస్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా మార్చాల్సి ఉంది. ఐదేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. వారి విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకొని పరిపాలనా సౌలభ్యం మేరకు మార్పులు చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

అనారోగ్య బాధితులకు ప్రాధాన్యం

ప్రస్తుత బదిలీల్లో అనారోగ్యంతో బాధపడే వారికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులు, మానసిక దివ్యాంగ పిల్లలు ఉండి వైద్యవసతి కలిగిన ప్రదేశాలకు వెళ్లే వారికి బదిలీల్లో ప్రాధాన్యం కల్పించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులు, 40శాతంపైగా అంగవైకల్యం కలిగిన వారు, దీర్ఘకాలిక వ్యాధులైన కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ తదితర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన వితంతు ఉద్యోగులకు బదిలీల్లో ప్రయారిటీ ఇవ్వనున్నారు. దివ్యాంగ ఉద్యోగులు కోరుకుంటే తప్ప వారిని బదిలీ చేయరాదని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఈ తరహా ఉద్యోగులను వారు కోరిన చోట ఖాళీలను బట్టి బదిలీ చేసేలా వెసులుబాటును కల్పించారు. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరినీ ఒకేచోట ఉంచేందుకు.. వీలు కాకపోతే పక్కపక్క ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలని

మిగతా 6వ పేజీలో..

అనుమానాలు కాదు.. ఆధారాలే ముఖ్యం

ముప్పా సురేష్ కీలక కుట్రదారుడే

అతడిని, అతని వెనుక ఉన్నవారినీ వదలం

- సిఫారసులు లేవు, ఒత్తిళ్లు అంతకన్నా లేవు
- అరెస్టులే కాదు.. వారికి శిక్షపడే విధంగా చేస్తాం
- వీరయ్య హత్య కేసు దర్యాప్తుపై ఎస్పీ దామోదర్
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అనుమానాలపై స్పష్టత



(ఒంగోలు, ఆంధ్రజ్యోతి) 'ప్రజల అనుమానాలు, అపోహల కన్నా దర్యాప్తులో వెల్లడైన నిజాలు, లభించిన ఆధారాలే ముఖ్యం. తదనుగుణంగానే టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి కేసులో ముందుకెళ్తున్నాం. ఈ కేసులో ముప్పా సురేష్ పాత్ర కీలకం. హంతకుల్లో నాగరాజు పాత్ర కూడా ఎక్కువే. వారిని వదలం. ముఖ్యంగా సురేష్ వెనకున్న వారిని వదిలే ప్రసక్తే లేదు. కుట్రదారులు, హంతకులను అరెస్ట్ చేయడమే కాదు. వారికి శిక్షపడే విధంగా కేసును ముందుకు తీసుకువెళ్లడం మా లక్ష్యం' అని ఎస్పీ దామోదర్ స్పష్టం చేశారు. టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో కొందరిని అరెస్ట్ చేశామని, మరికొందరి కోసం గాలిస్తున్నామని ఇటీవల ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే దర్యాప్తుపై కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఎస్పీ దామోదర్ స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు

వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగిందని ఎస్పీ చెప్పారు. నిత్యం డీజీపీ పర్యవేక్షించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా దర్యాప్తునకు అనుగుణంగానే ముందుకు సాగాలని చెప్పారని ఒక ప్రశ్నకు బదులుగా ఎస్పీ స్పష్టం చేశారు. నిందితులు ఎవరనేది మాకు ముఖ్యం కాదు.. వారు ఏ పార్టీ అనేది అనవసరం. ఆ తరహాలోనే దర్యాప్తు చేశామని వెల్లడించారు. అనుమానితులుగా గుర్తించి ఇప్పటికే చాలామందిని విచారించామన్నారు. దర్యాప్తులో వెల్లడైన విషయాలకు అనుగుణంగా ఆ కేసులో అనుమానం ఉన్న వారినే నిందితులుగా తీసుకున్నామని తెలిపారు. మరో ప్రశ్నకు బదులుగా ఏ దశలోనూ రాజకీయ దురుద్దేశంతో ముందుకు పోమ్మని మాకు సిఫారసు చేసిన వారు గానీ, బలవంతం చేసిన వారుగానీ

మిగతా 6వ పేజీలో..



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్ఈ నాగమురళి, ఇతర జలవనరులశాఖ అధికారులు

సాగునీటి వనరులపై ప్రభుత్వం దృష్టి

- ట్రిపుల్ ఆర్ కింద రూ.135 కోట్లతో చెరువుల అభివృద్ధి
- పక్షంలో ప్రతిపాదనలు పూర్తి చేయాలని స్పెషల్ సీఎస్ ఆదేశం
- ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- సాగర్ కాలువలు, చెరువుల అత్యవసర మరమ్మతులకు రూ.15.80 కోట్లు
- నేడో, రేపో మంజూరు ఉత్తర్వులు వచ్చే అవకాశం
- సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు

6లో

చల్లబడిన వాతావరణం

పలుచోట్ల ఒక మోస్తరు వర్షం

ఎండల తీవ్రత నుంచి ఉపశమనం

సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు

ఒంగోలు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రతతో తల్లడిల్లుతున్న జిల్లా ప్రజానీకానికి తాత్కాలిక ఉపశమనం లభించింది. శుక్రవారం వాతావరణం చల్లబడింది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు తగ్గాయి. పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో దాదాపు పది రోజులకుపైగా అత్యధిక ప్రాంతాల్లో ఎండలు ఠారెత్తించాయి. దీనికితోడు వేడిగాలులు కొంత సేపు, ఉక్కపోత వాతావరణం మరికొంత సేపు ఉండటంతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో గాలులు, ఉరుములు, మెరుపులతో జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో శుక్రవారం

మిగతా 6వ పేజీలో..



ఒంగోలులో కురుస్తున్న వర్షపు జల్లులు



బాబోయ్.. దొంగలు!

- మార్కాపురంలో ఆగని మోటారు సైకిళ్ల చోరీలు
- బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు నమోదుచేయని పోలీసులు
- మొరాయిస్తున్న సీసీ కెమెరాలు

7

బదిలీలకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

సూచించింది. ఉద్యోగోన్నతి పొందిన వారిని కచ్చితంగా బదిలీచేయాలని, ఆ పోస్టు ఇతర ప్రాంతాల్లో లేకపోతే అదేస్థానంలో కొనసాగించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఐటీడీఏ పరిధిలో లోకల్ కేడర్, జోనల్ కేడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే వారు కోరుకున్న చోటకు బదిలీ చేయనున్నారు. ఐటీడీఏ ప్రాంతానికి బదిలీ కోరుకునే వారు 50ఏళ్ల లోపు వారై ఉండాలని, గతంలో ఐటీడీఏ ప్రాంతంలో పనిచేసిన వారిని ఈ బదిలీలకు పరిగణనలోకి తీసుకోరాదని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు

ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఆయా శాఖల్లో ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. జిల్లా, జోనల్, మల్టీజోనల్ కేడర్ ఉద్యోగుల బదిలీలను ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకొని చేపడతారు. ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేకుండా సకాలంలో సంబంధిత శాఖలు ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. బదిలీల్లో ఏవైనా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే ఆయా శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రకటించింది. గుర్తింపు పొందిన రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి ఉద్యోగ సంఘాల్లో పనిచేస్తున్న వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు టర్మ్‌లు కానీ, తొమ్మిదేళ్ల సర్వీసు కానీ ఒకేచోట పూర్తిచేసి ఉంటే తప్పనిసరిగా బదిలీ చేస్తారు. తాలూకా, జిల్లాస్థాయి గుర్తింపుపొందిన ఉద్యోగుల అసోసియేషన్ ఆఫీసర్ బేరర్స్ జాబితాను కలెక్టర్ ద్వారా ఆయాశాఖల అధికారులకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు నిర్వహించరాదని పేర్కొంది. వచ్చేనెల 3నుంచి బదిలీలపై నిషేధం అమలులోకి వస్తుందని ఆలోపు ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టం చేసింది.

చల్లబడిన వాతావరణం

(5వ పేజీ తరువాయి)

ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 9.0మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా సింగరాయకొండ మండలంలో 47.8 మి.మీ కురిసింది. పొన్నలూరులో 47.2, మద్రిపూడిలో 41.6, చీమకుర్తిలో 30.0, కొండపిలో 26.8, తాళ్లూరులో 21.4, పీసీపల్లిలో 21.2, నాగులుప్పలపాడులో 20.4, కురిచేడులో 18.4, సంతనూతలపాడు 11.6 మి.మీ నమోదైంది. పలు ఇతర ప్రాంతాల్లోనూ జల్లులు పడ్డాయి. తిరిగి శుక్రవారం పగటి పూట కూడా పలుచోట్ల జల్లులు కురిశాయి. ఒంగోలులో ఉదయం నుంచి మబ్బులు పట్టి స్వల్పంగా జల్లులు పడ్డాయి. జిల్లాలో గత పదిరోజులుగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో 42నుంచి 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలతోపాటు అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీలపై ఎండ కాచింది. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఎర్రగొండపాలెం మండలం గోళ్లవిడిపిలో 37.6 డిగ్రీలు నమోదైంది. అదే అత్యధిక ఉష్ణోగ్రత. ఎక్కువ ప్రాంతాల్లో 30నుంచి 35 డిగ్రీలు నమోదయ్యాయి. దీంతో ప్రజానీకం ఊరట చెందింది. సాధారణంగా వేసవిలో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండేది రోహిణికార్తెలో. ఈనెల 25నుంచి రోహిణి రానుంది. ఆ సమయంలో ఎండలు మండిపోవడం సహజం. అయితే వారం ముందు ఇలా వాతావరణం చల్లబడటం, వర్షం కురవడంతో రోహిణికి ముందే ఎండల మరింత మండుతాయేమోనన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది.

'గుండె'కు భరోసా..!

(5వ పేజీ తరువాయి)

విభాగంలో ముఖ్యమైన క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించారని తెలిపారు. నాటి నుంచి కార్డియాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు యాంజియోప్లాస్టీ చేయడం సంతోషంగా ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో గుండె విభాగానికి ప్రఖ్యాతిగా పేరుగాంచిన బెంగళూరు జయదేవ హాస్పిటల్, చెన్నైలోని విజయ హాస్పిటల్‌లో వాడే ఖరీదైన స్టంట్లను ఇక్కడ వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అనే అపోహ లేకుండా నాణ్యమైన స్టంట్లను జీజీహెచ్‌లో వినియోగిస్తామని తెలిపారు. తాజాగా చీమకుర్తికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా గుండె వ్యాధి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఆయన ఈనెల 12న హాస్పిటల్‌లో చేరారన్నారు. ఈసీజీ, టుడీ ఎకో చేసి, స్టంట్ వేయాల్సిన అవసరం రావడంతో 13న యాంజియో చేశామన్నారు. రెండు బెలూన్లు, ఒక స్టంట్‌ను అమర్చి గుండెలోని రక్తనాళ పూడికలను తొలగించామన్నారు. తద్వారా పేషెంట్ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఈ ఆపరేషన్‌కు ప్రైవేటు వైద్యశాలలో రూ. 2.5లక్షలు ఖర్చు అవుతుందని, అయితే జీజీహెచ్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, ఇతర డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయము, ఒంగోలు

తేది. 14-05-2025

వేలం నోటీసు

ఈ కార్యాలయపు **ఆర్.ఓ.సి నెం.2806/2022-A1**, తేది. 14-05-2025 మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ యాజమాన్యం నందు గల శ్రీ దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లోని పాత చేపల మార్కెట్ నందలి షాపులు, పూల షాపులు, రిటైల్ షాపులు మరియు యన్.టి.ఆర్ కళాక్షేత్రంను లీజుకు ఇచ్చుటకు **తేది.23-05-2025న ఉ.11.30గం॥లకు** ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయము నందు టెండర్ / బహిరంగ వేలం షరతులకు లోబడి నిర్వహించబడును. ఇతర వివరముల కొరకు అన్ని ప్రభుత్వ కార్యాలయముల నోటీసు బోర్డు నందు గాని ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయపు నోటీసు బోర్డు నందు ఉంచబడిన వేలం నోటీసు ద్వారా తెలుసుకొనవచ్చును. మరియు కార్యాలయ పనివేళలలో రెవెన్యూ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమీషనరు, ఒంగోలు నగరపాలక సంస్థ**







జయహో.. సైనికా..!

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తిరంగా ర్యాలీ

ఆపరేషన్ సిందూర్ విజయవంతంలో భారత సైనికులకు సంఘీభావంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు బస్టాండు నుంచి మువ్వెన్నల జెండాలతో భారత్ మాతాకీ జై నినాదాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా దేశాన్ని ఉగ్రవాదుల బారి నుంచి రక్షించిన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

- ఒంగోలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

సాగునీటి వనరులపై ప్రభుత్వం దృష్టి

- **ట్రిపుల్ ఆర్ పథకం కింద రూ.135 కోట్లతో చెరువుల అభివృద్ధి**
- **పక్షంలో ప్రతిపాదనలు పూర్తి చేయాలని స్పెషల్ సీఎస్ ఆదేశం**
- **ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**
- **సాగర్ కాలువలు, చెరువుల మరమ్మతులకు రూ 15.80 కోట్లు**
- **నేడో, రేపో మంజూరు ఉత్తర్వులు వచ్చే అవకాశం**
- **సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు**

ఒంగోలు, మే 16 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. భారీ, మధ్య తరహా, చిన్ననీటి వనరుల విభాగాల్లోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, పెద్ద చెరువులకు మరమ్మతులు చేయించాలని నిర్ణయించింది. అవసరమైన చర్యలకు ఉపక్రమించింది. జలవరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాయిప్రసాద్ శుక్రవారం అన్ని జిల్లాల ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకూ ఆయా జిల్లాల్లో గుర్తించిన పనులు, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు, అంచనాలు తదితర వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు జలవనరుల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ నాగమురళీమోహన్, డిప్యూటీ ఎస్ఈ మల్లికార్జున, ఒంగోలు డివిజన్ ఈఈ శివరాంప్రసాద్, గుండ్లకమ్మ ఈఈ శ్రీహరి తదితరులు ఇక్కడి ఎస్ఈ కార్యాలయం నుంచి హాజరయ్యారు. ప్రధానంగా రిపేర్లు, రెన్నోవేషన్, రెస్టోరేషన్ (ట్రిపుల్ ఆర్) పథకం కింద చేపట్టే అవకాశం ఉన్న పనులపై స్పెషల్ ఎస్ఈ సాయిప్రసాద్ సమీక్ష చేశారు. ఈ పథకం కింద చేపట్టే చిన్న, మధ్య తరహా చెరువుల అభివృద్ధి పనులకు అయ్యే ఖర్చులో 60శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇవ్వనుంది. 40శాతం రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. గత నెలలోనే ఇందుకు సంబంధించిన ఆదేశాలు ప్రభుత్వం నుంచి వచ్చాయి.

ట్రిపుల్‌ఆర్ పథకం కింద 125 పనుల గుర్తింపు

ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్య తరహా సాగునీటి వనరులను అభివృద్ధికి ట్రిపుల్‌ఆర్ పథకం కింద సుమారు రూ.135కోట్ల విలువైన 125 పనులను ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. అందులో తూర్పు, దక్షిణప్రాంత నియోజకవర్గాలు పర్యవేక్షణ ఉండే ఒంగోలు డివిజన్ పరిధిలో 70 చెరువుల అభివృద్ధికి రూ.80 కోట్లు ప్రతిపాదించారు. మార్కాపురం డివిజన్ పరిధిలో 55 చెరువుల అభివృద్ధికి రూ.55 కోట్లు ప్రతిపాదించారు. రెండు వారాల్లో సమగ్రంగా నివేదించాలని స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు.

సీఏడబ్ల్యూఎం పనులు తిరిగి ప్రతిపాదన

ప్రాజెక్టుల పరిధిలో పంట కాలువల అభివృద్ధి, ఇతర పనుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయకట్టు అభివృద్ధి, నీటి యాజమాన్య (సీఏడబ్ల్యూఎం) పథకం కింద ప్రతిపాదనలపైనా స్పెషల్ సీఎస్ సమీక్ష చేశారు. ఈ పథకం కింద చేపట్టే పనుల్లో సగం నిధులను కేంద్రం భరించనుంది. ఈపథకం కింద 2020లో జిల్లాలోని గుండ్లకమ్మ పరిధిలో రూ.93.90 కోట్లతో 46 పనులు మంజూరు కాగా నాటి పాలకుల నిర్లక్ష్యం వల్ల అందులో పదిశాతం కూడా జరగలేదు. ప్రస్తుతం ఆ పనులను తిరిగి ప్రతిపాదించే వైపు అధికారులు దృష్టి సారించారు.

అత్యవస పనులకు నిధులు

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న సాగర్ కాలువలతోపాటు చెరువులలో అత్యవసర పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సాగర్ ఆయకట్టుకు నీరందించే కాలువల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, డ్రాపులు, షట్టర్ల మరమ్మతులు ఇతర పనులకు సుమారు రూ.12.12 కోట్లు మంజూరు చేసింది. అందులో జిల్లాలోని చీమకుర్తి, దర్శి డివిజన్ల పరిధిలో 113 పనులకు రూ.9.83 కోట్లు కేటాయించింది. బాపట్ల జిల్లాలోని అద్దంకి డివిజన్ పరిధిలో 12 పనులకు రూ.2.29 కోట్లు ఇచ్చింది. అలాగే చిన్ననీటి వనరులుగా ఉన్న చెరువుల అభివృద్ధి పనుల కోసం ఉమ్మడి జిల్లాలో 69 పనులకు రూ.3.68 కోట్లు కేటాయించారు. ఇందులో పశ్చిమప్రాంతంలో అధికంగా ఉన్నాయి.

నామినేషన్ పద్ధతిలో రూ.10లక్షల లోపు పనులు

అత్యవసర పనులను ఇటీవల ఎన్నికైన సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేయించనున్నారు. గతంలో రూ.5 లక్షల లోపు పనులకు టెండర్లు పిలిచే అవసరం లేకుండా నామినేషన్ పద్ధతిలో చేసే అవకాశం ఉండగా ప్రస్తుతం దాన్ని రూ.10 లక్షలకు పెంచారు. దీంతో రూ.10 లక్షల లోపు వెచ్చించే పనులన్నీ సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేసే వీలు కలిగింది. ఇంచుమించు అన్ని పనులను రూ.2లక్షల నుంచి రూ.10 లక్షలలోపుగానే అంచనాలు రూపొందించినట్లు సమాచారం. ఈ పనులకు ఒకట్రెండోజుల్లో పూర్తిస్థాయి అనుమతులు రానున్నాయి. నెలాఖరులోపు వాటిని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.



1930లో శింగరకొండ ఆలయం



2021లో ఇలా..



1960లో శింగరకొండ ఆలయం

అచెంచల విశ్వాసంతో అద్భుత క్షేత్రంగా..

శతాబ్దకాలంలో సుందరంగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వృద్ధి

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం గత శతాబ్దం క్రితం ప్రసిద్ధక్షేత్రంగా ఉద్భవించింది. అప్పటి దేవాలయం చిత్రాలను చూస్తే నేటి యువత ఆశ్చర్యానికి గురవుతుంది. ఒకప్పుడు ఆలయం వద్ద తాటాకు పందిళ్లు మాత్రమే ఉండేవి. చుట్టూ రాజగోపురాలు లేవు. ప్రహరీ కూడా లేదు. ప్రస్తుతం రాతి మండపం నిర్మాణంతో దేవాలయం అద్భుత క్షేత్రంగా రూపుదిద్దుకొంది. మరో నాలుగైదు సంవత్సరాలలో మరింత మార్పు రానుంది. నాలుగు వైపులా రాజగోపురాలు, ప్రాకార మండపాలను పూర్తిగా రాతి తో నిర్మించనున్నారు.

- అద్దంకి, ఆంధ్రజ్యోతి

అనుమానాలు కాదు.. ఆధారాలే ముఖ్యం

(5వ పేజీ తరువాయి)

లేరన్నారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా ముందుకు సాగారనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు.

కుట్రలో సురేష్ పాత్ర కీలకమే

'అమ్మనబ్రోలు గ్రామానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ముప్పా సురేష్ కూడా వీరయ్య హత్యకేసులో ప్రధాన కుట్రదారుడే. అందుకు తగిన ఆధారాలు మావద్ద ఉన్నాయి. అతన్నే కాదు. అతనికి అండగా ఉన్నవారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు' అరి ఎస్పీ స్పష్టం చేశారు. ఈ విషయంలో వెల్లడైన కొన్ని అనుమానాలను ఆంధ్రజ్యోతి వ్యక్తంచేయగా అవి అనుమానాలే. మేము నిజాలకు అనుగుణంగా ముందుకుపోతున్నాం. ఆయన ఎవరు, ఏపార్టీ, ఏస్థాయి వారు, ఎవరు మద్దతు ఉందనేది మాకు అనవసరమని చెప్పారు. మరొక ప్రశ్నకు బదులుగా ముప్పా సురేష్ దేశంలోనే ఉన్నారు. మాకు దొరకాల్సిందే. ఒంగోలు జైలుకు వెళ్లాల్సిందేనని ఎస్పీ కరాఖండిగా చెప్పారు. ఆయన్ని తప్పించాలని ఒత్తిడి మీకు వచ్చింది కదా.. ఫోన్‌లో మీడియాకు అందుబాటులో ఉన్న వ్యక్తి మీకు ఎలా దొరకకుండా ఉన్నారని ప్రజలు అనుమానిస్తున్నారని ప్రశ్నించగా.. 'అనుమానాలు, అపోహలు వేరు. కుట్రదారుల్లో అతని పాత్ర ఉందని మేము గుర్తించాం. ఆధారాలు సేకరించాం. తదనుగుణంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం ఖాయం. అలాగే దర్యాప్తు ఇంతటితో పూర్తికాలేదు. సురేష్ వెనుక ఎవరున్నారన్న అంశంపై కూడా విచారిస్తున్నాం. కచ్చితంగా కూపీ లాగుతాం. ఎవరు ఉన్నా వదిలే ప్రసక్తే లేదు' అని ఎస్పీ వెల్లడించారు. ఇంకో ప్రశ్నకు బదులుగా అతను ఏ రాజకీయ పార్టీ అనేది మాకు ముఖ్యం కాదు. కానీ మీరన్నట్లు ప్రధానంగా వైసీపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఉదంతాలు మా దృష్టికి వచ్చాయని ఎస్పీ చెప్పారు. ఇంకో ప్రశ్నకు బదులుగా ఇంకా మాకు దొరకని వారిలో నాగరాజు అనే నిందితుడు హంతకులలో ఒకరు. హతుడు వీరయ్యను ఒక పక్క నుంచి వంశీ కత్తితో పొవడగా, రెండో పక్క నుంచి నాగరాజు కూడా పొడిచాడు. నాగరాజును తప్పకుండా పట్టుకొస్తాం. జైలుకు పంపుతామన్నారు. ఇప్పుడేదో అరెస్టు చేసి చేతులు దులుపుకోవడం కాదు. తుది విచారణలో కుట్రదారులకు, హంతకులకు శిక్షపడే విధంగా సేకరించిన ఆధారాలతో ప్రాథమిక దర్యాప్తు గానీ, ఛార్జీషీటును కానీ రూపొందిస్తున్నామని ఎస్పీ చెప్పారు. మా లక్ష్యం అరెస్టు చేయడం కాదు. కోర్టులో అందరికి శిక్షపడటమేనని స్పష్టం చేశారు.

ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటు

రౌడీ మూకలు, గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయించే, వినియోగించే వారిని నివారించడమే లక్ష్యంగా ప్రత్యేక యాంటీ గూండా స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆ స్క్వాడ్ ఇప్పటికే చాలామందిని అదుపులోకి తీసుకుందని, వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. జిల్లాలో రౌడీమూకలు. గంజాయి ఇతర డ్రగ్స్ వినియోగదారులు లేకుండా చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

- **రూ.6.40 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం**
- **48 గంటల్లోనే ఛేదించిన మార్కాపురం పోలీసులు**

మార్కాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో ఈ నెల 13వ తేదీ అర్ధ రాత్రి ఓ వృద్ధురాలిపై దాడిచేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని, వారిని పురిగొల్పిన మరొకరిని శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.6.40 లక్షల విలువగల సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు ఆ కేసు వివరాలు వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు బండి రమణమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా జీవిస్తోంది. ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలపై అదే ప్రాంతానికి చెందిన కురుకుంద మల్లికార్జున, వసుంధర దంపతులు కన్నేశారు. వారికి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఆమె ఆభరణాలు దొంగిలించి అప్పులు తీర్చాలని నిశ్చయించుకున్నారు. వీరికి అదే ప్రాంతంలో నివాసముండే దండెబోయిన కాశీనాథ్ తోడయ్యాడు. వృద్ధురాలికి సమీప బంధువులే అయినందున ఎవరికీ అనుమానం రాదని రాత్రి వేళ వెళ్లి ఆభరణాలు చోరీ చేయాలని కాశీనాథ్ సూచించాడు. పథకం ప్రకారం ముందుగా కాశీనాథ్ ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాను 13వ తేదీ సాయంత్రం కర్రతో పైకి మళ్లించాడు. అర్ధరాత్రి సమయంలో భార్యాభర్తలైన మల్లికార్జున్, వసుంధరలు వృద్ధురాలు రమణమ్మ ఇంటిలోకి ప్రవేశించి మంచంపై పడుకుని ఉన్న ఆమె ముఖంపై పిడిగుద్దులు కురిపించారు. ఆమె తేరుకునేలోపే చేతులకు ఉన్న నాలుగు గాజులు, మెడలోని సరుడును అపహరించారు. అనంతరం మంచం చుట్టూ కారం చల్లి ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని నిందితులు బెదిరించి వెళ్లిపోయారు. ఉదయం రమణమ్మ కుమారుడు కేశవ విషయం తెలుసుకుని ఆమెను పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు చుట్టుపక్కల ప్రాంతంలోని వ్యక్తుల కదలికలపై దృష్టిపెట్టారు. సీసీ కెమెరా పైకి నెట్టి ఉండటాన్ని గమనించి అందులోని డేటాను పరిశీలించారు. వారికి రాబడిన సమాచారం మేరకు ముగ్గురు నిందితులు చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకుని శుక్రవారం వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. 48 గంటల్లోనే కేసును ఛేదించేందుకు సహకరించిన కానిస్టేబుళ్లు జె.అరుణగిరి, పి.వెంకటేశ్వర్లు, కోటినాయక్, ఎస్‌కే షరీఫ్, ఎన్.కిషోర్‌లకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు రివార్డులు అందజేశారు. విలేకరుల సమావేశంలో సీఐ పి.సుబ్బారావు, ఎస్సైలు ఎం.సైదుబాబు, ఎం.రాజమోహన్‌రావు, పి.అంకమ్మరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

భక్తజన సంద్రం...గంగమ్మ ప్రాంగణం

- **గంగ తిరునాళ్లకు పోటెత్తిన జనం**
- **కనులవిందుగా 9 విద్యుత్ ప్రభలు**

పీసీపల్లి, మే16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురం సమీపంలో గంగమ్మ తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంగాభవానీని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో టీడీపీ, వైసీపీ, బీసీవై పార్టీలకు చెందిన వారు 9 విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. వీటిపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తుల రాకతో గంగాభవానీ ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఉదయం నుండే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ తిరునాళ్ల సందర్భంగా పలువురు భక్తులు బొల్లావులను ఎత్తుకుని చేసిన నృత్యం అలరించింది. పెదఅలవలపాడులో గంగాభవాని గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలో తెలుగుదేశం పార్టీ తరఫున 5 విద్యుత్ ప్రభలు, వైసీపీ తరఫున 3, బీసీవై పార్టీ తరఫున 1 మొత్తం 9 విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. ఉదయం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తదితరులు గంగాభవానీని దర్శించుకున్నారు.



తిరునాళ్లలో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్న ప్రభలు

బాబోయ్.. దొంగలు!



మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోగల రిలయన్స్ స్మార్ట్ పాయింట్ వద్ద ఏప్రిల్ 7వ తేదీన అర్ధరాత్రి సమయంలో ఇంటి వద్ద నిలిపివున్న మోటార్ సైకిల్ చోరీకి గురైంది. స్మార్ట్ పాయింట్‌లోని సీసీ కెమెరాల్లో ఈ చోరీ రికార్డు అయింది. ఒక మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు కిందకి దిగి స్మార్ట్ పాయింట్ భవన యజమానికి చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించుకుని తీసుకుపోయాడు. పోలీసులకు చోరీ జరిగినప్పుడే ఫిర్యాదు చేస్తే గురువారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నామని బాధితునికి చెబుతున్నట్లు తెలిసింది.

నెల క్రితం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ న్యాయవాది ఇంటి వద్ద నిలిపిన మోటార్ సైకిల్ ఉదయం 6.30 గంటలకు చోరీకి గురైంది. రోడ్డుపైన వాహనాన్ని నిలిపి ఇంట్లోకి వెళ్లి ఒక్క నిమిషంలోనే బయటకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించిన సరైన ఆధారాలు దొరకలేదు. పోలీసుశాఖ ఏర్పాటు చేసిన మ్యాట్రిక్స్ సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో చోరీచేసిన వారిని గుర్తించేందుకు వీలు కలగలేదు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. మార్కాపురం పట్టణంలో గత మూడు నెలల కాలంలో సుమారు 15 వరకు మోటార్ సైకిళ్లు చోరీకి గరైనట్లు సమాచారం. పోలీసులు ఎంతమేర శ్రమించిన వాహనాల దొంగతనాలను కట్టడి చేయలేకపోతున్నారు. శివారు కాలనీల్లో ఎక్కడైనా వాహనం చోరీకి గురైందంటే ఎవరి నిర్లక్ష్యంలేనట్లే. ప్రస్తుతం జరుగుతున్న చోరీలు ప్రధాన పట్టణం చుట్టుపక్కలే కావడం గమనార్హం. నిత్యం హోమ్‌గార్డులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరిగే ప్రాంతాల్లోనే వాహనాలు చోరీకి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి వాహనాలను చోరీ చేస్తున్నది పట్టణానికి చెందిన దొంగల పనే స్పష్టమౌతోంది. గతంలో కూడా ఇదే రీతిన వాహనాలు చోరీకి గురైనప్పుడు పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు. పాత దొంగలను, బెట్టింగ్, పేకాటలాంటి జూదాలకు పాల్పడుతున్నవాళ్లను విచారిస్తే కొన్ని రికవరీలు కూడా జరిగాయి. ప్రస్తుతం గంజాయి సేవించే యువకులు కూడా వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా పోలీసులు దృష్టిపెడితే చోరీలకు కొంతమేరకైనా అడ్డుకట్ట వేయగలిగినట్లే.

- మార్కాపురం, ఆంధ్రజ్యోతి

చోరీలు జరిగినా కేసులు నమోదు చేయని వైనం

- ఆగని మోటార్ సైకిళ్ల చోరీలు
- బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయని పోలీసులు
- మొరాయిస్తున్న సీసీ కెమెరాలు



మోటార్ సైకిళ్లు, సాధరణ సైకిళ్ల చోరీకి గురైతే పోలీసులు కేసులు నమోదు చేయడంలేదు. ఒక్క మార్కాపురమేకాక జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కేసుల నమోదుపై పోలీసులు దృష్టిపెట్టడంలేదు. వాహనాల చోరీలకు సంబంధించి కేసులు నమోదు చేస్తే వాటి రికవరీ ఆలస్యమైనప్పుడు కేసుల సంఖ్య వారికి భారమవుతోంది. ఈ కారణంతోనే ఎక్కడికక్కడ కేసులు నమోదు చేసేందుకు ఆసక్తి చూపడంలేదు. ఎక్కడైనా దొంగలు దొరికి వాహనాలు రికవరీ చేసినప్పుడు మాత్రమే బాధితులకు న్యాయం జరుగుతోంది. ఈలోపు బాధితులు వేచి చూడాల్సిందే తప్పితే ఏమీ చేయలేని పరిస్థితి. కొందరు దొంగలు ఈ మధ్య కాలంలో వాహనాలను చోరీ చేసి గంజాయి ముఠాలకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లోని జిల్లాల్లోగల అటవీ ప్రాంతం నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేసేందుకు చోరీ చేసిన వాహనాలను వాడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అక్కడ వాహనాలను పట్టుకుంటే వాటి యజమానులే నిందితులయ్యే ప్రమాదం కూడా ఉంది. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు చోరీ చేసిన వాహనాలను తెలివిగా ఉపయోగిస్తున్నందున కేసులు నమోదు చేయకుంటే బాధితులు మరింత ఇబ్బందులకు గురికానున్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు



గత టీడీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో హైరిజల్యూషన్ కెమెరాలను ప్రధాన ప్రాంతాలు, కూడళ్లలో పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణను మ్యాట్రిక్స్ సంస్థకు అప్పజెప్పింది. 2014 నుంచి 2019 వరకు సీసీ కెమెరాలు బాగా పనిచేశాయి. చాలా కేసులను ఛేదించేందుకు పోలీసుశాఖకు ఉపయోగపడ్డాయి. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీ కెమెరాల నిర్వహణను గాలి కొదిలేశారు. ఒక్క మార్కాపురం పట్టణంలోనే సుమారు 24 వరకు సీసీ కెమెరాలుంటే వాటిల్లో ప్రస్తుతం పనిచేసేది 15 మాత్రమే. మిగిలినవి సక్రమంగా పనిచేయడంలేదు. కీలకమైన తర్లుపాడు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోలీసు క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లోనివి సక్రమంగా పనిచేయడంలేదు. ఎప్పటికప్పుడు వాటి పనితీరును గమనిస్తూ నిర్వహణ చూసే మ్యాట్రిక్స్ సంస్థకు సమాచారం పంపాల్సిన అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదు. దీంతో కీలకమైన దొంగతనాలు, వాహనాల చోరీల కేసులను ఛేదించేందుకు అవరోధం ఏర్పడుతోంది. నిఘా నేత్రాలను పునరుద్ధరించేందుకు తప్పక పోలీసు అధికారులు దృష్టిపెట్టాల్సివుంది.

కర్మభూమిలో పూసినపువ్వు 'కలేకూరి'

- దళితుల ఆత్మగౌరవానికి ప్రతీక
- సాహిత్యంతో సామాజిక అసమానతలపై పోరు

నేడు ప్రసాద్ వర్ధంతి



ఒంగోలు కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఒక 'యువక' గొంతెత్తితే కారంచేడు దళితులపై ఎంతటి ఘోరమైన దాడి జరిగిందో యావత్ ప్రజల కళ్లముందు అక్షరదృశ్యాలు సాక్షాత్కారమయ్యాయి. 'నన్ను బాధితుడని పిలవకండి. నేను అమరుడిని. ఎగిరే ధిక్కార పతాకాన్ని. మీకు చేతనైతే నా శవాన్ని నగరం నడిబొడ్డున ఖననం చేయండి. ఒక జీవన రవళిని వినిపించే వెదురు వనాన్నై వికసిస్తాను. మీకు చేతనైతే నా శవాన్ని ఈ దేశపు ముఖచిత్రంగా ముద్రించండి. ఒక సుందర భవిష్యత్తునై చరిత్రపుటల్లోకి పరివ్యాపిస్తాను' అంటూ ఆత్మస్థైర్యంతో, ఆశావహ దృక్పథంతో పలికిన గొంతును చూసి యావత్ సాహితీలోకం ఆశ్చర్యపోయింది. అంతటి గొప్ప సాహిత్యాన్ని 'యువక' పేరుతో సమాజానికందించి, దళిత సాహిత్యవేత్తగా పేరుప్రఖ్యాతులు సాధించిన వ్యక్తి 'కలేకూరి ప్రసాద్'. ఆయన అటు జన నాట్యమండలి, విప్లవ రచయితల సంఘం(విరసం)లోను పనిచేసి, 1994 ఎన్నికలలో బహుజన సమాజ్ పార్టీ తరపున నందిగామ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. తెలుగు ప్రజల గుండెలు బరువెక్కేలా 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా' అంటూ నాటికీ, నేటికీ, ఏనాటికీ గుర్తుండిపోయేలా శ్రీరాములయ్య సినిమాలో పాటను రచించిన కలేకూరి ప్రసాద్ ఒక దళిత విప్లవ కెరటంలా ఎగసి కేవలం 48 సంవత్సరాల వయసులోనే, 2013 మే 17న తుదిశ్వాస విడిచాడు. 1964 అక్టోబర్ 25వ తేదీన కృష్ణాజిల్లా కంచికచెర్ల గ్రామంలో పుట్టిన కలేకూరి దేవి వరప్రసాద్ ఇటు తెలుగు భాషలోను అటు ఆంగ్లభాషలోను మంచిపట్టున్న వ్యక్తి. దళితుల జీవనసరళిని, వారు సమాజంలో ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలు, అసమానతలను కళ్లకుకట్టేలా కలేకూరి ప్రసాద్ 'ఆంధ్రప్రదేశ్‌లో దళితులు' అనే గ్రంథాన్ని సైతం అద్భుతంగా రచించారు. అటువంటి కలేకూరి ప్రసాద్ ఎంతో కాలం ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో నిరాడంబరంగా జీవించారు. అక్కడే ఆయన తుదిశ్వాస విడిచారు. అటువంటి వ్యక్తి మరణంతో పన్నెండు సంవత్సరాల కిందట తెలుగు సాహిత్య సమాజం ఒక మంచి కవిని, విమర్శకుడిని కోల్పోయింది.

నేడు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రను పటిష్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17వ తేదీ (మూడో శనివారం) జరగనున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రతినెల మూడో శనివారం జరిగే ఈ కార్యక్రమాన్ని ఈ శనివారం 'బీట్ ద హీట్' కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని భవనాలపైనా రూఫ్‌టాప్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రముఖ రద్దీ కూడళ్లలో నీడసౌకర్యం కోసం షెడ్స్ ఏర్పాటు, భవనాలపై చల్లదానికి కూల్ వైట్ పెయింటింగ్, చలివేంద్రాల ఏర్పాటు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడుగుంటలు ఏర్పాటు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వృద్ధులు, పిల్లలు బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ప్రథమ చికిత్స కేంద్రాలు, వడదెబ్బ బారినపడిన వారి కోసం హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు శ్రీనివాస ప్రసాద్, వెంకట నాయుడు, బాలశంకరరావు, జోసెఫ్‌కుమార్, నారాయణ, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, హేనసుజన, బేబిరాణి, గోపీచంద్, శ్రీనివాస సంజయ్, సీపీవో వెంకటేశ్వర్లు, అంజల తదితరులు ఉన్నారు.

రామాలయంపై పిడుగుతో దెబ్బతిన్న విగ్రహాలు

సింగరాయకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ పరిధి బేసిన్ పల్లెపాలెంలోని రామాలయంపై శుక్రవారం తెల్లవారు జామున పిడుగు పడింది. ఈ ప్రమాదంలో అలయ గోపురంపై ఉన్న ఐదు విగ్రహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పిడుగుపడే సమయంలో పెద్దగా ధ్వని రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారు జామునకావడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.



రామాయపాలెంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ గోపాలక్రిష్ణ

వివాదాలకు తావులేకుండా రీసర్వే

జేసీ గోపాలకృష్ణ

మద్రిపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి భూవివాదాలకు తావులేకుండా రీసర్వే ప్రక్రియను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్కృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని రామాయపాలెంలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూయజమానులకు ముందుగా నోటీసులు ఇచ్చి రీసర్వేలో భాగస్వాములను చేయాలన్నారు. అవకతవకలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రామాయపాలెంలో 212 సర్వే నంబర్లలో 1,875 ఎకరాల భూమిని రీసర్వే చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 448 ఎకరాల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. భూయజమానులు ముందుగా మ్యుటేషన్ చేయించుకొని తప్పులు సవరించుకోవాలని సూచించారు. గుండ్లసముద్రం ఎస్టీకాలనీ రాజుపాలెంకు చెందిన పలువురు గిరిజన రైతులు జేసీని కలిసి తమ గ్రామంలో పశువుల మేత పోరంబోకు భూమిని ఇటీవల కొందరు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన జేసీ.. సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కనిగిరి ఇన్‌చార్జి ఆర్డీవో శివరామిరెడ్డిని ఆదేశించారు. అనంతరం మద్రిపూడి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న జేసీ పెండింగ్ అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మంత్రి స్వామి నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను ఆయన పరిశీలించారు. 18 అర్జీలకు పరిష్కారం చూపించారు. మరో 37 అర్జీదారుల నుంచి హక్కుపత్రాలను తీసుకొని వీలైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ జ్వాలా నరసింహం, డీటీలు నాగరాజు, ప్రకాష్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ వెంకటరెడ్డి సర్పంచ్ మలసాని నాగేశ్వరరావు ఉన్నారు.

20న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ శుక్రవారం తెలిపారు. కేఎల్ గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, చక్ర హుండయ్ కంపెనీల్లో వివిధ ఖాళీల భర్తీ కోసం ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఈ మేళా ఒంగోలులోని ఉపాధికల్పనా కార్యాలయం లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి నెలకు వేతనం రూ.10వేల నుంచి రూ.19 వేల వరకు ఇస్తారని, పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఉంటుందని తెలిపారు. ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆయన కోరారు.

బీపీ నియంత్రణ.. మీ చేతిలోనే..

హైపర్ టెన్షన్... ఇప్పుడు ప్రతిఒక్కరూ అనేమాట ఇది. చిన్న సమస్యను కూడా తట్టుకోలేకపోవడం, తీవ్రమైన మానసిక ఒడిదొడుకులకు లోనవడం ఎక్కువ మందిలో కనిపిస్తోంది. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఏజ్ గ్రూప్‌లోనూ ఇదే సమస్య బయట పడుతోంది. అధిక రక్తపోటుకు దారితీస్తోంది. ఒక్కోసారి ప్రాణాంతకం కూడా అవుతోంది. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పే ఇందుకు కారణం అవుతోంది. పోషకాహారంతోపాటు నిత్యం వ్యాయామం, నడకతో హైపర్ టెన్షన్‌ను నియంత్రించొచ్చని వైద్యులు చెబుతున్నారు.

- ఎక్కువ మందిలో రక్తపోటు సమస్య
- వ్యాయామం, యోగాతో ఆరోగ్యం పదిలం
- రోజూ ఓ గంట కేటాయిస్తే ఉత్తమ ఫలితం
- నేడు అంతర్జాతీయ హైపర్ టెన్షన్ డే



ఒంగోలు కార్పొరేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి) :మనిషి నిత్య జీవితంలో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత ఉంటే ఆ రోజంతా హాయిగా గడుస్తుంది. అయితే పోటీ ప్రపంచంలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి మనిషిని అనర్థాలకు గురి చేస్తోంది. పొరుగువారితో పోటీ పడుతూ పరుగులు పెట్టిస్తోంది. అయితే వాటిని అధిగమించి ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుకునేందుకు వ్యాయామం, ధ్యానం ఎంతో మేలని యోగా నిపుణులు అంటున్నారు. విజయం వైపు పయనించాలంటే ప్రతిరోజూ ఓ గంటసేపు వాకింగ్, జిమ్, వ్యాయామం, మెడిటేషన్ చేస్తే అంతా ఆనందమయ జీవితాన్ని ఆస్వాదించొచ్చని వెల్లడిస్తున్నారు.

వాకింగ్‌తో వ్యాధులు దూరం

శారీరక శ్రమలేని వారికి వాకింగ్ అత్యుత్తమ వ్యాయామం. ఊబకాయం ఉన్న వాళ్లకే పరిమితం కాకుండా నడకతో బీపీ, షుగర్, గుండెజబ్బుల నియంత్రణలోనూ నడక మంచి ఫలితాలను ఇస్తుంది. స్త్రీలు, పురుషులు, పిల్లలు ఉదయం పూట నడక అలవాటు చేసుకుంటే చాలా వరకు రోగాలు దరిచేరవని, ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అనుభవజ్ఞుల సూచన. అందులో భాగంగానే జిల్లావ్యాప్తంగా వాకింగ్ ట్రాక్‌లు వేకువజాము నుంచే కళకళలాడుతుండగా, చిన్న,పెద్ద అందరూ ఓ గంట వ్యాయామానికి సమయం కేటాయించడం జీవితంలో నిత్యభాగమైంది. దానితోపాటు ధ్యానం కూడా ప్రశాంతతకు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

ధ్యానం ఎలా చేయాలి ?

ప్రతిరోజూ ఒక నిర్దిష్టమైన సమయం నిర్ణయించుకొని ఆ సమయంలో ఆలోచనలన్నీ పక్కన పెట్టి ప్రశాంతంగా ఉండటమే ధ్యానంలోని తొలి పాఠం. ప్రశాంతమైన స్థలంలో హాయిగా కూర్చోవాలి. రెండు చేతుల వేళ్లను అనుసంధానం చేసుకుని, రెండు కను రెప్పలు మూసి ఉచ్వాస, నిశ్వాసలను శ్రద్ధగా గమనిస్తూ ఉండటమే. ఏ మంత్రం జపించనవసరం లేకుండా, ఏ రూపం ఊహించుకోకుండా కేవలం శ్వాస మీద ధ్యాస ఉంచితే చాలు. ప్రతి మనిషికీ ఎదురయ్యే మొదటి ప్రశ్న ఏకాగ్రత ఎలా? తీరిక చేసుకుని సమయం కుదుర్చుకున్నపుడే ఎప్పుడూలేని ఆలోచనలు ఒక్కసారిగా చుట్టుముట్టేస్తాయి. అయితే మొదటగా ప్రశాంతమైన వాతావరణం లేదా శబ్దం రాని గదిని కేటాయించుకోవాలి. మొదటి దశలో కాస్తంత కష్టంగా ఉన్నప్పటికీ క్రమంగా ఆలోచనలన్నీ వాటంతట అవే దూరమై ప్రశాంతమైన ప్రపంచంలోకి తీసుకెళతాయని అనుభవజ్ఞులు వెల్లడిస్తున్నారు.

ఆరోగ్యం.. అందమైన ఆకృతి కోసం జిమ్

ఇపుడంతా క్రేజీ ప్రపంచమైంది. సిక్స్‌ప్యాక్‌లు, అందమైన శరీర ఆకృతి, అంతకుమించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ. అందుకు ఒకటే మార్గం వ్యాయామం. గతంలో జిల్లాలో కేవలం వాకింగ్ ట్రాక్‌లు, యోగా సెంటర్స్ మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఒక్కో మిషన్, ఒక్కో ప్రత్యేకతకు అవసరంగా మారింది. ప్రతిరోజూ జిమ్‌కు వెళ్లేందుకు యువత ఆసక్తి చూపుతోంది. దీనివల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు.

హైపర్ టెన్షన్ లక్షణాలు ఇవే..!

సాధారణంగా వ్యక్తిలో బీపీ ఎక్కువగా నమోదు కావడం. శరీరంలోని అవయవాల మీద ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు కనిపిస్తాయి. అందుకే బీపీని సైలెంట్ కిల్లర్ వ్యాధిగా వైద్యులు వెల్లడిస్తారు. కొన్ని లక్షణాలను బట్టి బీపీ చెక్ చేసుకోవడం ద్వారా అదుపులో ఉంచుకోవచ్చు. హైపర్ టెన్షన్ ఉన్నపుడు తల దిమ్ముగా అయిపోవడం, ఏకగ్రాత లేకపోవడం, గుండె దడగా అనిపించడం, కాళ్లలో వాపులు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నిద్రపట్టకపోవడం వంటి లక్షణాలన్నింటినీ బీపీగా పరిగణిస్తారు. అది పెరగడం ద్వారా హైపర్ టెన్షన్ ఉన్న వ్యక్తికి గుండె సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్, మెదడు పనితీరు లోపించడం, కిడ్నీ, కంటి సమస్యలు వంటివి వచ్చే అవకాశాలు ఎక్కువ.

బీపీని అశ్రద్ధ చేయొద్దు



బీపీ 130-135 వరకు పెద్దగా డేంజర్ ఏమీ కాదు. 140/90 ఉంటే మాత్రం ప్రమాదకరం. హైపర్ టెన్షన్ ఉన్న వ్యక్తికి గుండె సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్, మెదడు పనితీరు లోపించడం, కిడ్నీ, కంటి సమస్యలు వంటివి వచ్చే అవకాశాలు ఎక్కువ. కనీసం రోజుకు ఒక గంట అయినా వాకింగ్, సైక్లింగ్, మెడిటేషన్, జిమ్ వంటివి చేయాలి. బీపీ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా మందులు వాడాలి.

- డాక్టర్ అచ్చన్నాయుడు,
అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

బోగస్ గ్రూపుల బాగోతం అక్కడ నుంచే..!

- ఆధార్ సీడింగ్‌కు వసూళ్లు
- బ్యాంకుల నుంచి రుణాల వివరాలు కోరుతున్న మెప్మా అధికారులు
- కొనసాగుతున్న విచారణ

ఒంగోలు కార్పొరేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపుల పేరుతో భారీగా రుణాలు పొందిన అవినీతి ఆర్పీలపై విచారణ కొనసాగుతోంది. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అవినీతి ఆర్పీలలో కలవరపాటు మొదలవగా, వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి నలుగురు ఉద్యోగులతో విచారణకు ఆదేశించారు. దీంతో ఈ నాలుగు నెలల్లో బ్యాంకుల వారీగా రుణాల మంజూరు, తీసుకున్న గ్రూపులపై లోతుగా విచారణ మొదలు పెట్టారు. అందిన సమాచారం మేరకు ఒంగోలు నగరం కర్నూలురోడ్‌లోని సెయింట్ జేవియర్స్ స్కూలు సమీపంలోని ఓ బ్యాంకులోనే అత్యధికంగా బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందినట్లు ప్రాథమికంగా విచారణ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇదిలా ఉంచితే తీగలాగితే డొంక కదిలినట్లు అసలు బోగస్ గ్రూపుల బాగోతం అంతా మెప్మా కార్యాలయం కేంద్రంగా జరిగినట్లు తెలుస్తున్నది. కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి టీఎల్ఎఫ్ఆర్పీ, ఆధార్ సీడింగ్ కోసం ఒక్కో గ్రూపు నుంచి రూ.50 వేలు వసూలు చేసినట్లుగా కొందరు ఆర్పీలు ఇప్పటికే విచారణ అధికారులకు వెల్లడించినట్లు సమాచారం. అయితే ఇదే విషయంలో గతంలో సీఎంఎంగా పనిచేసి, అవినీతి ఆరోపణలతో ఇటీవల విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగి పాత్ర కీలకంగానే ఉంది. విధుల నుంచి తొలగించినా, తాను విధుల్లో ఉన్న సమయంలో తీసుకున్న రుణాలకు సంతకం చేసి సహకరించానని, తన వాటా తనకు ఇవ్వాల్సిందేనని ఇప్పటికీ కొందరు ఆర్పీలకు ఫోన్లు చేసి డిమాండ్ చేస్తున్నట్లు కొందరు ఆర్పీలు వెల్లడిస్తున్నారు. మెప్మాలో బోగస్ గ్రూపుల విచారణ కొనసాతుండటంతో అందులో భాగస్వాములైనవారిలో కలవరం కలిగిస్తోంది.

ఆ బ్యాంక్‌లోనే..

ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు బ్యాంకుల వారీగా తీసుకున్న పొదుపు రుణాల జాబితాపై కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. గ్రూపుల రుణాల వివరాలను కొన్ని బ్యాంకుల అధికారులు మెప్మా ఉద్యోగులకు అందిస్తూ సహకరిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు, సహకరించకపోవడంతో పీడీ శ్రీహరి ఆయా బ్యాంకుల జనరల్ మేనేజర్‌లకు లేఖలు రాశారు. ఈ ఏడాది జనవరి నుంచి మెప్మా ద్వారా పొందిన రుణాలు, గ్రూపుల వివరాలు సమాచారం అందించాలని కోరారు. అయితే విచారణలో వెలుగు చూస్తున్న వాస్తవాలు ఒకొక్కటి అధికారులకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. మరోవైపు కర్నూలురోడ్‌లోని ఓ బ్యాంకులో అత్యధికంగా బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ వారం రోజుల విచారణలో అసలు కథ అంతా కార్యాలయం నుంచే మొదలైందని, అందులో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగి, ప్రస్తుతం పనిచేస్తున్న మరో ఉద్యోగి పాత్ర ఉన్నట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చినట్లుగా తెలుస్తోంది.



మెప్మా కార్యాలయం

కొన్ని బ్యాంకులు సహకరించడం లేదు

బోగస్ గ్రూపుల పేరుతో భారీగా రుణదోపిడీ చేయడంపై విచారణ కొనసాగుతోంది. బ్యాంకుల వారీగా రుణాలు పొందిన గ్రూపుల వివరాలు కోరగా కొన్ని బ్యాంకుల వారు ఇవ్వడానికి సుముఖత చూపడం లేదు. దీంతో ఆయా బ్యాంకుల రీజనల్ మేనేజర్‌లకు లేఖలు పంపాం. పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై శాఖపరంగా చర్యలు తీసుకుంటాం.

- పి.శ్రీహరి, మెప్మా పీడీ

ఎమ్మెల్యే బీఎన్‌కు విన్నపాలు


వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన 30 అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ త్వరలో సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ సీతారామయ్యకు అభినందన


సీతారామయ్యను అభినందిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను పలువురు అభినందించారు. ఒంగోలులోని వెంకటరమణ నర్సింగ్‌హోమ్‌లో శుక్రవారం పలువురు కలిసి బొకేలు అందజేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హారీష్, నాగబోయిన రంగారావు, వేముల సుబ్బారావు, దొప్పలపూడి వెంకట సుబ్బారావు, లక్కాకుల కృష్ణ, పవన్, అఖిల్, ఉదయ్, శివరామ్‌ప్రసాద్, శేషారావు పాల్గొన్నారు.

నేటి మెప్మా జాబ్ మేళా రద్దు : పీడీ

ఒంగోలు కార్పొరేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు గ్రూపుల పిల్లల కోసం శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మెగా జాబ్ మేళాను రద్దు చేసినట్లు పీడీ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో జాబ్‌మేళా రద్దు చేశామని, మరలా ఎప్పుడు నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు


ఉద్యోగ నియామకపత్రాలను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకం కింద ఆరుగురికి ఉద్యోగ నియామకపత్రాలను జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అందజేశారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆరుగురికి ఆఫీసు సబార్డినేట్‌గా ఉద్యోగాలు ఇస్తూ ప్రతాలను అందించారు. వారిలో పత్రా లక్ష్మి(మండలపరిషత్ కార్యాలయం, ఒంగోలు), పీవై.మారుతీసాయిరాంప్రకాష్(వీవీపాలెం), గోసాని అనంతలక్ష్మి(మార్కాపురం), తమ్మినేని ప్రదీప్‌కుమార్(వెలిగండ్ల), మేకల అనూష(జడ్పీ హైస్కూలు, సంజీవరావుపేట), కొమ్మనూరి సునీతరాణి(జడ్పీ హైస్కూలు, మార్కాపురం) ఉద్యోగులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డిప్యూటీ సీఈవో బాలమ్మ, ఏవో శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ


మహిళలతో మాట్లాడుతున్న పీడీ నారాయణ

మర్రిపూడి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ అవసరాల కోసం మహిళలు జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని శివరాయునిపేటలో జరిగిన గ్రామ మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో 1,022 గ్రామ సంఘాలలో 10,202 మంది పొదుపు మహిళలు ఉన్నారని చెప్పారు. మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెలవారీ గృహ అవసరాలకు కావాల్సిన ఆర్థిక ప్రణాళికలను తయారు చేసుకోవడం ద్వారా మహిళలకు శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ, సీఐఎఫ్, ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా రుణ రూపంలో ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎల్.కోటేశ్వరరావు, సీసీలు యజ్ఞా, రామయ్య, సమాఖ్య కోశాధికారి మరియమ్మ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే విజయం

- ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ వెంకట్

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు దూరంగా ఉంటేనే యువత విజయం సాధించగలరని ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ వెంకట్ అన్నారు. స్టెప్, యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం నిషేధం, సైబర్ నేరాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలు వాడకం వల్ల శారీరక, మానసిక బలాన్ని కోల్పోతారన్నారు. ఎక్కువగా విద్యార్థులకు ఈ మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, వారే వాటి రవాణాలో పాల్గొంటున్నారని చెప్పారు. మత్తు పదార్థాలు సేవించినా, కలిగి ఉన్నా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. సైబర్ క్రైం సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా లోన్లు ఇస్తామంటూ సోషల్ మీడియా యాప్‌ల ద్వారా ఆకర్షించే విధంగా వచ్చే పోస్టులకు యువత మోసపోతున్నారని తెలిపారు. దీనివల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. సైబర్ నేరాల బారిన పడద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ అన్సారియా



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన జీవనోపాధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డాన్ బాస్కో, ఐటీఐ కేంద్రాల్లో మహిళలకు ఇస్తున్న టైలరింగ్ శిక్షణను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, స్వశక్తితో ఎదగాలనేది ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 31 కేంద్రాల్లో టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల పాటు జరిగే ఈ శిక్షణలో ప్రస్తుతం 4,233 మంది శిక్షణ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

ఒంగోలు కార్పొరేషన్: ఆర్టీసీ ప్రయాణించే వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, బస్టాండ్ ఆవరణంలో పారిశుధ్యం, దుకాణంలోని ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్ ధరలను, అలాగే బస్సుల రాకపోకల టైంటేబుల్, ఫిర్యాదులు విభాగం, కార్గో సేవలను పరిశీలించారు. అయితే బస్టాండ్‌లో నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బస్టాండ్‌లోని దుకాణాల్లో నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నందున బస్టాండ్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్రయాణికుల ఫిర్యాదుల కోసం అందుబాటులో ఉండేలా ఫోన్ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఆర్ఎం సత్యనారాయణ, డిపో మేనేజరు శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ఫణికుమారి, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలి

- మాల కార్పొరేషన్ చైర్మన్‌కు జేఏసీ నాయకుల విజ్ఞప్తి


చైర్మన్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు నగరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేయబోతున్న పథకాలు వారి ఆర్థికాభివృద్ధికి ఉపయోగడేలా ఉండాలని మాల సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ సెంటర్‌లో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్‌ను జిల్లాలోని మాల సంఘాల జేఏసీ నాయకులు కలిసి తమ అభిప్రాయలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, జిల్లా నాయకులు గోపీనాథ్, దారా అంజయ్య, బిల్లా చెన్నయ్య, చప్పిడి వెంగళరావు, ఇతర నాయకులు మాట్లాడారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాక్ ఎండ్ సబ్సిడీ విధానం అమలు చేస్తున్నారని, ఇది లబ్ధిదారులకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. గతంలో మాదిరిగానే సబ్సిడీని ముందుగానే విడుదల చేయాలని కోరారు. సిబిల్ స్కోర్ పేరుతో ఎస్సీలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని, అందువల్ల ఆ విధానం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారుల వయస్సు 50 ఏళ్లలోపు నిబంధన పెట్టారని, దీన్ని 60 ఏళ్లకు పెంచాలని కోరారు. ఎస్సీలకు ఇచ్చే రుణాలకు ప్రభుత్వమే సీజీఎంటీ ద్వారా బ్యాంకులకు హామీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్ ఉన్న యూనిట్లను ఎస్సీలకు అందజేసి వారికి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. దీనిపై చైర్మన్ విజయకుమార్ స్పందిస్తూ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈడీ అర్జున్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు


వెంకటేశ్వరకాలనీలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఒంగోలు నగరం వెంకటేశ్వరకాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాటాడారు. ముందుగా అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి ఎస్.మధుసూదనరావు, వైద్యాధికారి అభిజ్ఞచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో..

కొత్తపట్నం: ప్రమాదకరమైన డెంగ్యూ జ్వరం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కొత్తపట్నం, ఈతముక్కల గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపట్నం వైద్యాధికారులు రమ్యదీపిక, మహేష్‌కుమార్ రాజా, ఈతముక్కల వైద్యాధికారి సాయినాథ్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..


సంతనూతలపాడులో అవగాహన ర్యాలీ

సంతనూతలపాడు: మండలంలోని పలు గ్రామాల్లో డెంగ్యూ నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎం.వేములపాడు పీహెచ్‌పీ పరిధిలో డాక్టర్ శ్రావ్య, సంతనూతలపాడు పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నాగరాజు, ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డెంగ్యూ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: డెంగ్యూను నిర్మూలించేందుకు అందరూ అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. శుక్రవారం మద్దిపాడులో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగ్యూ వస్తుందని, జ్వరంతో పాటు ఒళ్ళు నొప్పులు ఉంటాయన్నారు. డెంగ్యూ నివారణకు మందులు అందుబాటులోఉన్నాయని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా డెంగ్యూని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆనంద్‌మోహన్, హెల్త్ సూపర్‌వైజరు బాలకోటయ్య, దిరయా రజిత, పద్మ, నాగరాజ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

మర్రిపూడి: డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకర్ల వైద్యాధికారి సాయిరుచిత అన్నారు. ప్రపంచ డెంగ్యూ నివారణ దినం సందర్భంగా శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల కారణంగా డెంగ్యూ వ్యాపిస్తున్నందున వాటి నిర్మూలనకు ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. విస్తరణాధికారి కొండలరావు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, శ్రీనివాసకుమారి వీరాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలులో వర్షం

- సేదతీరిన నగరవాసులు


వర్షంలో వెళుతున్న సైక్లిస్టు

ఒంగోలు నగరంలో శుక్రవారం ఉదయం కాసేపు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవి ఎండలకు తల్లడిల్లుతున్న ప్రజలకు ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు ప్రస్తుతం కురిసిన వానకు ప్రజలు ఉపశమనం పొందారు.

- ఒంగోలు, ఆంధ్రజ్యోతి


కొత్తపట్నం ఫ్లైఓవర్ వద్ద నిలిచిన వర్షపునీరు

నేడు చీమకుర్తిలో తిరంగా ర్యాలీ : బీఎన్

చీమకుర్తి, మే16(ఆంధ్రజ్యోతి) : భారత్ జవాన్లకు మద్దతుగా ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చీమకుర్తి పట్టణంలో జరగనున్న తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక నెహ్రూనగర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ సాయంత్రం 4 గంటల నుంచి జరిగే తిరంగా ర్యాలీలో ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలపాలని ఆయన కోరారు.

వేంకటేశ్వరస్వామికి శాంతిహోమం

మద్దిపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శాంతిహోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నారాయణం వెంకటాచార్యులు, రవికుమార్, దివి వెంకటశేషాచార్యులు, శ్రీనివాసక్రిష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యే పూజలు జరిగాయి. ఉభయ దాతలుగా నారా శ్రీనివాసరెడ్డి, నారా విజయలక్ష్మి వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీకొని మోటార్‌సైక్లిస్టు గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం గుండ్లపల్లి గ్రోత్ సెంటరులో జరిగింది. పోలీసు కథనం మేరకు.. కీర్తిపాడు గ్రామానికి చెందిన మోంద్రు కార్తీక్ తన స్నేహితులతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళుతూ గ్రోత్‌సెంటర్‌లో రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వేగంగా ఢీకొట్టాడు. దీంతో కార్తిక్‌కు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఐక్యపోరాటం


మాట్లాడుతున్న సుబ్బారావు

చీమకుర్తి, మే16 (ఆంధ్రజ్యోతి) : ఐక్య పోరాటాల ద్వారా కార్మికులు తమ హక్కులు సాధించుకోవచ్చని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. శుక్రవారం చీమకుర్తిలోని పంగులూరి కృష్ణయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలుచేసి కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండలాధ్యక్షులు పల్లాపల్లి ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280


వేలంలో పాల్గొన్న రైతులు, వ్యాపారులు

మద్దిపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280 పలికిందని వేలం కేంద్రం కార్యనిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. మారెళ్ళ క్లస్టర్ రైతులు 480 బేళ్ళు అమ్మకానికి తీసుకువచ్చారు. కనిష్ఠ ధర రూ.235 పలికింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలిమి పొగాకుకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. నాణ్యత లేని పొగాకుకు సీఆర్, నోబిడ్‌లు పెట్టాల్సివస్తుందని, రైతులు గమనించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అబ్బూరి శేషగిరిరావు, వరహాల చౌదరి, మండువ గోవిందరాజులు, మండువ శ్రీరామమూర్తి, కాకర్ల విజయకుమార్, రావి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

907 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం జరిగిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 7338 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. ప్రథమ సంవత్సరం 6609 మందికి 5888 మంది హాజరు కాగా 721 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1636 మందికి 1450 మంది విద్యార్థులు హాజరు కాగా 186 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐవో కంభం, గిద్దలూరు, కొమరోలులోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ట్రిపుల్ ఐటీ కాలేజీ తరలింపును విరమించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు కళాశాలలో కొనసాగుతున్న ట్రిపుల్ ఐటీ కళాశాలను మార్చే విధానాన్ని ఉపసంహరించుకోవాలని మాదిగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యులు కొమ్మూరి సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ మార్పు వల్ల 1300 మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ప్రస్తుతం అద్దె భవన్‌లో ఏడేళ్లుగా నడుస్తుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో పెద్ద విద్యాలయం ఏర్పడం, దీని ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు వైజ్ఞానిక, సాంకేతిక విద్యను అందిస్తూ ఉన్న ట్రిపుల్ ఐటీకాలేజీని మార్చడం సరికాదని, ప్రభుత్వం పునఃసమీక్షించాలని వారు కోరారు.

కొండపిలో వర్షం

కొండపి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో గురువారం రాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజాము వరకూ కొనసాగింది. కట్టావారిపాలెంలోని ఓ భవనం పైభాగంలో పిడుగు పడటంతో పిట్టగోడలో కొంతభాగం దెబ్బతింది. అకాల వర్షంతో ఆరుబయట ఉన్న పొగాకు మండెలు పలుగ్రామాల్లో కొంత మేర తడిచిపోయాయి.

వేలాన్ని పరిశీలించిన ఆర్ఎం

కొండపి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొండపి పొగాకు వేలం కేంద్రాన్ని ఆర్ఎం లక్ష్మణరావు శుక్రవారం సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. రైతులకు, వ్యాపారులకు పలు సూచనలు చేశారు.

సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం

- సీహెచ్‌వోలు


కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల యూనియన్ నాయకులు ప్రకటించారు. గత 18 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో సైతం సామాన్య ప్రజలకు వైద్యసేవలు అందించి వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్న తమపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంటా ప్రసన్న, జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



రాధేశ్యామ్ భైరవ మృతదేహం

కంభం, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మరణించిన సంఘటన కంభం మండలం కందులాపురం పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన రాధేశ్యామ్ భైరవ(18) నాలుగు రోజులక్రితం నెహ్రూనగర్ లోని నివసిస్తున్న బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం రాత్రి స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లిన భైరవ బాత్‌రూంలో వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి షాక్‌తో కిందపడగా వైద్యశాలకు తరలించారు. అప్పటికే భైరవ మరణించినట్లు వైద్యులు తెలుపగా మృతుని బంధువులు మృతదేహాన్ని శుక్రవారం రాజస్థాన్‌కు తీసుకెళ్లారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జగదాంబమాత

మార్కాపురం వన్‌టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం జగదాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రెంటచింతల వరుణ్‌తేజ శర్మ అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకాలు, అలంకరణ కుంకుమార్చనలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడే తిరంగా ర్యాలీ

గిద్దలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్ సందర్భంగా మన దేశాన్ని ఉగ్రవాదుల నుంచి రక్షించిన వీరజవాన్లకు ఘననివాళులు అర్పించేందుకు వీలుగా గిద్దలూరు పట్టణంలో 17వ తేదీ ఉదయం 8.30 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి కుమ్మరాంకట్ట మీదుగా రాచర్లగేటు, గణేష్‌నగర్, మెయిన్‌బజారు మీదుగా తిరిగి గాంధీబొమ్మ సెంటర్ వరకు తిరంగ ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ప్రతి ఇంటికీ నీటి సదుపాయం

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

1.2 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

గిద్దలూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): అతి త్వరలో ప్రతి ఇంటికీ నిరంతరం ఉచిత మంచినీటి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస నగర్, పాములపల్లె రోడ్డు, నల్లబండ బజారు, టీచర్స్ కాలనీలలో సుమారు రూ.1.2 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని తెలిపారు. గతంలో వర్షం పడితే గుంతలమయంగా ఉన్న రోడ్లలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు తెరిచే సమయానికి ప్రతి తల్లి అకౌంట్‌లో విద్యార్థికి రూ.15వేలు జమ చేయనున్నట్లు అన్నారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న సమస్యలను ఇచ్చిన హామీ ప్రకారం రైల్వే ఓవర్ బ్రిడ్జి, సగిలేరు వాగుకు రక్షణ గోడ నిర్మాణం, నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం 160 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు..!

ఏడాది తరువాత పైపులైన్ పనులు ప్రారంభం

దర్శి నుంచి పొదిలి పెద్దచెరువుకు నీటి సరఫరా లైన్

గత వైసీపీ హయాంలో ఆర్థిక అనుమతులు లేకుండానే పనులు

విషయం తెలిసి పనులు ఆపేసిన కాంట్రాక్టర్

ప్రస్తుత ఎమ్మెల్యే కందుల చొరవతో సాగిన వైనం



ప్రారంభమైన పైపులైన్ పనులు

పొదిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : దర్శి నుంచి పొదిలి పెద్దచెరువుకు పైపులైన్ ద్వారా నీటిని నింపేందుకు 50 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు ఏడాది తర్వాత పునఃప్రారంభమయ్యాయి. గత వైసీపీ హయాంలో ఎన్నికల ముందు హడావుడిగా ఆర్థిక అనుమతులు లేకుండానే కాంట్రాక్టర్ 10కోట్ల రూపాయల పనులు చేశారు. బిల్లులు చేసే సమయంలో ఆర్థిక అనుమతులు లేవని గుర్తించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. వివరాల్లోకెళ్తే...

దర్శి ఎన్‌ఎస్‌పీ కెనాల్ నుంచి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు సాగర్ నీటిని పైపులైను ద్వారా తరలించే పనులు ఏడాది తరువాత తిరిగి పునఃప్రారంభమయ్యాయి. సుమారు ఏడాదికి ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మార్కాపురం వచ్చిన సందర్భంగా రూ.50కోట్లతో నిర్మించతలపెట్టిన పైపులైన్ పనులను హడావిడిగా వర్చ్వల్‌గా ప్రారంభించారు. కాంట్రాక్టర్ 10కోట్ల విలువైన పనులు చేసిన తరువాత టెండర్‌లో ఆర్థిక అనుమతులు లేని కారణంగా ఒక్కరూపాయి కూడా బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి చొరవతో ఆర్థిక అనుమతులు తీసుకురావడం, బిల్లుల చెల్లింపులు చకచకా జరగడంతో అదే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం శరవేగంగా పైపులైను పనులు సాగుతున్నాయి. పెద్దచెరువులో నీరునిల్వ ఉంటే పొదిలి పట్టణంలో నీటిఎద్దడి తగ్గుతుందని, భూగర్భజలాలు సమృద్ధిగా ఉంటాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమవడంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సఫలీకృతులయ్యారు. ప్రస్తుతం కుంచేపల్లి సమీపంలో పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం పదేళ్లుగా చెరువులు రెండు ఒట్టిపోవడంతో పట్టణంలో భూగర్భజలాలు పూర్తిగా పడిపోయాయి. ప్రస్తుతం పట్టణంలో అరకొరగావచ్చే సాగర్‌నీటితోనే ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఎట్టకేలకు పైపులైన్ పనులు ప్రారంభమవడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హమ్మయ్యా.. సమావేశం ముగిసింది!

ఎంపీపీతో సహా నలుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరు

అందులో ఇద్దరు టీడీపీ ఎంపీటీసీలు

ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరు



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తూ ఏపీవోను ప్రశ్నిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

పెద్దారవీడు, మే 16 (ఆంధ్రజ్యోతి): హమ్మయ్య... ఎట్టకేలకు పెద్దారవీడు మండల సర్వసభ్య సమావేశం జరిగిందని చేతులు దులిపేసుకున్నారు వైసీపీకి చెందిన మండల పరిషత్ అధ్యక్షుడు. అందుకు కారణం స్వపక్షంలోని ఆరుగురు ఎంపీటీసీలు ఆయనకు వ్యతిరేకంగా సమావేశాన్ని బాయ్‌కాట్ చేయడమే. ఎంపీపీకి మద్దతుగా ఆ పార్టీకి చెందిన ఒకే ఒక ఎంపీటీసీ సభ్యుడు సమావేశానికి హాజరుకాగా, మరొకరు చివరి నిమిషంలో హాజరయ్యారు. టీడీపీకి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు హాజరయ్యారు. సమావేశానికి రవిచంద్రారెడ్డి(టీడీపీ), యేరువ పాపిరెడ్డి(టీడీపీ), దూదేకుల ఫకీరయ్య(వైసీపీ), బెజవాడ పెద్దగురవయ్య(వైసీపీ)తోపాటు ఎంపీపీ మాత్రమే హాజరయ్యారు. మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలుండగా కోరం సభ్యుల హాజరు కేవలం నలుగురితో సమావేశం ముగిసింది. ఏమైనా తేడాలొస్తాయేమోనని అప్పటికప్పుడు సుంకేసుల ఎంపీటీసీ అబ్రూదేవి(వైసీపీ)ని పిలిపించారు. కానీ ఆమె సమావేశం ముగిసిన తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొంది.

వైసీపీ నాయకుల నిరసన

సమావేశం ప్రారంభం కాగానే ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు తెలపకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ఆ పార్టీ ఎంపీటీసీ ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు సమాచారం తెలియపర్చామని ఎంపీడీవో జాన్ సుందరం సమాధానమిచ్చారు. సమావేశం జరపాలని నిర్ణయించి వారం రోజులు కాగా సమావేశం జరిగే ఒక రోజు ముందు ఎమ్మెల్యేకు సమాచారం ఎలా ఇస్తారంటూ నిలదీశారు. తర్వాత సమావేశ మందిరం నుంచి నిరసనగా బయటకు పోయారు. పెద్దారవీడు ఎంపీటీసీ సభ్యురాలు గొట్టం రాజనారాయణమ్మ, భర్త వేణుగోపాలరెడ్డి, గొబ్బూరు ఎంపీటీసీ, మండల ఉపాధ్యక్షురాలు గుండారెడ్డి యోగమ్మ కుమారుడు వెంకటేశ్వరరెడ్డిలు సమావేశానికి హాజరవడం గమనార్హం.

ఉపాధి పనులకు పంచాయతీల తీర్మానం అవసరం లేదా?

గ్రామాలలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి హామీ పనులకు పంచాయతీ తీర్మానాలు అవసరం లేదా అని రామాయంపాలెం సర్పంచ్ పొందుగుల వెంకటరెడ్డి ప్రశ్నించారు. పని చేసినా కూలి రాదాయే శీర్షికన ఆంధ్రజ్యోతితో శుక్రవారం ప్రచురితమైన కథనాన్ని అధికారులకు చూపిస్తూ ఉపాధి హామీలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నించారు. ఎంఈవో-2 శిగంపల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో కొత్తగా 64 మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏవో బుజ్జిబాయ్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతులందరూ రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకోవడానికి గ్రామాలలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఐ గోపి, ఏపీవో సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఏపీఎం కృపావతి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్ష

డీఎస్పీ నాగరాజు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం ద్వారానే ప్రాణాలకు రక్ష అని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు చెప్పారు. స్థానిక కంభం బస్టాండ్‌లో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు శుక్రవారం సాయంత్రం పట్టణ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ 90 శాతం ప్రమాదాల్లో మరణాలు హెల్మెట్ ధరించకపోవడంతోనే జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వాళ్ల హెల్మెట్ ధరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసిందన్నారు. ప్రజలు ఆ దిశగా ముందడుగు వేయడం లేదని చెప్పారు. పోలీసుశాఖ చలానాలు రాస్తే ప్రజలు ద్వేషం పెంచుకుంటున్నారన్నారు. ప్రాణాలకు రక్షణ లాంటి హెల్మెట్‌ను ధరించడం ప్రతి ద్విచక్ర వాహనదారుని బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమ్మరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



గన్నేపల్లి గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అర్థవీడు/కంభం, మే 16 (ఆంధ్రజ్యోతి): అర్థవీడు మండలం గన్నేపల్లిలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ సభలో కూలీలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జాబ్‌కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ పోతోందని తెలిపారు. కొన్నేళ్లుగా జాబ్‌కార్డులు లేని పేద కుటుంబాలకు నేడు జాబ్‌కార్డులు అందజేసి వారికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాఠశాలల ప్రారంభానికి ముందే తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేల చొప్పున తల్లుల ఖాతాలలో జమ అవుతుందన్నారు. తొలుత గ్రామంలో జరిగిన ఖాశింస్వామి, మౌలాలిస్వామి వారి సరిగేసు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకటరమణ, కాశయ్య, సర్పంచ్ మహబూబ్, బాషా, బాలయ్య పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో ఆయన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ర్యాలీలో కేఎస్‌పల్లె, సంజీవరాయునిపేట, యూపీహెచ్‌ఎస్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల గురించి, డెంగ్యూ గురించి ప్రజలను అప్రమత్తం చేసి వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌యూవోలు వెంకటేశ్వర్లు, రంగనాయకులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'దోమలతో జాగ్రత్తగా ఉండండి'



మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఉప్పలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు, ఇళ్లలో దోమలు లేకుండా జాగ్రత్తలు వహించాలని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రావణ్‌తేజ చెప్పారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యం కేంద్రం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రావణ్‌తేజ మాట్లాడుతూ పగలు కుట్టే దోమల ద్వారా డెంగీ సోకుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రరెడ్డి, క్షయవ్యాధి సూపర్‌వైజర్ గోవిందరాజులు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పెద్దారవీడు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ జగదీష్ చెప్పారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక వైద్యశాల నుంచి వైద్యఆరోగ్య సిబ్బంది గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్రావు, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయల్ పాల్గొన్నారు.

పొదిలిలో...

పొదిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఘనంగా జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సుగుణకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డెంగ్యూ వ్యాధిని నివారించేందుకు అందరూ కలిసి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

చేపల విక్రయ కేంద్రానికి మున్సిపల్ అధికారుల తాళాలు

కేంద్రం గేటు ఎదుటే చేపలు అమ్ముతున్న వైనం



అధికారులు తాళం వేయడంతో విక్రయకేంద్రం ఎదుట చేపలు విక్రయిస్తున్న మహిళ

గిద్దలూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ప్రజలను ఇబ్బందిపెట్టేలా చేపల వ్యర్థాలను పడేస్తుండడంతో నగర పంచాయతీ అధికారులు చేపల విక్రయ కేంద్రానికి తాళం వేశారు. దీంతో విక్రయదారులు కేంద్రం ముందు భాగంలో చేపలను విక్రయించడం గమనార్హం. పట్టణంలోని కుమ్మరాంకట్ట వద్ద మున్సిపల్ అధికారులు చేపల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ స్థలంలోనే చేపలను విక్రయించాలని అప్పట్లో చెప్పారు. అయితే విక్రయదారులు కేంద్రంలో చేపలను విక్రయిస్తూ వాటి వ్యర్థాలను చుట్టుపక్కల పడేస్తుండడంతో ఆ ప్రాంతం దుర్వాసనగా మారుతోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమకు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయలేదని విక్రయదారులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం వ్యర్థాలు వేస్తున్నారంటూ విక్రయ కేంద్రానికి అధికారులు తాళం వేశారు. దీంతో విక్రయదారులు తమ జీవనోపాధి ఎలా అంటూ, తాళం వేయడం ఏమిటని, గేటు ముందు చేపలను విక్రయించారు.

నేడు ఎస్‌వీబీఎస్ కళాశాలలో ఉచితవైద్య శిబిరం

కొమరోలు, మే 16(ఆంధ్రజ్యోతి) : కొమరోలు పంచాయతీ గోపానిపల్లి రోడ్డులో ఉన్న ఎస్‌వీబీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 10గంటలకు మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నంద్యాల శాంతిరాం మెడికల్ కళాశాల సీనియర్ వైద్యులచే నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ గురవయ్య తెలిపారు. మండలంలోని పేద ప్రజలు, ఈసీహెచ్ కార్డుదారులకు కూడా ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి శస్త్రచికిత్సలు చేయనున్నామని చెప్పారు. కంటిలోని శుక్లాలను తొలగించడం, కంటిపై పొర ఉన్నవారికి, కంటికి సంబంధించిన ఇతర జబ్బులను పరీక్షించనున్నరని తెలిపారు.

డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



ధర్నా చేస్తున్న డిజైన్ స్లేట్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని పారిశ్రామికవాడలోని ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ముందు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ పాత కూలీరేట్ల ఒప్పందం ముగిసినా నూతన కూలీలు పెంచకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. అనంతరం కార్మికులకు, యజమానులకు చర్చలు నిర్వహించారు. కూలీ రేట్లు పెంచకపోవడంతోపాటు యజమానులు మొండిగా వ్యవహరించడంతో చర్చలు వాయిదాపడినట్లు రఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రూబెన్, వర్కర్స్ యూనియన్ నాయకులు రాములు, బ్రహ్మయ్య, ప్రకాశం, ఓనర్ల అసోసియేషన్ తరపున వెన్నా పోలిరెడ్డి, రావి రమేష్‌రెడ్డి, గుప్తా ప్రసాద్, లక్ష్మీనారాయణ, మోరా వెంకటేశ్వరరెడ్డి, దొండపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, మే 16(ఆంధ్రజ్యోతి):సూక్ష్మ పోషకాల యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి జవహర లాల్‌నాయక్ చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో జవహర్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ విశ్వనాథ్, ఎన్‌జీవో సిబ్బంది ప్రసాద్, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది రాజయ్య, కాశయ్య పాల్గొన్నారు.

చిన్నకండ్లేరును వెలిగొండతో అనుసంధానించాలి

ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సీఎంకు పోస్టు కార్డు పంపిన రైతులు



పోస్టు కార్డులు పంపిస్తున్న సీపీఐ నాయకుల బృందం,రైతులు

పుల్లలచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరును పుల్లలచెరువు చిన్నకండ్లేరుకు అనుసంధానించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని రైతులు కోరారు. శుక్రవారం పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానించాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై రాసి సీఎం చంద్రబాబుకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోనే వెనుకబడిన పుల్లలచెరువు మండలంలో తీవ్రంగా కరువు ఉందని, 1000 అడుగులు బోర్లు తవ్వించినా నీరు పడటం లేదని చెప్పారు. కరువు శాశ్వతంగా పోవాలంటే వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని తీగలేరు కాలువను పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు రిజర్వాయరు వరకు పొడిగించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం, రైతు సంఘం నాయకులు జానకీ రఘు, కోటిరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వాసవి జాగృతి సేవ అభినందనీయం

గిద్దలూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): వాసవి జాగృతి సేవ కార్యక్రమాలు అభినందనీయమని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య చెప్పారు. శుక్రవారం వాసవి జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నగర పంచాయతీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవి జాగృతి పట్టణ అధ్యక్షులు శివపురం హరిక్రిష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకటరామాంజనేయులు, అమ్మవారిశాల కమిటీ మాజీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దర్శిలో నేడు తిరంగా ర్యాలీ

దర్శి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా భారత సైనికులకు మద్దతుగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా దర్శిలో శనివారం ఉదయం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పాల్గొంటారన్నారు. ఈ ర్యాలీలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

తాళ్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): భూముల్లో పోషకాల స్థాయిని బట్టి ఎరువులు వాడుకోవాలని దర్శి వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ అన్నారు. లక్కవరంలో భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు శుక్రవారం భూసార పరీక్షా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ భూమి సజీవంగా ఉండాలంటే పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు సంబంధించిన మెట్ట పొలాల్లో 20 ఎకరాలకు ఒక నమూనా, మాగాణిలో పది ఎకరాలకు ఒక నమూనా చొప్పున సేకరించి భూసార పరీక్షలు నిర్వహించినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాప్ ద్వారా ప్రభుత్వ సేవలు

పామూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మనమిత్ర యాప్ ద్వారా ప్రభుత్వం పౌర సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని టీడీపీ నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం స్కానింగ్ బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా మనమిత్ర వాట్సాప్ యాప్ ద్వారా సేవలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణమూర్తి, టీడీపీ నాయకుడు కమ్మ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

తాళ్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తూర్పుగంగవరంలో పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డెంగ్యూ రావటానికి గల కారణాలు, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఈవో చంద్రశేఖర్‌బాబు, పీహెచ్ఎన్ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మన మిత్ర ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీవో సునీత తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం క్యూఆర్ కోడ్ సేవలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 ప్రభుత్వ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈసేవలు సాంకేతికంగా సురక్షితమని తెలిపారు. రెండో విడతలో మరో 360 రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందన్నారు. అందు కోసం 9552300009 నెంబరును వాట్సాప్ ద్వారా వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో టి.వెంకటరావు, సూపరింటెండెంట్ కల్పన, ఆంతరయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), మే 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతంలో గ్రామ కమిటీలు భాగస్వామ్యం కావాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. మండలంలోని అయ్యలూరివారిపల్లిలో శుక్రవారం గ్రామ కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ముత్యాల వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చిన్నావుల శ్రీనివాసులు, బూత్ కన్వీనర్‌గా సమ్మన తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగిశెట్టి చిన మాలకొండయ్య, జి.రామచంద్రారెడ్డి, ఏ.కృష్ణంరాజు, యూనిట్ ఇన్‌చార్జ్ కె.వెంకటకొండయ్య, కోటగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచితంగా మందుల పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వడదెబ్బ బారిన పడకుండ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని అరివేముల ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ పుండరీ కాంక్షయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని అరివేముల గ్రామంలో ఉచిత వైద్యసేవ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ ఖాజాదావూద్, పాచ్చా సాహెబ్, మంజూర్ అహ్మద్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పీసీపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరిసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగళాపురం సమీపంలోగల గంగగుడి ప్రాంగణంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో అధ్వానంగా ఉన్న రోడ్లన్నింటినీ సీసీ రోడ్లు, బీటీ రోడ్లుగా నిర్మించినట్లు చెప్పారు. పీసీపల్లి మండలంలోనే దాదాపు రూ.5.3 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. దళితవాడల్లో బీటీరోడ్లు వేయించామన్నారు.

తొలుత గంగమ్మను దర్శించుకునేందుకు వచ్చిన డాక్టర్ ఉగ్రకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గంగాభవానిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఉగ్ర ఈ ఏడాది సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ తిరుపాలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, పువ్వాడి నాగరాజు, వడ్డెంపూడి మాధవరావు, పరిమి ఈశ్వరయ్య, నాగేతు శ్రీనివాసులు, వడ్డెంపూడి పెదమాలకొండయ్య, పరిమి మాల్యాద్రి, రాజా, వెంకటసుబ్బయ్య, నాగేశ్వరరావు, సోమయ్య, కొండయ్య, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

» అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
» పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ


దొనకొండ: బ్రాహ్మణపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ముండ్లమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అష్టపద్మాల అంకాలమ్మ, ఆమె సోదరి కాట్ల అంకమ్మ 300వ జాతర శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ఈదరతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈదర బొప్పూడివారిపాలెం, భీమవరం, పూరిమెట్ల, అయోధ్య నగరం, కొమ్మవరంతో పాటు జమ్ములమడక, మక్కెనవారిపాలెం, విజయవాడ, గుంటూరు, వినుకొండ, నరసరావుపేట, ఒంగోలు, అద్దంకి, దర్శి, కురిచేడు, తాళ్ళూరు, ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు జాతరకు వచ్చారు. అంకాలమ్మను, కాట్ల అంకమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. సా యంత్రం బొప్పూడివారిపాలెం టీడీపీ ఆధ్వర్యంలో ఒక ప్రభను, భీమవరం టీడీపీ ఆధ్వర్యంలో ఒక ప్రభను ఏర్పాటుచేశారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో ముండ్లమూరు ఎస్ఐ కె.కమలాకర్, తాళ్ళూరు ఎస్ఐ ఎస్.మల్లికార్జున్, 30 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. జాతర సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు అంకాలమ్మ, అంకమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అంకాలమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

దొనకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వ హించారు. ఓరుగంటి సీతారామ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, గ్రామ పురోహితులు రెంటచింతల సత్యనారాయణశర్మ శాస్త్రోక్తంగా, మంగళ వాయిద్యాల వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. గ్రామ పెద్దలు డాక్టర్ లక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వర రావు, సర్పంచ్ తోటా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ తోటా కోటేశ్వరరావు, ఐటీడీపీ మండల అధ్యక్షుడు వైకే చౌదరి తదితరులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పామూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేనిమడుగు గ్రామంలో గద్దె, కమ్మవారి ఆరాధ్యదైవం శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీనివాసులు, చుంచు కొండయ్య, మన్నం రమణయ్య, గద్దె గంగయ్య, తదితరులు పాల్గొ న్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

కనిగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా దేవస్థానంలో సాయిబాబా కుంభాభిషేక వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు.తొలుత సాయిబాబా దేవస్థానంలో సిద్ధయోగిని విశుద్ధనంద గురుమాతాజి జ్యోతి ప్రజ్వలన చేయగా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హోమ కృతువులు నిర్వహించారు. మాతాజి సత్సంగం నిర్వహించారు. డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి ఆలయకమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికగా, బాబా మహిళాసేవకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి సన్మానించారు.

కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలుఓబులురెడ్డి, ముచ్చర్ల ధర్మారావు, చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, దేవకి సుబ్రమణ్యం, వాగిచర్ల వెంకటేశ్వర్లు, శాంతి బాలు, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీస్‌లు


మాట్లాడుతున్న డిపో మేనేజర్ సయాన బేగం

పామూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సయ్యద్ సయానబేగం తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈసందర్భం గా మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, శీతల పానీయాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక లగ్జరీ బస్సులు నడపుతున్నట్లు తెలిపారు. ఈయాత్రలో 2 రోజులలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి, అరుణాచలం, తిరుత్తని క్షేత్రాలను సందర్శించవచ్చునని చెప్పారు. సరస్వతి నదీ పుష్కరాలకు గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల సంగమంకు కూడా ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు తెలిపారు.

ఈయాత్రలో కాళేశ్వరం, రామప్ప దేవాలయాలు, వరంగల్ భద్రకాళి, వేయి స్తంభాల గుడిని దర్శించుకోవచ్చునని చెప్పారు. ఈ యాత్ర రెండు రోజులు ఉంటుందని తెలిపారు. పా మూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీ స్థలాలను అద్దె ప్రాతి పదికపై 15 సంవత్సరాలపాటు లీజుకు ఇస్తున్నట్టు తెలిపారు. ఈనెల 22న ఒంగోలు డీపీటీవో ఆఫీసులో టెండర్లు ఉంటాయన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సయాన బేగం కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన


ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, మున్సిపల్ చైర్మన్, వైద్య సిబ్బంది

కనిగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పామూరు బస్టాండు సెంటరులో జరిగిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో సృజన మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్ళలో పనికిరాని వస్తువులను కుప్పలుగా వేయడంవల్ల దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లోని పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. డ్రమ్ములు, వాటర్ ట్యాంక్‌లలో తప్పనిసరిగా మూతలు వేసి ఉంచాలన్నారు. అలా చేయకపోతే నీటి నిల్వలలో దోమలు చేరి డెంగ్యూ వైరస్‌కు దారి తీస్తాయన్నారు. పగటిపూట ఇళ్ళలోకి చేరే దోమలతో డెంగ్యూ జ్వరాలు సోకే అవకాశం ఉందన్నారు. దీంతో చలి, జ్వరంతో పాటు, కీళ్ళు, కండరాలు విపరీతంగా నొప్పులు వస్తాయన్నారు. శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ళు నుంచి రక్తస్రావం జరిగి విపరీతమైన దాహంగా ఉంటుందన్నారు. ఈ లక్షణాలు ఉన్న రోగి తప్పనిసరిగా సమీప ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలన్నారు ప్రభుత్వాసుపత్రిలో తగిన పరీక్షలు చేసి చికిత్స అందిస్తారని చెప్పారు. ఆరుబయట నిద్రించేవారు తప్పనిసరిగా దోమ తెరలను వాడాలన్నారు. డెంగ్యూ వైరస్ దోమకాటు గర్భిణులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రమాదంగా మారుతుందన్నారు. వీరు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు, ఎస్‌టీఎస్ బాబురావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని ఆదరించాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 16(ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని ఆదరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం రాత్రి దక్షణాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాలస్థాయి నాటక పోటీలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ నాటక కళలను ప్రోత్సహించి గత వైభోగాన్ని సంతరింపచేయాలని కోరారు. పాత తరం సినీరంగ ప్రముఖులందరూ నాటకరంగం నుంచి వచ్చినవారేనన్నారు. కళారంగంలో ఒక వెలుగు వెలిగిన ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి చరిత్ర సృష్టించారన్నారు. కళలకు ఎంతో బలం ఉందని, ప్రజల్లో వారికి ఎల్లప్పుడూ ఆదరాభిమానాలు ఉంటాయన్నారు. దర్శిలో నాటక కళాపరిషత్ పోటీలు నిర్వహించటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో దక్షణాపురి నాటక కళాపరిషత్ అధ్యక్షుడు కలవకొలను అనంత్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, కళాపరిషత్ నిర్వాహకులు పారా గాలయ్య, ప్రసాద్, శ్రీనివాసు, కేవీ రంగారావు, కేవీజీ కీర్తి తదితరులు పాల్గొన్నారు.


టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంచాయతీ అనుమతి లేకుండా టవర్ నిర్మాణం

పామూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా జనావాసాల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్ పనులను స్థానికులు అడ్డుకున్నారు. పట్టణంలోని చైతన్య హైస్కూల్ వెనుక భాగంలో రాత్రికి రాత్రే సెల్ టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీ అధికారులు నోటీసులిచ్చినా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అరవిందరెడ్డికి శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు.

వినతిపత్రాలు అంజేసినవారిలో వార్డుమెంబర్ ఉప్పలపాటి హరిబాబు, వాసవీమాత దేవస్థాన చైర్మన్ కోట నరసింహారావు, వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఎన్.సాంబయ్య, డాక్టర్ పురుషోత్తం, ఎం.పరమేశ్వరావు, నల్లపాటి మోహన్‌రావు, ఉదయ్‌కుమార్, పరుశురాం, టీవీ నారాయణ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో శిశువు పేర్లు నమోదు చేసుకోవాలి

పామూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శిశువు పుట్టిన నెలలోపే పేరు నామకరణం చేసి సంబంధిత సర్టిఫికెట్ పొందాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతి బిడ్డ పేరు నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక డీవీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీలకు, కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 11 నుంచి 18 సంవత్సరాలలోపు బాల బాలికలు రక్తహీనత బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, కిశోరి బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుల ఎంపిక

దొనకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ అధ్యక్షులను ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో శుక్రవారం ఎంపిక చేశారు. దొనకొండ పట్టణ అధ్యక్షుడిగా షేక్ తోహిద్, భూమనపల్లి అధ్యక్షుడిగా విప్పర్ల రమణయ్య, రుద్రసముద్రం అధ్యక్షుడిగా కొండు వెంకటేశ్వర్లు, ఆరవల్లిపాడు అధ్యక్షుడిగా నంద్యాల చిన్నకోటయ్య, గంగదేవిపల్లి అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాసులు, లక్ష్మీపురం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా వల్లపునేని నాగేశ్వరరావును ఎంపిక చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలి

ఒంగోలు నగరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేయబోతున్న పథకాలు వారి ఆర్థికాభివృద్ధికి ఉపయోగడేలా ఉండాలని మాల సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ సెంటర్‌లో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్‌ను జిల్లాలోని మాల సంఘాల జేఏసీ నాయకులు కలిసి తమ అభిప్రాయలను తెలియజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, జిల్లా నాయకులు గోపీనాథ్, దారా అంజయ్య, బిళ్లా చెన్నయ్య, చప్పిడి వెంగళరావు, ఇతర నాయకులు మాట్లాడారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాక్ ఎండ్ సబ్సిడీ విధానం అమలు చేస్తున్నారని, ఇది లబ్ధిదారులకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. గతంలో మాదిరిగానే సబ్సిడీని ముందుగానే విడుదల చేయాలని కోరారు. సిబిల్ స్కోర్ పేరుతో ఎస్సీలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని, అందువల్ల ఆ విధానం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారుల వయస్సు 50 ఏళ్లలోపు నిబంధన పెట్టారని, దీన్ని 60 ఏళ్లకు పెంచాలని కోరారు. ఎస్సీలకు ఇచ్చే రుణాలకు ప్రభుత్వమే సీజీఎంటీ ద్వారా బ్యాంకులకు హామీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్ ఉన్న యూనిట్లను ఎస్సీలకు అందజేసి వారికి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

దీనిపై చైర్మన్ విజయకుమార్ స్పందిస్తూ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈడీ అర్జున్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల యూనియన్ నాయకులు ప్రకటించారు. గత 18 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవారం కొనసాగాయి.

ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో సైతం సామన్య ప్రజలకు వైద్యసేవలు అందించి వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్న తమపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంటా ప్రసన్న, జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే విజయం

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు దూరంగా ఉంటేనే యువత విజయం సాధించగలరని ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ వెంకట్ అన్నారు. స్టెప్, యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం నిషేధం, సైబర్ నేరాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలు వాడకం వల్ల శారీరక, మానసిక బలాన్ని కోల్పోతార న్నారు. ఎక్కువగా విద్యార్థులకు ఈ మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, వారే వాటి రవాణాలో పాల్గొంటున్నారని చెప్పారు. మత్తు పదార్థాలు సేవించినా, కలిగి ఉన్నా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ క్రైం సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా లోన్లు ఇస్తామంటూ, సోషల్ మీడియా యాప్‌ల ద్వారా యువతను ఆకర్షించే విధంగా వచ్చే పోస్టులకు యువత మోసపోతున్నారని తెలిపారు. దీనివల్ల జరిగే దుష్ప్రరిణామాలను వివరించారు. సైబర్ నేరాల బారిన పడద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ కళాశాల తరలింపును విరమించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు కళాశాలలో కొనసాగుతున్న ట్రిపుల్ ఐటీ కళాశాలను మార్చే విధానాన్ని ఉపసంహరించుకోవాలని మాదిగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు కొమ్మూరి సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ మార్పువల్ల 1300 మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ప్రస్తుతం అద్దె భవన్‌లో ఏడేళ్లుగా నడుస్తుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో పెద్ద విద్యాలయం ఏర్పడటం, దీని ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు వైజ్ఞానిక, సాంకేతిక విద్యను అందిస్తూ ఉన్న ట్రిపుల్‌ఐటీ కాలేజీని మార్చడం సరికాదని, ప్రభుత్వం పునఃసమీక్షించాలని వారు కోరారు.

ఉష్ణోగ్రత (అంచనా)

17-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	26
బాపట్ల	37	28
రెంటచింతల	39	25
చీరాల	37	28


నరసరావుపేట : మొక్కజొన్న కల్లంలో నిలిచిన నీరు


వేటపాలెం మండలం దేశాయిపేట వద్ద రోడ్డుపై పడిన చెట్టు



గుంటూరు : బస్టాండ్ గ్యారేజీలో చేరిన వర్షపునీరు


కొల్లూరు : గాజుల్లంక వద్ద వర్షానికి తడిసిన పచ్చి ఇటుక

ఉరుములు.. పిడుగులు

- పలుప్రాంతాల్లో అర్ధరాత్రి బీభత్సం
- బాపట్ల,గుంటూరులో జిల్లాలో కుండపోత
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం... మురుగుతో రోడ్లు దుర్గంధం
- విద్యుత్, తాగునీటి సరఫరా లేక ప్రజల అవస్థలు


గుంటూరులో కంకరగుంట అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు


యడ్లపాడు : కొత్తపాలెంలో నేలవాలిన దొండ పందిళ్లు

బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. మెరుపులు.. పిడుగులు.. గాలి వాన.. అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న వేళ బీభత్సం. నిశీరాత్రిలో భీకరమైన శబ్దంతో ఉరుములు, కళ్లు మిరు మిట్లు గొలిపేలా ఆకాశంలో మెరుపులు, ఈదురుగాలితో కూడిన జోరు వర్షంతో గుంటూరు, బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు వణికిపోయారు. నడి వేసవిలో వాతావరణ శాఖ అంచనాకు మించి ఈదరు గాలులతో కూడిన వర్షం పడింది. గుంటూరు జిల్లాలో శుక్ర వారం వేకువజామును ముందు 2 గంటల తర్వాత నుంచి ప్రారంభమైన ప్రకృతి విపత్తు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బాపట్ల జిల్లాలో తెల్లవారుజామున నాలుగుగంటల సమ యంలో మొదలైన వర్షం దాదాపు మూడు గంటల పాటు కుండపోతగా కురిసింది. పలుచోట్ల పిడుగులు పడగా గాలి కారణంగా వర్షం పెద్దగా కురవదేమోనని అంతా భావిం చగా అందుకు విరుద్ధంగా భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఈదురుగాలులకు చెట్లు, రేకుల షెడ్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు, తోపుడు బండ్లు, టీ కొట్టు బల్లలు కూడా కొంతదూరం కొట్టుకుపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, దీనిపై తాగునీటి సరఫరా ఆధార పడి ఉండటంతో రెండింటికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం వర్షం వెలిశాక విద్యుత్ సిబ్బంది సహాయక చర్యలను ప్రారంభించినా కొన్ని ప్రాంతాల్లో సాయంత్రానికి కూడా విద్యుత్ పునరుద్ధరణ సాధ్యం కాలే దు. దీంతో ప్రజలు అటు కరెంటు లేక.. ఇటు తాగునీటి సర ఫరా లేక రోజంతా అల్లాడిపోయారు. గాలికి భారీ వర్షం జత కలవడంతో రాత్రి అంతా విద్యుత్ సరఫరాని నిలిపే యడంతో ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. ఉదయం 7 గంటల వరకు అడపాదడపాగా వర్షం కురుస్తూనే ఉన్నది. అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలు కురవడంతో వాతా వరణం చల్లబడి వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు.

పల్నాడు జిల్లా అంతటా గురువారం అర్ధరాత్రి నుంచి కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కల్లాల్లోని పంటలు తడిచిపోయి అన్నదాతలు నష్టపోయారు. అచ్చంపేటలో భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి అమరావతి మండల పరిధి లోని మండెపూడిలో సఫావత్ సాంబయ్య నాయక్ కు టుంబ సభ్యులు ఇంటిలో నిద్రిస్తుండగా ఆకస్మాత్తుగా పిడు గు పడగా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే ఇల్లు పూర్తిగా దెబ్బతింది.

నిజాంపట్నం మండలంలోని అడవుల దీవి గ్రామంలో ఉన్న దేవాలయంలో గాలులకు ధ్వజస్తంభం విరిగి పడింది. చీరాలలోని పలువీధులు వర్షపునీటితో తటాకాలను తల పించాయి. వేటపాలెం మండలం దేశాయిపేట వద్ద గాలు లకు చెట్టు నేలకొరిగి రోడ్డుమీద పడడంతో రవాణా స్తం భించింది. పర్చూరురోడ్డులోని పూసపాడు సమీపంలోని నక్కల వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. బాపట్ల పట్టణంలోని బేతనీయ కాలనీలో గం టల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీరాల, రేపల్లె పరిధిలోని పలు ఏరియాల్లో సైతం కరెంటు సరఫరాకు విఘాతం ఏర్పడింది.

- అమరావతి రాజధానిలోనూ వర్షం ప్రతాపం చూ పించింది. జోరుగా కురిసిన వర్షంతో నేల అంతా బురదమయంగా మారింది. దీంతో వేగవంతంగా జరుగుతోన్న నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. పనులు తిరిగి ప్రారంభం కావడానికి మూడు, నాలుగు రోజుల సమయం పడుతుందని స్థానికులు తెలిపారు. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో రేకుల షెడ్డు కూలిపోయింది.

- గుంటూరు నగరంలో విద్యుత్‌శాఖకు రూ.10 లక్షల నష్టంగా అంచనా వేస్తున్నట్లు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీని వాసబాబు తెలిపారు. రెండు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ (డీటీఆర్) దెబ్బతినటంతో పాటు విద్యుత్ పోల్స్ దెబ్బతిని నష్టం వాటిల్లిందన్నారు. చెట్లు ఎక్కడికక్కడ నేల కొరిగి విద్యుత్ తీగెలపై పడటంతో నగరంలో పలు ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. గార్డెన్స్‌లోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కార్యాలయం ఎదుటనే భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్‌పోల్ పడిపోయి సరఫరా నిలిచిపోయింది. కాలువల్లోని మురుగు అంతా రోడ్ల పైకి చేరి దుర్గంధాన్ని వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అచ్చంపేటలో 7.25 సె.మీ వర్షపాతం

అచ్చంపేటలో 7.25 సెమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపిం ది. మండలాల వారీగా వర్షపాతం అమరావతి 43.5 మీమీ, యడ్లపాడు మండలంలో 39.2 మీమీ, బెల్లంకొండ 34.3 మీమీ, క్రోసూరు 31.3, సత్తెనపల్లి 33.5 మీమీ, గురజాల 32.5, నకరికల్లు 31.4, నరసరావుపేట 38.7, శావల్యాపు రం 25.3, బొల్లాపల్లి 29.4 మీమీ, మా చర్ల 23.4 మీమీ, వెల్దుర్తి 22.8, దుర్గి 24.6, రెంటచింతల 26.9, కారంపూడి 30.7, పిడుగురాళ్ల 25.8, దాచేపల్లి 25, మాచవరం 20.3, పెదకూరపాడు 21.5, రాజుపాలెం 31.5, వినుకొండ 24.1, నూ జెండ్ల 31.6, ఈపూరు 28.3, రొంపిచర్ల 19.6, ముప్పాళ్ల 25.1, నాదెండ్ల 19.6, చిలకలూరిపేట 27.5 మీమీ వర్షపాతం నమోదైంది.

గుంటూరులో భారీ వర్షం

గుంటూరులో 82.5, తుళ్లూరులో 78, మంగళగిరిలో 71, తాడికొండలో 32.5, పొన్నూరులో 20.5, దుగ్గిరాలలో 17.5, ఫిరంగిపురంలో 12.5, తాడేపల్లి లో 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మూడు గంటల్లో 42.87మి.మీ. వర్షపాతం

బాపట్ల జిల్లాలో మూడు గంటల్లో సగటున 42.87మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా అత్యధికంగా అత్యధికంగా యద్దనపూడి మం డలంలో 128 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా వేమూరులో 8.4 మిల్లీమీటర్ల వర్షం కురి సింది. పర్చూరు 81.4, చీరాల 79.8, ఇంకొల్లు 69.2, బాపట్ల 64.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరుకుపల్లి 30.4, పిట్టలవానిపాలెం, కర్లపా లెం మండలాల్లో 38.6 మి.మీ. వర్షం కురిసింది.


బాపట్ల : బర్లీ పొగాకు బేళ్ల కిందకు చేరిన వర్షపు నీళ్లు

రైతులకు కొంత మేర నష్టం..

బాపట్ల, పల్నాడు ప్రాంతంలో కల్లాల్లోని మిర్చిపై రైతులు పరదాలు కప్పి జాగ్రత్తలు పాటించినా గాలివానకు నష్టపోయారు. కల్లాల్లో, ఇంటి ప్రాంగణాల్లో నిల్వ చేసిన నల్లబర్లి పొగాకు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ ధాన్యం చాలా వరకు కోతలు పూర్తయి పంటను అటు కొనుగోలు కేంద్రాలకు తరలించడమో లేక నిల్వ చేసుకోవడమో చేయడంతో ధాన్యం రైతులపై ఈ అకాల వర్షం ప్రభావం పెద్దగా పడలేదు. అయితే సరైన ధర లేక విలవిలలాడుతున్న బర్లీ పొగాకు రైతులు అకాల వర్షం దెబ్బకు మరింత కుదేలయ్యారు. ఈదురుగాలులు ధాటికి వందల ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో దాదాపు 850 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. గాలివాన, వర్షంతో ఉద్యాన పంటల రైతులు విలవిల్లాడిపో యారు. సంగంజాగర్లమూడి, అంగలకుదురు వంటి పలు గ్రామాల్లో నిమ్మతోటల్లో పిందె దశలో ఉన్న కాయలు గాలి వేగానికి రాలి పోవ డంతో రైతులు ఆందోళన చెందారు. కొల్లిపర మండలంలో పలుచోట్ల అరటి తోటలు దెబ్బతిన్నాయి. గాలివాన పొన్నూరు చేబ్రోలు మండలాల్లో వాణిజ్య పంటల రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. పొన్నూరు ప్రాంతంలో గా లుల బీభత్సానికి అవిశె తోటలు విరిగిపడడం తో తమలపాకు పంట నేలమట్టమైంది. చేబ్రోలు మండలం నారాకోడూరు, వేజెండ్ల, శలపా డు ప్రాంతాల్లో తీగ జాతి కూరగాయ పంటలు పందిళ్లు నేలమట్టమయ్యాయి.

హత్య కేసులో ఏడుగురికి జీవితఖైదు

- సీసీఎల్ కోర్టుకు మరో ఇద్దరు మైనర్ల తరలింపు
- వాడరేవు ఘటనపై ఒంగోలు కోర్టు సంచలన తీర్పు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తామని నమ్మించి.. భోజనానికి ఇంటికి పిలిచి కిరాతకంగా హతమార్చిన ఏడుగురు నిందితులకు జీవితఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఏ.పూర్ణిమ శుక్రవారం సంచలన తీర్పు ఇచ్చారు. 2023 అక్టోబరులో చీరాల మండ లం వాడరేవులో చోటుచేసుకున్న కేసుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మోసా సూరిబాబు(30) అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రికి ఘటనకు రెండేళ్ల క్రితం రూ.3లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించకపోవడంతో ఇద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో సింహాద్రి భార్య శాం తితో సూరిబాబుకు వివాహేతర సంబంధం ఉన్నట్లు ప్రచారం జరిగిం ది. ఈ క్రమంలో సింహాద్రి, తన భార్య శాంతి, కుమార్తె, కుమారుడు (మైనర్‌లు) సహాయంతో సూరిబాబును అంతమొందించాలని పన్నాగం పన్నాడు. బంధువులైన వైజాగ్‌కు చెందిన బొంది డేవిడ్, గ్రామానికి చెందిన పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యం లను ఆశ్రయించాడు. పథకం ప్రకారం సూరిబాబుతో వీరు మాటలు కలిపి వారి కుమార్తెను ఇచ్చి పెళ్లి చేస్తామని నమ్మించారు. దీంతో అన్నీ మర్చిపోయిన సూరిబాబు 2023 అక్టోబరు 10న రాత్రి భోజనానికి సింహాద్రి ఇంటికి వెళ్లాడు. అయితే అప్పటికే ఇంట్లో నక్కిన ఐదుగురు, సింహాద్రి కుటుంబ సభ్యులు ఇనుప రాడ్లు, పైపులతో సూరిబాబుపై దాడి చేసి కిరాతకంగా హతమార్చారు. పొద్దుపోతున్నా తమ్ముడు ఇం టికి రాకపోవడంతో సూరిబాబు అక్క మోడిపిల్లి యల్లియమ్మ సింహాద్రి ఇంటికి వెళ్లి ఆరా తీసింది. అయితే వారు సమాధానం చెప్పలేదు. ఆమె అనుమానం పెరిగి స్థానికుల సహాయంతో సింహాద్రి ఇంటికి వెళ్లి బల వంతంగా తలుపులు తీయించి చూడగా రక్తపు మడుగులో పడిఉన్న సూరిబాబును చీరాల ఏరియా వైద్యశాలకు తరలించింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేయగా డీఎస్పీ ఎండీ మోయిన్, రూరల్ సీఐలు శేషగిరిరావు, మల్లికార్జునారావులు దర్యాప్తు చేశారు. పీపీ రామేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. కేసులో అప్పటి మైనర్లుగా ఉన్న సింహాద్రి కు మార్తె, కుమారుడుకు సీసీఎల్ కోర్టులో చార్జీషీటు వేయనున్నారు. కేసు లో కీలకంగా వ్యవహరించి శిక్షపడే విధంగా కృషి చేసిన అధికారులను, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.

మహిళా శిశు సంక్షేమ శాఖలో పోస్టులు

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమశాఖలోని బాలల పరిరక్షణ విభాగంలో ఒప్పంద పద్ధతిలో ఔట్‌రీచ్ వర్కర్ పోస్ట్(పురుష), ప్రత్యేక దత్తత సంస్థలో వైద్యురాలు, ఆయా పోస్ట్‌ల భర్తీ చేయనున్నట్లు క లెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సఖీవన్ స్టాప్‌సెంటర్‌లో కేసువర్కర్-1, పారామెడికల్ సిబ్బంది-1, మల్టీపర్పస్ సిబ్బంది-1(మహిళ) భర్తీ చేస్తామ న్నారు. ఆసక్తి ఉన్న వారు అక్బర్ పేటలోని బాలసదన్‌లో ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.


బాపట్లలో మానవహారం

ప్రపంచానికి భారత్ సత్తా చాటిన సిందూర్

బాపట్ల తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. సైనికులను అభినందిస్తూ శుక్రవారం బాపట్లలో ఆపరేషన్ సిందూర్ విజ యోత్సవం పేరుతో తిరంగా ర్యాలీ జరిగింది. కొత్తబస్టాండ్ నుంచి నాయ కులు, అధికారులు, ప్రజలు జాతీయజెండాలతో భారతమాతకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ దగ్గర, అంబేద్కర్ సర్కి ల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. యుద్ధంలో అమరులైన వారి ఫొటోలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డలం ఆపద వస్తే ఐక్యంగా ఉద్యమి స్తామని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలియజేశామన్నారు. ఈ కా ర్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షు డు తాండ్ర సాంబశివరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాస రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతాజయప్రకాష్ నారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, రేపల్లె జనసేన నాయకు లు మత్తి భాస్కరరావు, జిడుగు విజయమాధురి, హుస్సేన్‌బేగ్, బీజేపీ జి ల్లా అధ్యక్షుడు బంగారుబాబు, బ్రహ్మాండం బాలనారాయణ, బుర్లె రత్త య్య, టీడీపీ సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, జి.గిరిజారాణి, కాగిత నాగభూషణమ్మ, పల్లం సరోజని, దుర్గాప్రసాద్, మామిడి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పోలీసులకు మూడు డ్రోన్లు వితరణ



ఎస్పీ తుషార్‌డూడీకి డ్రోన్లు అందజేస్తున్న దాతలు

దాతలను అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమ ర్థంగా విధులు నిర్వహించేందుకు డ్రోన్లు వినియోగించుకోవాలని దాతలు శుక్రవారం ఎస్పీ తుషార్‌డూడీని కలిసి కలిసి మూడు డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎస్పీ అభినందించారు. బల్లికురవ మండలానికి చెందిన సూర్యడెయిరీ ప్రొపెయిటర్ ఇప్పర్ల అంజిరెడ్డి, సం తమాగులూరు మండలానికి చెందిన గడివర్తి రా మకృష్ణ, బల్లికురవ, సంతమాగులూరు స్టేషన్లకు డ్రోన్లను అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు శేషగిరి రావు, వెంకట్రావు, ఎస్ఐలు నాగరాజు, నాయిబ్‌ర సూల్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పార్కుతో ఉద్యోగాలు

చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, మే 16 (ఆంధ్రజ్యోతి): సోలార్ పార్కు ఏర్పాటుతో యు వతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. సోలార్ పార్కు ఏర్పాటుపై శుక్రవారం మండలం లోని ఎస్ఎల్.గుడిపాడు, సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి, కుందుర్రు గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. గుడిపాడు గ్రామ పరిధిలో 310 ఎకరాలను సోలార్ పార్కుకు అందిస్తే త్వరలో పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాలుష్యం సమస్యపై కొందరు రైతులు ప్రస్తావించగా ఏమీ ఉండదని, ఎవరికీ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సోలార్ పార్కు ఏర్పాటు చేస్తుందన్నారు. మామిళ్లపల్లి, కుందుర్రు గ్రామాలలో 1,269 ఎకరాల భూములు ఈ ప్రాజెక్టు కోసం సేకరించాల్సి ఉందన్నారు. తహసీల్దార్లు రవినాయక్, రవిబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సెజ్‌కు మామిళ్లపల్లి రైతుల వ్యతిరేకత

సంతమాగులూరు మే 16 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు మండలంలోని కుందూరు, మామిళ్లపల్లి గ్రామంలో శుక్రవారం పునర్ ఉత్పాదక ఇంధన తయారీ ప్లేట్ల కేంద్రాన్ని స్థానిక రైతులు వ్యతిరేకించారు. 1700 ఎకరాలు భూ సేకరణకు సంబంధించి ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రవిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వివరాలను ఆర్‌డీవో వెల్లడించారు. దీనిపై రైతులను అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. కుందూరు గ్రామానికి సంబంధించిన రైతులు కొంతమంది సముఖత వ్యక్తం చేయగా, మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ భూములను ఇవ్వడానికి అంగికరించడం లేదు. తమకు జీవనోపాధి ఇదేనని తమ భూములు ఇవ్వడానికి తాము ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని ఆర్‌డీవో టి చంద్రశేఖర్ కు లిఖితపూర్వకముగా అర్జీని సమర్పించారు. రాసిన అర్జీని గ్రామసభలో ఆర్ఐ సమక్షంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అధికారులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

యద్దనపూడి, (మార్టూరు)మే 16 (ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని యద్దనపూడి టీడీపీ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఆపరేషన్ సిందూర్ ర్యాలీని పార్టీనాయకులు గ్రామంలో నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభానికి ముందు పాకిస్థాన్‌తో చేసిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరజవాను మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. తరువాత గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారకరామారావు, గొట్టిపాటి సతీష్, రావిపాటి సీతయ్య, కొరటాల వంశీకృష్ణ, కోయ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామంతో ఆరోగ్యం



పుస్తకాలు అందజేస్తున్న వైద్యులు

బల్లికురవ. మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు వ్యాయామంతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చు అని ఎంపీడీవో కుసుమ కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిజామ్ ఫీజియో థెరపీ డాక్టర్స్‌చే ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఫీజియో థెరపీ వైద్యులు వెంకటరమణ, రామ్‌జీ గోవిందాలు మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియెగం పెరిగి ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడికి చెందుతున్నారని తెలిపారు. ప్రతి రోజు కొంత సేపు వ్యాయమం చేయాల న్నారు. అలానే ప్రశాంత వాతావరణంలో కొంత సేపు ఉండాలన్నారు. ఎంత ఒత్తిడి ఉన్న ఉద్యోగులు క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగపర్చుకుని కుటుంబ ఆదాయ వనరుగా ఉపయోగించుకోవాలని ఎంపీడీవో బత్తిన శింగయ్య అన్నారు. శుక్రవారం అద్దంకి పట్టణంలోని రూరల్ గ్రామాల మహిళలకు సంజీవనగర్‌లో జరుగుతున్న ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఎంపీడీవో సింగయ్య, ఈవోపిఆర్‌డి ఆర్‌వీఎస్ ప్రసాదరావులు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ, కల్పిస్తున్న వసతులు, శిక్షకుల హాజరు శాతాలను ఆయన పరిశీలించారు. ఉచిత శిక్షణ కోసం అ వసరమైన వసతులు ఇబ్బందులు లేకుండా ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. శిక్షణ పొందుతున్న మహిళలు వంద శాతం హాజరు అ య్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

అద్దంకిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉ మమహేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఉమమహేశ్వరరావు మాట్లాడుతు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌ల ద్వారా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయడం ద్వారా కార్మికులు తమ హక్కులను కాపాడుకోవచ్చన్నారు. మున్సిపల్ కార్మికులను కార్మికులుగా గుర్తించకుండా ప్రభుత్వ ఉద్యోగుల జాబిత ప్రకారం ఎటువంటి సంక్షేమ పథకాలకు అర్హులు కాకుండా చేస్తున్నారన్నారు. ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక దేశవ్యాప్తసమ్మె జూలై 9వ తేదికి వాయిదా పడిందని, 20న నిరసన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆదాము, గాలి భీష్మా, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఏపీపీటీడీ జోన్- 3 పరిధిలోని వివిధ బస్‌స్టేషన్, బస్ డిపోలలో ఖాళీగా ఉన్న 26 ఓపెన్ ప్రదేశాలను 15 సంవత్సరముల లీజు పద్ధతిలో అందించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పర్చూరు బస్టాండ్ - 778 చదరపు గజాలు (చ.గ) పర్చూరు బస్టాండ్ బిట్ -2లో 37.92 చ.గ, చీరాల గ్యారేజీ సమీపంలో 52,950 చ.గ, వేటపాలెం బస్టాండ్ 2619 చ.గ, ఇంకొల్లు 24200 చ.గజాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అలాగే చీరాల ఆర్టీసీ డిపోలో ఈ నెల 24న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరములకు 73828 88506 నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నుంచి ప్రారంభమై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డా.యాకోబు మాట్లాడుతూ ఈ ఏడాది చెక్, క్లీన్, కవర్ అనే నినాదాలతో ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. తద్వారా పరిసరాల్లో మురుగు నిల్వలు, కుంటలు వంటివి పరిశీలించడం సులువుగా ఉంటుందన్నారు. పరిసరాల పరిశుభ్రత లేమితో డెంగ్యూ వంటి ప్రాణాంతక సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.మనీష్ నంద, డా.శిరీష, డా.ప్రణయ్, మలేరియా అధికారి శేషుబాబు, దాస్, అనీల్, బేబిమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేక పూజలు

- కలశయాత్రకు ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- రాతిముఖ మండప నిర్మాణానికి విరాళం



లక్ష్మీనరశింహస్వామి అభిషేకానికి పూజా సామగ్రితో వెళుతున్న ఏసీ తిమ్మనాయుడు, రిషిత దంపతులు, దాతలు

అద్దంకి, మే 16 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేకము పూజలు మూడవరోజు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండ క్షేత్రాధిపతి లక్ష్మీ నరశింహ స్వామి దేవాలయంలో పసన్నాంజనేయస్వామి దేవాలయం ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, రిషిత దంపతులు, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం, జీవధ్వజస్తంభం దాతలు నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు, మేదర మెట్ల రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డిలు దంపతులతో కలిసి లక్ష్మీనరశింహస్వామి వార్లకు విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకము, సహస్రనామ తులసీదళార్చన నిర్వహించారు. లక్ష్మీనరశింహస్వామి దేవాలయం ఈవో మద్దినేని శ్రీనివాసరావు, శిద్దా హనుమంతరావు దంపతులు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, గట్టుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద గురువందనం, గణపతిపూజ, మండప పూజలు, మహన్యాసపారాయణం, రుద్రపారాయణం, సూర్య నమస్కారాలు, మంత్రఅనుష్టానం, వేదపారాయణం, సుదరకాండ పారాయణం, జలాధివాసము నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రదర్శించిన శ్రీనివాసకళ్యాణం, కూచిపూడి నృత్య ప్రదర్శన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 19న జరిగే మహాకుంభాభిషేకమునకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహాకుంభాభిషేక కలశయాత్రకు ఏర్పాట్లు

అద్దంకి, మే16 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం సందర్భంగా నిర్వహించే కలశయాత్రకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. 19న ఉదయం 9.03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 19న ఉదయం 5 గంటలకు అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మనది నుంచి సుమారు 1500 మంది మహిళలు కలశములతో నీటిని తీసుకొని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వరకు పాదయా త్రగా చేరుకుంటారు. ఐదు నదులు, మూడు సముద్రాల నుంచి ఇప్పటికే తీసుకొచ్చిన జలంతో పాటు గుండ్లకమ్మనది నుంచి మహిళలు కలశములతో తీసుకు వచ్చిన జలాన్ని మహాకుంభాభిషేకంలో వినియోగించ నున్నారు. గుండ్లకమ్మనది నుండి మహిళలు తీసుకు వచ్చే కలశములను పసుపు, కుంకుమ పూసి, పసుపుకొమ్ములు కట్టి సిద్ధం చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల మహిళలు కలశముల అలంకరణ పనులు శింగరకొండ లో చేస్తున్నారు.

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి పలువురు దాతలు శు క్రవారం విరాళాలు అందజేశారు. మండలంలోని నాగులపాడుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి అడుసుమల్లి కిషోర్, పార్వతి దంపతులు రూ.1,00,116 లు, కలవకూరు కు చెందిన గూడా వెంకటనారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు రూ.1,11,116లు, అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన గడ్డం బసవయ్య జ్ఞాపకార్థం భార్య వెంకటరత్నం రూ.1,01,116లు, పాములపాటి శంకరనాగసాయి మణికంఠ రూ.1,00,232 రూపాయలను ఈవో తిమ్మానాయుడు కు అందజేశారు.







కలశాలను సిద్ధం చేస్తున్న మహిళలు, లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న ఈవో, అర్చకులు, మండపానికి విరాళం అందజేస్తున్న అడుసుమల్లి పావని

గుండ్లకమ్మ వంతెనపైనే నిలిచిన వర్షపునీరు

అద్దంకిలో 47.4 మి.మీ వర్షపాతం నమోదు



గుండ్లకమ్మ వంతనపై నిలిచిన వర్షపునీరు

అద్దంకి, మే16 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో శుక్రవారం 47.4 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. వేకువజామున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నది వంతెనపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. నీరు కిందకు వెళ్లేతూములు పూడిపోవడంతో వంతెనపైనే నిలిచిపోయాయి. అసలే శిథిలావస్థకు చేరిన వంతెన కావడంతోపాటు నీరు నిలవడంతో గోతులు మరింత పెద్దవగా మారాయి. గోతులలో నీరు నిలిచి వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. గోతులను గమనించకుండా వేగంగా వెళ్తుండడంతో బురద నీరు చింది ద్విచక్ర వాహనచోదకులపై పడి ఇబ్బంది పడ్డారు. కనీసం వర్షపు నీరు కిందకు పోయే విధంగా చర్యలు చేపట్టక పోవడంతో పాటు బ్రిడ్జిపైన పేరుకు పోయిన మట్టిని ఎప్పటి కప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. కొద్ది ప్రాంతాలలో మొక్కజొన్న పంట కోత దశలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షంతో రైతులు పరుగులు

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులు భారీ వర్షం కురవడంతో పంటలు సాగు చేసిన రైతులు పరుగులు పెట్టారు. పలు గ్రామాలలో మిర్చి, మొక్కజొన్న కల్లాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచింది. దీంతో రైతులు పంటలకు పరదాలు కప్పి పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేశారు. బల్లికురవ మండలంలోని రామాంజనేయుపరం, సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు,. కొత్తూరు, వెలమవారి పాలెం తదితర గ్రామాలలో ఎండు మిర్చి కోతలు తుది దశలో ఉన్నాయి రైతులు మిర్చిని కల్లాల్లో ఆర బెట్టారు. ఉన్నట్టు ండి ఒక్కసారిగా భారీ వర్షం గాలులు రావటంతో రైతులు పంటలను కాపడుకోనేందుకు పడరాని పాట్లు పడ్డారు. చెన్నుపల్లి గ్రామంలో బోరు బావుల ద్వారా సాగు చేసిన నూగు పంట నేల కరిచింది. ఎండల ప్రభావం నుండి భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. ఉరుములు, గాలుల ప్రభావానికి విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది.

అర్ధరాత్రి కత్తులతో ఇరువురిపై పలువురు దాడి

- పారిపోయి ప్రాణాలు కాపాడుకున్న యువకులు
- పలుచోట్ల స్వల్ప గాయాలు
- కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి ఆరుగురు వ్యక్తులు బీభత్సం సృష్టించారు. మద్యంసేవించి వాహనాలు నడుపుతూ ప్రయాణికులను భయభ్రాంతులు చేశారు. స్థానిక ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్లా, బాజీ ద్విచక్ర వాహనంపై బస్టాండ్‌లో స్నేహితుడిని కలిసేందుకు వెళ్లారు. అయితే అప్పటికే అటువైపు రెండు ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న ఆరుగురు వీరి వద్దకు వచ్చి వాదనకు దిగారు. వారి వద్ద ఉన్న కత్తితో ఎటువంటి సంబంధాలు లేని వీరిపై పలుచోట్ల దాడి చేశారు. దీంతో వీరు భయాందోళనతో పారిపోయిప్రాణాలు కాపాడుకున్నారు. ఈ నేపథ్యంలో స్వల్ప గాయాలతో చికిత్స పొంది శుక్రవారం ఉదయం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితులు కొంతకాలంగా వైకుంఠపురం మీదుగా స్వర్ణ, ఇంకొల్లు తదితర ప్రాంతాలకు వెళ్లే వారిపై అర్ధరాత్రులు దాడులకు పాల్పడి నగదు దోచుకుంటున్నట్లు సమచారం. ఆరుగురు వ్యక్తులు (వీరిలో ఒకరు రౌడీ షీటర్) కొత్తపాలెంలో అల్లరి మూకలను తయారు చేసి విధ్వంసాలు సృష్టిస్తున్నట్లు పోలీసులు తెలుసుకుని విచారిస్తున్నారు.

సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన ఆరు వాహనాలకు సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. దీంతో వేలంలో సుమారు 9 మంది పాల్గొని రెండు స్కూటీలు, ఒక ద్విచక్ర వాహనం, అప్పే ఆటోను దక్కించుకున్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.1.38 లక్షలు ఆదాయంతో పాటు కొనుగోలుపై అదనంగా 18 శాతం జీఎస్‌టీ సమకూరిందని సీఐ తెలిపారు.

ఇది విజయవంతమైన ప్రజాదర్బార్..

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజాదర్బార్ విజయవంతమైందని ఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, తదితర టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశానుసారం శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 95 అర్జీలు స్వీకరించారు. అందులో నివేశన స్థలాలు 60, పెన్షన్ 20, ఇతర సమస్యలు 15 ఉన్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే దృష్టికి చేర్చి సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో గంజి పురుషోత్తం, రావినూతల నాగేశ్వరరావు, అంగిరేకుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు విధిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని తహసీల్దార్ సింగారావు కోరారు. మండలంలోని కోటపాడు, బూదవాడ గ్రామాలలో శుక్రవారం కౌలు రైతులకు సీసీఆర్‌సీ. కార్డుల ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తింపు కార్డు పొందిన వారికి రైతులకు అందే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సున్నావడ్డీకి పంటరుణం, అన్నదాత సుఖీభవతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు, ఇతర రాయితీలు పొదవచ్చన్నారు. గుర్తింపు కార్డు కొరకు కౌలు రైతులు వీఆర్‌వో, వీఆర్ఏలకు సంబందిత పత్రాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వీఆర్‌వోలు బుల్లయ్య, నాని, వీఆర్ఏలు అక్షా రాణి, అలగ్జాండర్, పలువురు కౌలురైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : గ్రామాలలో కౌలు రైతులకు సాగుదారు హక్కు పత్రాలను అందజేస్తా మని ఏవో కుమారి తెలి పారు. శుక్రవారం మండలం లోని ముక్తేశ్వరం, బల్లికురవ గ్రామాలలో కౌలు రైతుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు భూములు కలిగిన రైతులు కౌలు రైతులకు సాగుదారు హక్కుపత్రాలు అందిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సమావేశంలో వీఆర్‌వో ఆశోక్ పాల్గొన్నారు.



1930లో శింగరకొండ ఆలయం



1960లో శింగరకొండ ఆలయం



2021లో శింగరకొండ ఆలయం

అచెంచల విశ్వాసంతో అద్భుత క్షేత్రంగా..

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం గత శతాబ్దం క్రితం ప్రసిద్ధక్షేత్రంగా ఉద్భవించింది. అప్పటి దేవాలయం చిత్రాలను చూస్తే నేటి యువత ఆశ్చర్యానికి గురవుతుంది. ఒకప్పుడు ఆలయం వద్ద తాటాకు పందిళ్ల మాత్రమే ఉండేవి. చుట్టూ రాజగోపురాలు లేవు. ప్రహరీ కూడా లేదు. ప్రస్తుతం రాతి మండపం నిర్మాణంతో దేవాలయం అద్భుత క్షేత్రంగా రూపుదిద్దుకొంది. మరో నాలుగైదు సంవత్సరాలలో మరింత మార్పు రానుంది. నాలుగు వైపులా రాజగోపురాలు, ప్రాకార మండపాలను పూర్తిగా రాతి తో నిర్మించనున్నారు. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

అనుమానాలు కాదు... ఆధారాలే ముఖ్యం

ముప్పా సురేష్ కీలక కుట్రదారుడే

అతడిని, అతని వెనుక ఉన్న వారినీ వదలం

- సిఫారసులు లేవు, ఒత్తిళ్లు అంతకన్నా లేవు
- అరెస్టులే కాదు.. వారికి శిక్షపడే విధంగా చేస్తాం
- వీరయ్య హత్య కేసు దర్యాప్తుపై ఎస్పీ దామోదర్
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అనుమానాలపై స్పష్టత



(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

'ప్రజల అనుమానాలు, అపోహల కన్నా దర్యాప్తులో వెల్లడైన నిజాలు, లభించిన ఆధారాలే ముఖ్యం. తదనుగుణంగానే టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి కేసులో ముందుకెళ్తున్నాం. ఈ కేసులో ముప్పా సురేష్ పాత్ర కీలకం. హంతకుల్లో నాగరాజు పాత్ర కూడా ఎక్కువే. వారిని వదలం. ముఖ్యంగా సురేష్ వెనకున్న వారిని వదిలే ప్రసక్తే లేదు. కుట్రదారులు, హంతకులను అరెస్ట్ చేయడమే కాదు. వారికి శిక్షపడే విధంగా కేసును ముందుకు తీసుకువెళ్లడం మా లక్ష్యం' అని ఎస్పీ దామోదర్ స్పష్టం చేశారు. టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో కొందరిని అరెస్ట్ చేశామని, మరికొందరి కోసం గాలిస్తున్నామని ఇటీవల ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే దర్యాప్తుపై కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఎస్పీ దామోదర్ స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు

వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగిందని ఎస్పీ చెప్పారు. నిత్యం డీజీపీ పర్యవేక్షించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా దర్యాప్తునకు అనుగుణంగానే ముందుకు సాగాలని చెప్పారని ఒక ప్రశ్నకు బదులుగా ఎస్పీ స్పష్టం చేశారు. నిందితులు ఎవరనేది మాకు ముఖ్యం కాదు.. వారు ఏ పార్టీ అనేది అనవసరం. ఆ తరహాలోనే దర్యాప్తు చేశామని వెల్లడించారు. అనుమానితులుగా గుర్తించి ఇప్పటికే చాలామందిని విచారించామన్నారు. దర్యాప్తులో వెల్లడైన విషయాలకు అనుగుణంగా ఆ కేసులో అనుమానం ఉన్న వారినే నిందితులుగా తీసుకున్నామని తెలిపారు. మరో ప్రశ్నకు బదులుగా ఏ దశలోనూ రాజకీయ దురుద్దేశంతో ముందుకు పొమ్మని మాకు సిఫారసు చేసిన వారు గానీ, బలవంతం చేసిన వారుగానీ లేరన్నారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా ముందుకు సాగారనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు.

కుట్రలో సురేష్ పాత్ర కీలకమే

'అమ్మనబ్రోలు గ్రామానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ముప్పా సురేష్ కూడా వీరయ్య హత్యకేసులో ప్రధాన కుట్రదారుడే. అందుకు తగిన ఆధారాలు మావద్ద ఉన్నాయి. అతన్నే కాదు. అతనికి అండగా ఉన్నవారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు' అరి ఎస్పీ స్పష్టం చేశారు. ఈ విషయంలో వెల్లడైన కొన్ని అనుమానాలను ఆంధ్రజ్యోతి వ్యక్తంచేయగా అవి అనుమానాలే. మేము నిజాలకు అనుగుణంగా ముందుకుపోతున్నాం. ఆయన ఎవరు, ఏపార్టీ, ఏస్థాయి వారు, ఎవరు మద్దతు ఉందనేది మాకు అనవసరమని చెప్పారు. మరొక ప్రశ్నకు బదులుగా ముప్పా సురేష్ దేశంలోనే ఉన్నారు. మాకు దొరకాల్సిందే. ఒంగోలు జైలుకు వెళ్లాల్సిందేనని ఎస్పీ కరాఖండిగా చెప్పారు. ఆయన్ని తప్పించాలని ఒత్తిడి మీకు వచ్చింది కదా.. ఫోన్‌లో మీడియాకు అందుబాటులో ఉన్న వ్యక్తి మీకు ఎలా దొరకకుండా ఉన్నారని ప్రజలు అనుమానిస్తున్నారని ప్రశ్నించగా.. 'అనుమానాలు, అపోహలు వేరు. కుట్రదారుల్లో అతని పాత్ర ఉందని మేము గుర్తించాం. ఆధారాలు సేకరించాం. తదనుగుణంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం ఖాయం. అలాగే దర్యాప్తు ఇంతటితో పూర్తికాలేదు. సురేష్ వెనుక ఎవరున్నారన్న అంశంపై కూడా విచారిస్తున్నాం. కచ్చితంగా కూపీ లాగుతాం. ఎవరు ఉన్నా వదిలే ప్రసక్తే లేదు' అని ఎస్పీ వెల్లడించారు. ఇంకో ప్రశ్నకు బదులుగా అతను ఏ రాజకీయ పార్టీ అనేది మాకు ముఖ్యం కాదు. కానీ మీరన్నట్లు ప్రధానంగా వైసీపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఉదంతాలు మా దృష్టికి వచ్చాయని ఎస్పీ చెప్పారు. ఇంకో ప్రశ్నకు బదులుగా ఇంకా మాకు దొరకని వారిలో నాగరాజు అనే నిందితుడు హంతకులలో ఒకరు. హతుడు వీరయ్యను ఒక పక్క నుంచి వంశీ కత్తితో పొడవగా, రెండో పక్క నుంచి నాగరాజు కూడా పొడిచాడు. నాగరాజును తప్పకుండా పట్టుకొస్తాం. జైలుకు పంపుతామన్నారు. ఇప్పుడేదో అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం కాదు. తుది విచారణలో కుట్రదారులకు, హంతకులకు శిక్షపడే విధంగా సేకరించిన ఆధారాలతో ప్రాథమిక దర్యాప్తు గానీ, ఛార్జీషీటును కానీ రూపొందిస్తున్నామని ఎస్పీ చెప్పారు. మా లక్ష్యం అరెస్టు చేయడం కాదు. కోర్టులో అందరికి శిక్షపడటమేనని స్పష్టం చేశారు.

అవీ..ఇవీ..

డెంగ్యూవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చినగంజాం, మే 16 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం చినగంజాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. నీటి నిల్వలపై మూతలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వినియోగించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పాటించడం ద్వారా డెంగ్యూవ్యాధిని, వాటికి కారణమైన డెంగ్యూ దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. డెంగ్యూ వ్యాధి దోమల వ్యాప్తి నిర్మూలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీ.హెచ్‌వో, సీహెచ్‌ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంజేఏవై కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

చినగంజాం, మే 16(ఆంధ్రజ్యోతి) : 60 సంవత్సరాలు దాటిన వారికి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ఆరోగ్య కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్, ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ సీ.హెచ్. ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజలకు పీఎంజేఏవై కార్డులపై శుక్రవారం సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, ఆరోగ్యమిత్రులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అందజేస్తున్న పీఎంజేఏవై కార్డులతో దేశంలో ఎక్కడైనా వైద్యఖర్చుల నిమిత్తం ఐదు లక్షల రూపాయిల వరకు ఆరోగ్య సేవలు పొందవచ్చునని వైద్యాధికారి తెలిపారు. కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలో ఈకేవైసీ చేసిన 395 మందికి ఆన్‌లైన్‌లో కార్డుల కొరకు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ హెచ్‌ఈవో యూ.వెంకటరమణ, సూపర్‌వైజర్లు శ్రీధర్, మాధవి, వరదానం, 104 డిఈవో పొదిలి రాఘవ, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఆరోగ్యమిత్రలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తిరుమలకు కూరగాయలు

మార్టూరు,మే16(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆదివారం మార్టూరు నుండి 80 వేల మందికి సరిపడా కూరగాయలను పంపిస్తున్నట్లు మార్టూరులోని శ్రీవెంకటేశ్వరస్వామి భక్త సమాజం వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలలోని అన్నదానసత్రానికి మార్టూరులో ఉదయం 8 గంటలకు బొడ్డురాయి సెంటరు నుంచి కూరగాయలను తీసుకొవెళ్లే వాహనం బయలుదేరుతుందన్నారు. ఈ శ్రీవారి వాహనం కు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఊరేగింపుగా బయలు దేరి పెద్దఖానా వద్దకు చేరుకొని అక్కడనుండి తిరుమలకు బయలుదేరివెళ్లనున్నట్లు సమాజం వారు తెలిపారు.

19న నాగండ్లలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఇంకొల్లు, మే 16,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్ల గ్రామంలో వేంచేసిన గంగాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 19న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు సర్వంసిద్ధం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మేళతాళాల నడుమ శివనామస్మరణతో మూలవిరాట్, ధ్వజస్తంభానికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు కోరారు.

నేడు జానపదకళాపీఠం రజతోత్సవం

అద్దంకిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): జానపద కళాపీఠం అద్దంకి రజతోత్సవ వేడుకలు శనివారం స్థానిక బంగ్లారోడ్డులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం రజతోత్సవ వేడుకలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో బౌద్ధం- జానపదం ఉపన్యాస కార్యక్రమం సాయంత్రం 4 గంటల నుండి ప్రజల పాటలు, సాంస్కృతి కార్యక్రమాలు, డప్పు విన్యాసం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సభాకార్యక్రమం, అనంతరం సాంస్కృతిక కళా పురస్కారాల సభ జరుగుందని తెలిపారు. ప్రజలందరు హాజరై జయప్రదం చేయాలని కోరారు.





పోలూరు వద్ద పొంగి పొరలుతున్న వాగు, ఉప్పుటూరు వద్ద పొలాల్లో పొగాకు మండెల కిందకు చేరిన నీరు, అకాల వర్షానికి తడిచిపోయిన మిర్చిని ఎండపెట్టిన రైతులు

అకాల వర్షంతో అతలాకుతలం

పొంగి పొర్లిన వాగులు

పర్చూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఉరుములు మెరుపులు, గాలి దుమారంతో కూడిన భారీవర్షంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కరిసిన వర్షంతో వాగులు, కాలువలు పొంగి పొర్లాయి. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని యద్దనపూడిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో పోలూరు వద్ద వాగుపొంగి రహదారులపై భారీగా ప్రవహించింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అదే విధంగా ఇంకొల్లు మండలం పూసపాడు వద్ద కప్పలవాగు ఉధృతంగా ప్రవహించింది. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పాత మద్రాసు రోడ్డు కావడంతో పర్చూరు నుండి ఇంకొల్లు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించాల్సి ఉంది. వాగు వద్ద ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా ఇంకొల్లు సీఐ రమణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోలు నిలిపివేశారు. అలాగే పర్చూరు మండలం నూతలపాడు వద్ద నక్కవాగులో భారీగా నీరు చేరటంతో సమీపంలోని పంట పొలాలను ముంచెత్తాయి. వర్షంతోపాటు గాలి దుమారం కూడా తోడుకావటంతో పెద్ద ఎద్ద వృక్షాలు సైతం కూలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పంటలను కాపాడుకొనేందుకు రైతుల పాట్లు

ఒక్కసారిగా అర్ధరాత్రి అకాల వర్షం కురవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. పంటపొలాల్లో ఆరబెట్టిన మిర్చి గాలి దుమారంతో కూడిన భారీ వర్షం పడటంతో తడిచి పోయింది. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో మిర్చిరైతులు అర్ధరాత్రి సమయంలో పంటపొలంలోనే వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతోపాటు వైట్ బర్లీ పొగాకు సైతం కొంతభాగం పొలాల్లోనే ఎండకట్టి ఉంది. అధిక భాగం మండెలు వేసి పరదాపట్టలు కప్పి ఉన్నా గాలిదుమారానికి పట్టలు లేచిపోయి కొంత పొగాకు తడిచి పోయింది. ఇప్పటికే చేతికి అందివచ్చిన పంటను అమ్ముకోలేక అవస్థలు పడుతున్న రైతులకు అకాల వర్షం మరింత ఇబ్బందిని తెచ్చిపెట్టింది.

పంగులూరు :మండల కేంద్రమైన పంగులూరు పరిసర గ్రామాలలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజామున 43.3. మిల్లీమీటర్లుగా నమోదయ్యింది. వర్షానికి రోడ్డన్ని జలమయం కాగా, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పంగులూరు ప్రధాన కూడలిలో రోడ్లకు ఇరువైపులా వర్షపు నీరు నిలిచింది. అమ్మకానికి నోచుకోక ఇళ్ల వద్ద, పొలాలలో మండెల రూపంలో ఉన్న పొగాకు తడవకుండా పరదాలు కప్పేందుకు రైతులు పరుగుపెట్టారు.

ఇంకొల్లు : ఇంకొల్లులో గురవారం అర్ధరాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పూసపాడు అడ్డరోడ్డు వద్ద కప్పలవాగు పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచాయి. పొగాకు, మిర్చి రైతులు వర్షం నుంచి పొలాల్లోని పంటను కాపాడుకొనేందుకు అర్ధరాత్రి పరుగుతులు తీశారు. కల్లాల్లో ఉన్న పంటను తడవకుండా ఉండేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందికి గురయ్యారు.

యద్దనపూడిలో 128 మిల్లీమీటర్ల వర్షం

యద్దనపూడి,(మార్టూరు) : గురువారం రాత్రి నుంచి కురిసిన యద్దనపూడి మండలంలో భారీ వర్షం కురిసింది. 128 మిమీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో పోలూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. యద్దనపూడి నుండి పోలూరు గ్రామానికి వెళ్లే వాగుపై తూముల చప్టాపై వర్షపునీరు పొంగి ప్రవహించడంతో పోలూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు ఈ వాగును దాటకుండా ఉండేవిధంగా మండల తహసీల్దారు కె.రవికుమార్ రెవెన్యూ సిబ్బందిని, ఎస్‌ఐ రత్నకుమారి పోలీసులను వాగు వద్ద కాపలాగా ఉంచారు. అంతేగాకుండా యద్దనపూడి నుంచి వింజనంపాడు గ్రామానికి వెళ్లే నేలచప్టాపై కూడా భారీగా వర్షపు నీరు ప్రవహించడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ చప్టా వద్ద కూడా పోలీసులు కాపలాగా సిబ్బందిని ఉంచారు.

విద్యుత్ సరఫరాకు ఆటకం

అకాల వర్షంతో మార్టూరు మండలంలో దాదాపుగా అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మార్టూరు లో నేతాజీ నగర్, రామ్‌నగర్‌లలో గాలులకు చెట్లు పడిపోయాయి. చౌదరినగర్, రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో, చెరువులోని రైస్ మిల్లు వద్ద, పంచాయతీరాజ్ అతిథి గృహాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దాంతో సంపత్‌నగర్‌లో పలు గృహాలలో ఫ్రీజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు దెబ్బతిన్నాయి. మండలంలో పలుగ్రామాలలో భారీగా విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మార్టూరు గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ గుంటూరు సుబ్బారావు, అసిస్టెంట్ లైన్ మెన్ పరసా వేణుగోపాల్‌లు తమసిబ్బందితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్తిగా విద్యుత్ సరఫరా వచ్చే విధంగా మరమ్మతులు పూర్తిచేశారు.





పంగులూరులో ప్రధాన కూడలిలో నిలిచిన వర్షపునీరు, పోలూరు వాగు వద్ద నిలిచిన రాకపోకలు నీటిలో తడిచిన పొగాకు తాళ్లు

పట్టణంలో ఆహారభద్రత అధికారుల తనిఖీలు

- మూడు దుకాణాల్లో శాంపిల్స్ సేకరణ
- ఒక దుకాణానికి నోటీసులు

చీరాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆహారభద్రత అధికారి గరికపాటి ప్రభాకర రావు రెండు టిఫిన్ హోటల్స్, ఒక స్వీట్ ఖార్ఖానాలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలోని బాలాజీ టిఫిన్ సెంటర్, జానకి టిఫిన్ సెంటర్, అలాగే అను స్వీట్స్‌కు చెందిన ఖార్ఖానాలో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అనుమానస్పదంగా కనిపించిన ఆహార పదార్థాలు, పప్పు దినుసులకు సంబంధించి శాంపిల్స్ సేకరించారు. అంతేకాకుండా జానకీ టిఫిన్స్‌కు లైసెన్స్ లేకపోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారుల తనిఖీల తీరుపై విమర్శలు

చీరాల పరిధిలో ఆహారభద్రత అధికారుల తనిఖీలు అపహాస్యంగా ఉంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం నడుస్తున్న ఫాస్ట్ కల్చర్ నేపథ్యంలో నిత్యం అధిక సంఖ్యలో భోజన ప్రియులు, యువతీ యువకులు ఫాస్ట్ ఫుడ్ కల్చర్‌పై మక్కువ పెంచుకు న్నారు. కొన్ని రెస్టారెంట్‌లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంపై ఎంతమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. నాణ్యతలేని, అపరిశుభ్రమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. అయితే ఆహారభద్రత అధికారులు మాత్రం ఫిర్యాదులు అందితేనే తనిఖీలకు రావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా వచ్చిన ప్రతీసారి నోటీసులకే పరిమితమయినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో పట్టణంలో ఆహార కల్తీ యథాతథంగా కొనసాగుతోంది. గతంలోను కొన్ని స్వీటు దుకాణాలు, హోటళ్లపై దాడులు నిర్వహిం చారు. శాంపిల్స్ సేకరించారు. కానీ చర్యలు మాత్రం శూన్యం. ఈ క్రమంలో అధికారులు తీరుపై ప్రజలు అనుమానం చెందుతున్నారు. వాటిని నివృత్తి చేయాలంటే కల్తీ చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

కోటపాడులో పొరుగు ప్రాంత గేదెలు



గ్రామంలో ఉన్న పశువులు

పంగులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామంలో గుర్తుతెలియని గేదెలు, దూడలు తిరుగాడుతున్నట్లు గ్రామానికి చెందిన ఉప్పలమర్తి ఏడుకొండలు తెలిపారు. పొరుగు ప్రాంతానికి చెందిన నాలుగు గేదెలు, రెండు దూడలు గ్రామంలో కనిపిస్తున్నట్లు తెలిపారు. పగలు పొలాల వైపు వెళ్లి మేతమేసి సాయంత్రానికి గ్రామంలో రోడ్డు వెంబడి సేదతీరుతున్నట్లు తెలిపారు. గేదెలు గుర్తించిన యజమానులు తమను సంప్రదిస్తే వాటి ఆచూకి తెలుపుతామని స్థానికుడు ఏడుకొండలు తెలిపారు.

అధ్వానంగా ముక్తేశ్వరం- రామాంజనేయపురం రహదారి

ప్రమాదభరితంగా ఉన్న రోడ్డుపైనే ప్రయాణం

బల్లికురవ. మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్తేశ్వరం రామాంజనేయపురం గ్రామాల మధ్య రోడ్డులో ప్రయాణం అంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డును గతంలో తారు రోడ్డుగా అభివృద్ధి చేయగా ఇప్పుడు పూర్తిగా దెబ్బతింది. అలానే ఏబీసీ కాలువ నీరు వచ్చే మేజర్ కాలువపై ఉన్న పైపు కల్వర్టు దెబ్బతిని మట్టిపూర్తిగా కోతకు గురైంది. దీంతో ఈరోడ్డులో రాత్రుళ్ల ప్రజలు ప్రయాణం చేయాలంటే భయంభయంగా వెళుతున్నారు. అలానే రోడ్డు మెత్తం వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకిరువైపులా అడవి తుమ్మచెట్లు పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని వారు అంటున్నారు. ఈ రోడ్డు నుంచి మండల ప్రజలు రాష్ట్రీయ రహదారికి నిత్యం ప్రయా ణం చేస్తుంటారని ఇప్పుడు రోడ్డు దెబ్బ తినడంతో ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టును మరమ్మతులు చేసి రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డులోని ఏబీసీ కాలువ వద్ద కోతకు గురైన మట్టి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మచెట్లు

శాంతిభద్రతల పర్యవేక్షణకు డ్రోన్ అందజేత



అంజిరెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ తూషార్‌డూడీ

బల్లికురవ. మే 16 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు, ప్రత్యేక నిఘా కోసం పోలీసు శాఖకు మండలంలోని కూకట్లపల్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు ఇప్పల అంజిరెడ్డి డ్రోన్‌ను జిల్లా ఎస్పీ తూషార్‌డూడీకి శుక్రవారం అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోలీసుశాఖ ప్రత్యేక కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రూ.1.58లక్షల విలువైన డ్రోన్‌ను సమకూర్చినట్లు అంజిరెడ్డి తెలిపారు. బల్లికురవ ఎస్‌ఐ నాగరాజు సూచన మేరకు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ, డీఎస్పీ రామాంజనేయులకు దాత బాపట్లలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్‌ఐ వై.నాగరాజులు దాత అంజిరెడ్డిని అభినందించారు. నిఘాకు డ్రోన్ ఉపయోగ పడుతుందన్నారు.

వరుస వర్షాలతో ఉప్పు రైతులు బెంబేలు

చినగంజాం, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం తెల్లవారుజామున మేఘాలు గర్జించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలతో మండల పరిధిలోని ఉప్పు రైతులు బెంబేలెత్తున్నారు. మే నెలలో వరుసగా వర్షాలు కురుస్తుండంతో ఉప్పు రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. సాధరణంగా మే నెలలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండి ఉప్పు దిగుబడులు అధికంగా ఉంటాయి. ఈ నెల ప్రారంభం నుండి వర్షాలు కురుస్తుండడంతో రైతులు నష్టాల ఊబిలో బిక్కు బిక్కుమంటూ భయపడుతున్నారు. ఈ ఏడాది ఉప్పు రేటు ఆశాజనకంగా ఉన్నప్పటికి రైతుల దగ్గర తగినంత నిల్వలు లేవు. అధిక కౌలు రేట్లు వెచ్చించి తీసుకున్న రైతులు ఉప్పు లేకపోవడంతో లబోదిబో మంటున్నారు. ఉప్పు బాగా వస్తున్న సమయంలో భారీ వర్షం కురవడంతో ఉప్పు పంటకు తాత్కాలికముగా విరామం వచ్చింది. భారీ వర్షానికి ఉప్పుమడులు నీట మునిగాయి. మండలంలోని అడవీధిపాలెం, పల్లెపాలెం, చినగంజాం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, పెదగంజాం తదితర ప్రాంతాలలో సుమారు మూడు వేల ఎకరాలలో రైతులు ఉప్పుపంటను సాగు చేస్తున్నారు. మడులలో తీత తీయవలసిన, ఎక్కాలపై ఉంచిన ఉప్పు సుమారు 1200 ఎకరాలల్లో వర్షపు నీరు నిలిచి ఉప్పు పంటకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం క్వింటా ఉప్పు బస్తా ధర రూ.350లు ఉంది. ఎకరానికి పదివేల రూపాయిల వరకు నష్టం వాటిల్లిందని ఉప్పు రైతులు తెలిపారు. దీనితో ఉప్పు రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఉప్పు రేటు, అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికి గత నెల నుండి కురుస్తున్న అకాల వర్షాలతో తీవ్రంగా నష్టాలు చవి చూడవలసి వస్తుందని ఉప్పు రైతులు గంటా వెంకటనారాయణ. పీ.శ్రీకాంత్, పీ.శివనారాయణ, ఎస్.వెంకటేశ్వరరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్, మే మాసాలలో ఉప్పు ఇబ్బడి ముబ్బడిగా వస్తుంది. మరల ఉప్పు మడులను సాగు చేసి ఉప్పు తీయటానికి పక్షం రోజులు పడుతుందని రైతులు తెలిపారు. ఈ ఏడాది రుతుపవనాలు కూడా జూన్ మొదటి వారంలో వస్తుండటంతో ఇకపై ఉప్పు రావడం అసాధ్యమేనని ఉప్పు రైతులు భావిస్తున్నారు.

ఆరు లక్షల రూపాయిలు నష్టపోయా- గెల్లి వెంకటలక్ష్మీనారాయణ, ఉప్పు రైతు, చినగంజాం

70 ఎకరాలల్లో తీత తీయవలసిన ఉప్పు తెల్లవారుజామున కురిసిన వర్షానికి కరిగిపోయింది. కౌలుకు తీసుకున్న 70 ఎకరాలలో శుక్ర, శనివారాల్లో ఉప్పు మడులలో తీత తీయవలసిన ఉప్పు కరిగిపోవడంతో ఆరు లక్షల రూపాయిల వరకు నష్టపోవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.



చినగంజాం ప్రాంతంలో నీట మునిగిన ఉప్పు మడులు

చింతచెట్టుకొమ్మ విరిగిపడి మహిళకు గాయాలు

- పర్చూరు -చీరాల రోడ్డులో ఘటన


పర్చూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎండి పోయిన చింతచెట్టుకొమ్మ విరిగిపడి మహిళకు గాయాలైన ఘటన శుక్రవారం పర్చూరులో చోటుచేసుకుంది. పర్చూరు మండలం సుబ్బారెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్రీదేవి పర్చూరు బొమ్మల సెంటర్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న ఎండిపోయిన చింతచెట్టు కొమ్మవిరిగి ఆమె తలపై పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. పర్చూరు - చీరాల, పర్చూరు -ఇంకొల్లు అర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిపోయిన చింతచెట్లు ప్రమాద భరితంగా మారాయి. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన నేపథ్యంలో స్థానిక అర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని రెండు ఎండి పోయిన చింతచెట్లను తొలగించి అధికారులు మమా అనిపించారు. ఇప్పటికైనా అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎండి పోయి ప్రమాదంగా ఉన్న చింత చెట్లను తొలగించి ప్రజలు, ప్రయాణికులకు హానిలేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న మహిళ



మీద పడిన ఎండుకొమ్మ



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	36.8	28.8
కావలి	36	28
ఆత్మకూరు	37	27
ఉదయగిరి	37	27
కందుకూరు	36	28



కొండ కింద ఘాట్‌లో ముఖద్వారానికి వేసిన రంగులు

మాలకొండలో నేడు నృసింహ జయంతి!

- వేలాదిగా తరలిరానున్న భక్తజనం
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనృసింహ జయంత్యుత్సవాలకు మాలకొండ క్షేత్రం ముస్తాబయ్యింది. శనివారం నాటి ఉత్సవానికి ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది, ప్రాంగణంలోని దేవతామూర్తుల విగ్రహాలకు రకరకాల రంగులు అద్దారు. సుమారు 40 వేల మందికిపైగా భక్తులు వస్తారనే అంచనాతో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని దాతల సాయంతో మజ్జిగ, మినరల్‌వాటర్, శీతల పానీయాలు అందజేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు చెబుతున్నారు. అంతేగాక భక్తులకు ఎక్కడికక్కడే నీడ కోసం షామియానాలు, తాటాకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ వసతి కల్పిస్తున్నారు. భక్తుల అంచనా ప్రకారం లడ్డూప్రసాదం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలినడకన కొండపైకి వెళ్లే మెట్లమార్గంలో అక్కడక్కడ మంచినీరు, మజ్జిగ తదితర వసతులు కల్పిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా 150 మందితో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

స్వామివారి జయంత్యుత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాము. ఎక్కడికక్కడ మజ్జిగ, మినరల్ వాటర్, శీతల పానీయాలు, అన్నదానం ఏర్పాటు చేశాం, ఆలయ ప్రాంగణమంతా షామియానాలు, తాటాకు చలువ పందిళ్లు వేయిస్తున్నాము. వాహన పార్కింగ్, పోలీస్ భద్రతా చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశాం

- సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్, మాలకొండ



తిలాపాపం.. తలాపిడికెడు!

- పంచాయతీల్లో భారీగా నిధులు పక్కదారి
- రూ.కోట్లు తినేస్తున్న కార్యదర్శులు
- వీరికి ఉన్నతాధికారుల సహకారం?
- మామూళ్ల మత్తులో పట్టించుకోని ఆడిట్ శాఖ
- మళ్లీ వీరి చేతికే విచారణ బాధ్యతలు

కోవూరు పంచాయతీలో రూ.2 కోట్లకుపైగా మింగేశారు. పడుగుపాడులో రూ.ఒకటిన్నర కోటి వరకూ పక్కదారి పట్టించారు. ముత్తుకూరులో రూ.2 కోట్లు, కృష్ణపట్నం పంచాయతీలో మరో రూ.1.5 కోట్లు వరకూ దుర్వినియోగం చేశారు. పొదలకూరులో ఏకంగా లేఅవుట్లకు నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌వోసీలు మంజూరు చేశారు. ఉదయగిరిలో అయితే ఓ కార్యదర్శి వేరే పంచాయతీలో జరిగిన సీసీ రోడ్డు వర్కుకు ఇక్కడ బిల్లులు పెట్టుకొని తినేశారు. ఇవి కొన్ని మాత్రమే. వెలుగులోకి రానివి ఇంకా ఎన్నో ఉన్నాయి.

నెల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ప్రజాధనాన్ని అక్రమార్కులంతా కలిసి పంచుకుంటున్నారు. గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను అప్పనంగా జేబుల్లో నింపుకున్నారు. పంచాయతీ కార్యదర్శులే కాకుండా వారి పైఅధికారులు, ఆడిట్ శాఖ అధికారులు కూడా ఈ అక్రమాల్లో భాగస్వాములుగా ఉంటున్నారు. 2021-24 మధ్య అప్పటి వైసీపీ నాయకుల అండతో కొందరు కార్యదర్శులు పంచాయతీల నగదును తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. చిన్న, మేజర్ పంచాయతీలు అన్న తేడాలేకుండా రూ.లక్షల్లో నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. గడిచిన పది నెలల కాలంలో పదుల సంఖ్యలో కార్యదర్శులు సస్పెండ్ అవ్వగా, పలువురు సర్పంచ్‌ల చెక్‌పవర్‌లు రద్దయ్యాయి. అయితే నిధులు దుర్వినియోగం జరగకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కవడంతో అవినీతి స్థాయి పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

● అధికారులు ఏం చేస్తున్నట్టు?

ఎవరో ఒక అనామక వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే తప్ప పంచాయతీల్లో అవినీతి జరిగినట్లు ఆ శాఖ అధికారులు గుర్తించలేకపోతుండటం గమనార్హం. అవినీతి బయటపడగానే పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప అందుకు బాధ్యులైన పర్యవేక్షక అధికారులపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని ఈవోపీఆర్‌డీ ప్రతి పంచాయతీ రికార్డును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అలానే డీఎల్‌పీవో, డీపీవో కూడా ర్యాండమ్‌గా 30 శాతం పంచాయతీల్లో తనిఖీలు చేయాలి. ఇటీవల బయటపడిన కోవూరు, ఉదయగిరి, పొదలకూరు, పడుగుపాడు, ముత్తుకూరు, కృష్ణపట్నం వంటి పంచాయతీల్లో ఈవోపీఆర్‌డీ, డీఎల్‌పీవో, డీపీవో స్థాయి అధికారులు ఇన్‌స్పెక్షన్ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ వారి తనిఖీల్లో అక్రమాలు ఎందుకు బయటపడలేదన్నదే ఇప్పుడు ప్రశ్న.

● 'ఆడిట్'లో ఇంటిదొంగలు

పంచాయతీల్లోని ప్రతి రూపాయిని ఆడిట్ శాఖ అధికారులు ఏటా ఆడిట్ చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎక్కడైనా అవకతవకలు జరిగితే వెంటనే ఆడిట్ అధికారుల విచారణలో తేలిపోతుంది. అప్పుడు మరుసటి సంవత్సరం ఆ తప్పు జరగకుండా నిలువరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. కానీ జిల్లాలో ఆడిట్ శాఖ పనితీరు గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇప్పుడు రూ.కోట్ల అవినీతి బయటపడుతున్న ప్రతి పంచాయతీలోనూ ఆడిట్ శాఖ అధికారులు ఆడిట్‌ను పూర్తి చేసి ఉన్నారు. మరి వారు ఎందుకు గుర్తించలేకపోయారంటే సమాధానం లేదు. ఆడిట్ చేసే వారు పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆడిట్ శాఖలో చాలా మంది ఏళ్ల తరబడి పాతుకుపోయి ఉన్నారు. ఆఖరుకు జిల్లా ఆడిట్ అధికారిది కూడా సొంత జిల్లానే కావడం విశేషం. తాజాగా కోవూరు పంచాయతీ అవినీతి వ్యవహారంలో ఆడిట్ అధికారులపై కూడా క్రిమినల్ చర్యలకు పంచాయతీరాజ్ డైరెక్టర్ ఆదేశించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలంటూ ఆడిట్, పంచాయతీ శాఖలను ఆర్నెల్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే నేటికీ విచారణ పూర్తికాకపోవడం కొసమెరుపు.

మరో 9మందిపై విచారణ
రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక

నెల్లూరు (జడ్పీ) : పంచాయతీల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో మరో 9మంది కార్యదర్శులపై పంచాయతీ శాఖ అధికారులు విచారించి, నివేదికలను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపి ఉన్నారు. మనుబోలు మండలం జట్లకొండూరు. ఏఎస్‌పేట-ముదివర్తిలో ముగ్గురు కార్యదర్శులు, బుచ్చి మండలం ఇసుకపల్లి, చిల్లకూరు మండలం వరగలి, కోవూరు మండలం పడుగుపాడు కార్యదర్శులతోపాటు పొదలకూరు మండలంలో కార్యదర్శిగా పని చేసి ప్రస్తుతం దక్కిలి మండలం ఈవోఆర్డీగా ఉన్న అల్లాభక్షుపైన నివేదికలు పంపి ఉన్నారు. దీంతో వీరిపైనా వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే మరికొన్ని పంచాయతీలపైన పంచాయతీ శాఖకు ఫిర్యాదులు అందుతుండటంతో గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన కార్యదర్శులకు గుండెల్లో దడ పుట్టుకువస్తోంది. గతంలో పొరపాట్లు జరిగాయని, తమను రక్షించాలంటూ ప్రస్తుత పాలకుల వద్ద కార్యదర్శులు మొరపెట్టుకుంటూ, స్థానిక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పైరవీలు సాగిస్తున్నా కూటమి ప్రభుత్వంలో కుదరడం లేదు. దీంతో గతంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రతి కార్యదర్శి శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జొన్నవాడలో విస్తృత ఏర్పాట్లు

నేటినుంచి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు



ఆలయ రాజగోపురానికి విద్యుద్దీపాలంకరణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని కామాక్షితాయి, మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 27వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. శనివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యే ఉత్సవాలు ఆదివారం ధ్వజారోహణం, 19న శేషవాహనం, 20న పురుషామృగవాహన సేవ, 21న సింహ వాహనం, 22న హంసవాహనం, 23న రావణసేవ, 24న వెండి నందిపై ఆదిదంపతులు విహరించనున్నారు. 25న రథోత్సవం, 26న ఉదయం కల్యాణం, రాత్రి తెప్పోత్సవం, 27వ తేదీన ధ్వజావరోహణం, అలకలతోపు, అశ్వవాహనసేవ, రాత్రి ఏకాంతసేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాము చేస్తున్నారు. జొన్నవాడ నుంచి బుచ్చిలోని జొన్నవాడ సెంటర్ వరకు, కాగులపాడు సెంటర్, జొన్నవాడలోని పెన్నానది నుంచి అవతల ఒడ్డున జొన్నవాడ రేవు వరకు భక్తులను స్వాగతించేలా విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు.

● భక్తులకు అన్ని సౌకర్యాలు

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ నిత్యాన్నదాన సదనంలో ప్రత్యేక భోజన సదుపాయం, ఉచిత ప్రసాదాల వితరణ, మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

టెన్షన్ పడకండలా..!?

- ఎక్కువైతే రక్తపోటు బారిన పడ్డట్టే!
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే
- బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లే అవకాశం
- జిల్లాలో 4 లక్షల మందికి పైగా వ్యాధిగ్రస్థులు
- నేడు ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం



ఓ వైపు పని ఒత్తిడి.. మరోవైపు ఇంట్లో సాధక బాధకాలు.. చదువుకునే విద్యార్థి నుంచి వృద్ధులదాకా ఏదో ఒక అంశంలో ఒత్తిడికి గురవుతూనే ఉన్నారు. నరాల్లో పోటెత్తే నెత్తుటి వేగం అదుపు తప్పి రేకెత్తించే అలజడి. వైద్య పరి భాషలో చెప్పాలంటే హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) అంటారు. సాధారణ భాషలో బీపీ అని అంటారు. జనంలో దడపుట్టిస్తున్న ఈ బీపీపై అప్రమత్తంగా ఉండాలి. ఆదిలోనే అదుపు చేయకపోతే ఇది ప్రాణాంతకంగా మారుతుంది. దీని బారిన పడకుండా ఉండాలంటే ఒక్కటే మార్గం ఒత్తిడికి దూరంగా ఉండటమే. శుక్రవారం ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

8లో..



వెంగళరావునగర్‌లో రోడ్డెక్కి పారుతున్న మురుగు

కొద్దిపాటి వర్షం.. ఉప్పొంగిన వ్యర్థం

- కావలిలో డ్రైనేజీ వ్యవస్థ తీరిది!



బాలాజీ నగర్‌లో రోడ్డుపై వర్షపునీరు

కావలిలో డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉన్నదో ఈ చిత్రాలే నిదర్శనం. కొద్దిపాటి వర్షం కురిసినా కాలువలు ఉప్పొంగి మురుగు రోడ్లపై పారుతోంది. ఇక వర్షపు నీటితో రోడ్లు మడుగులను తలపిస్తు న్నాయి. శుక్రవారం ఉదయం కావలిలో కురిసిన మోస్తరు వర్షానికే పట్టణంలో చాలాచోట్ల కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో కాలువల్లోని చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో కూడిన మురుగు రోడ్లపైకి చేరడంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్లకు ఇరువైపులా కాలువలు లేకపోవడం, ఉన్న చోట్ల పాడై ఉండ టంతో మురుగునీటి పారుదల సక్రమంగా లేదు. శుక్రవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి వెంగళరావునగర్‌లో మురుగు నీరంతా రోడ్లపైకి చేరింది. దీంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయటంతో కాలువలకు అడ్డంగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే సబ్‌కోర్టు వీధిలో టెంకాయల అంగడి వద్ద మురుగు, వర్షపు నీరు రెండూ కలిసి పోయి ప్రవహించాయి. ముసునూరు తదితర ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణం లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర చాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జరిగిపోయిన పెళ్లికి శుభలేఖ

- మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సందడి
- కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు

ఉదయగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డు కోసం ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీకావు. కార్డు కావాలనుకునే వారు ఆధార్‌తోపాటు వారి వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం జత చేసి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అయితే పెళ్లి కార్డు ఉంటేనే వివాహ ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారు. ఈ పత్రం ఇవ్వాలంటే శుభలేఖ దరఖాస్తు ఫారానికి జత చేయాల్సి ఉంది. దీంతో పెళ్లిళ్లు అయిన వారు ప్రింటింగ్ ప్రెస్‌లలో మరోమారు శుభలేఖలు ముద్రణ చేయించుకొంటున్నారు.

● ధ్రువపత్రాలు సరిగ్గా ఉంటే..

వివాహ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తుకు దంపతుల ఆధార్ కార్డులు, వయసును నిర్ధారించే పదో తరగతి టీసీ లేదా డాక్టర్ జారీ చేసిన ధ్రువపత్రం, శుభలేఖ, పెళ్లినాటి ఫోటోలు, ముగ్గురు సాక్షులు, కల్యాణ మండపం రశీదు, ఆలయంలో వివాహం జరిగి ఉంటే పురోతుడి ధ్రువీకరణపత్రం, రూ.500 చలానా జత చేసి సబ్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు ఇవ్వాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఓ గంటలోనే వివాహ ధ్రువీకరణపత్రం మంజూరు చేస్తారు.

● ఆలస్యం చేస్తే వ్యయ ప్రయాసలే!

వివాహం జరిగిన 60 రోజుల్లో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడే వివాహ ధ్రువీకరణపత్రం మంజూరు చేస్తారు. గడువు దాటిన వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం వివాహ ధ్రువీకరణపత్రం కోసం అనినరకాల సర్టిఫికెట్లు కావాల్సి ఉండటంతో రూ.వేలల్లో ఖర్చవుతోంది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు ఐదారు మంది దంపతులు వివాహ ధ్రువీకరణపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని కార్యాలయ అధికారులు తెలుపుతున్నారు.



ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ ధ్రువీకరణపత్రం కోసం వచ్చిన దంపతులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 525



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

దగదర్తి(బిట్రగుంట), మే 16(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందచేశారు. ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీయుఎస్ సహాధ్యక్షుడు చక్రపాణి 36 మంది విద్యార్థులకు మెమొంటోలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుఎస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఉన్నత పాఠశాల హెచ్ ఎం ప్రకాశంబాబు, జవహర్‌బాబు, ఏపీయుఎస్ మండల అధ్యక్షుడు మాల్యాద్రి, నేతలు శ్రీనివాసులు, రాజమ్మ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విత్తనాభివృద్ధి క్షేత్రం భూముల పరిశీలన

లింగసముద్రం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రంకు చెందిన భూములలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన నిమిత్తం కేటాయించి భూములను కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ శుక్రవారం పరిశీలించారు. 2019లో ప్రభుత్వం విత్తనాభివృద్ధి క్షేత్రంకు చెందిన 540 ఎకరాలలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రానికి 410 ఎకరాలను ఇచ్చారు. వాటిలో ఏ పంటలు సాగు చేస్తున్నారని అక్కడి అధికారులను ప్రశ్నించారు. ఈ భూముల అభివృద్ధి, గోడౌన్ల నిర్మాణం తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ భూములలో వరి, మినుము, నువ్వు, జొన్న పంటలు సాగు చేస్తారని ఏఈవో అంకమ్మరావు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె శ్రీనివాసులు, మండల సర్వేయరు గోపిరెడ్డి, వీఆర్ఓలు కిషోర్, మస్తాన్‌వలి, సర్వేయరు మన్విత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రారంభం

లింగసముద్రం, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంటలో శుక్రవారం భూముల రీసర్వే ప్రారంభించారు. గ్రామంలోని రైతులు తమ భూములను రీసర్వే చేయించుకొనేందుకు అధికారులకు సహకరించాలని ఆ గ్రామ వీఆర్‌వో వినోద్ కోరారు. భూముల రీసర్వే వలన ఎలాంటి తప్పులు ఉండవని, దీనివలన రైతుల మధ్య ఎలాంటి వివాదాలు తలెత్తవని చెప్పారు. గ్రామంలో మొత్తం 135 సర్వే నెంబర్లలో 1590 ఎకరాలను రీసర్వే చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు మల్లికార్జున, కిషోర్, బ్రహ్మయ్య సర్వేయర్లు ఎన్ సుప్రజ, బాలాజీ, వెంకటేష్, కార్తీక్, శివప్రసాద్, గణేష్, వినోద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్‌కే 'కిశోరి వికాశం'

వలేటివారిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : యుక్త వయస్సులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాశం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాశంపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ బాల్యం నుంచి యుక్త వయస్సు వరకూ ఎవరి నుంచి మోసపోకుండా బాలికలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, ఆశా కార్యకర్త వరలక్ష్మి, హెల్పర్ ప్రసన్న, బాలికలు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

వలేటివారిపాలెం, మే 16(ఆంధ్రజ్యోతి) : పొగాకు, మిర్చి, మినుము పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసీపీ మండల ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి శివరామిరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది పంటల సాగుకు ఖర్చులు పెరిగాయని, దీనికి తోడు అధిక వర్షాలు, తెగుళ్ల వలన దిగుబడులు తగ్గినట్లు తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ఏడాది పొగాకు క్వింటం రూ.35 వేల, మిర్చి క్వింటం రూ.22 వేల పలికిందని తెలిపారు. ఈ ఏడాది పొగాకు క్వింటం రూ.24 వేల, మిర్చి రూ.12 వేలకు పడిపోయిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పొగాకు, మిర్చి, మినుము రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు.

ఆదరణ కేంద్రానికి మతిస్థిమితం లేని వ్యక్తి

బిట్రగుంట, మే 16(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ ప్రాంతంలో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ నిర్వాహకుడు కే.సింహాద్రిరావు శుక్రవారం ఆదరణకేంద్రానికి తరలించారు. ఆయన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం, అప్పలరావుపేట చెందిన వాడని, పేరు షేక్.ఇమామ్ సాహెబ్ అని భార్య పేరు అబ్జల్‌బీ అని చెప్పినట్లు సింహాద్రిరావు తెలిపారు.

దగ్ధమైన పూరింటిని పరిశీలించిన అధికారులు

కలిగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరకొండూరులో గురువారం పోలేరమ్మ పొంగళ్ల సందర్భంగా బాణాసంచా పడి దగ్ధమైన పూరింటిని శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. భక్తులగు అమ్మవారి ఆలయానికి వెళ్లే క్రమంలో ఓ బాణాసంచా చువ్వ నోటి సుబ్బారెడ్డికి చెందిన పూరింటిపై పడింది. గ్రామస్థులు గమనించే లోపున మంటలు చెలరేగి దగ్ధమైంది. ఆ ఇంట్లో గత కొంతకాలంగా ఎవరూనివాసం లేకపోయేసరికి పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. పరిశీలించిన రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. 7 బస్తాలు ధాన్యం, 4 బస్తాలు మిర్చి ఆ ఇంట్లో నిల్వ చేసి ఉంచగా దగ్ధమయ్యాయని ఇంటి యజమాని అధికారులకు వివరించారు.

నాడు నిలిపివేత...

నేడు పునరుద్ధరణ!

- రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు
- గత వైసీపీ ప్రభుత్వంలో పథకం అమలుకు మంగళం
- కూటమి ప్రభుత్వంలో అందజేస్తుండటంతో అన్నదాతల హర్షం



పరికరాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్(ఫైల్)

జలదంకి, మే 16(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత అంటూ ఊదరగొట్టిన గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేసే యాంత్రీకరణ పథకానికి నాడు మంగళం పాడింది. గడిచిన ఐదేళ్లల్లో ఏ ఒక్క రైతుకు కూడా వీటిని అందజేయలేదు. దీంతో ఆపార్టీకి సానుభూతి పరులైన రైతులతోపాటు నాయకులు సైతం వైసీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు గత ఐదేళ్ల వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం ఎదురుచూసి అలసిపోయారు. వ్యక్తిగతంగా రాయితీ యాంత్రీకరణ పరికరాలు అందివ్వకుండా గ్రామస్థాయిలో క్లస్టర్ల సంఘాలకు పరికరాలు అందించారు. అవి ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో రైతులకు ఈ యంత్ర పరికరాలు ఏమాత్రం ఉపయోగపడలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న యాంత్రీకరణ పథకాన్ని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం కొత్తగా క్లస్టర్ సంఘాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో పలుకుబడి ఉన్న పెద్ద రైతులకు సంఘాల పేరుతో రాయితీ పరికరాలు అందించింది. ఈ క్రమంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యక్తిగత యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించింది. అవసరమైన రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు పంపిణీ చేస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తోన్నారు. ఈ పథకం కింద స్థానిక రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె)ల్లో చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులు వీఏఏలను సంప్రదించి దరఖాస్తు చేసుకుని ఎంపిక చేసిన పరికరం కోసం రాయితీ పోను మిగిలిన నగదు డీడీ రూపంలో చెల్లించిన వెంటనే రైతులు నచ్చిన కంపెనీ పరికరం అందజేస్తున్నారు. ఇలా ఇప్పటికే మండలంలో 50 నుంచి 70 వరకు వ్యక్తిగత యాంత్రీకరణ పరికరాలు అందజేశారు. కొత్తగా ఖరీఫ్ సీజన్‌లో కూడా వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ సంసిద్ధంగా ఉంది.

● సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం రాయితీ

ఈ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు 50శాతం రాయితీ ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు అదనపు రాయితీ ఉంది. వ్యవసాయానికి సంబంధించిన ట్రాక్టర్ పనిముట్లు, ట్రాక్టర్ స్ప్రేయర్లు, విత్తన గొర్రులు, తైవాన్‌స్ప్రేయర్లు లాంటివి అనేకం రాయితీ కింద అందిస్తోంది.

● ఈ పంట నమోదు తప్పనిసరి

యాంత్రీకరణ పరికరాలు పొందాలంటే రైతులు తమ సాగు వివరాలు ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి. దీంతో పాటు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, పాస్‌పోర్టుసైజు ఫొటో తీసుకుని స్థానిక రైతు సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

● రైతుల్లో ఆనందం

గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన వ్యక్తిగత వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ పథకం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తిరిగి కొనసాగించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం వైసీపీ ప్రభుత్వం నిలిపివేసినప్పుడు ఆ పార్టీ సానుభూతిపరులైన రైతులే ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ అప్పటి ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలతో వారిలో చలనం రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే పథకం తిరిగి కొనసాగించడంతో రైతులు ముక్తకంఠంతో ఆనందం వ్యక్తం చేయగా కూటమి పార్టీల నాయకులు మాది రైతుకు మేలు చేసే ప్రభుత్వమని, వైసీపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ఆరోపిస్తున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

● కిషోర్‌బాబు, ఎస్ఐ, అల్లూరు



అల్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సహించేదిలేదు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌లలో పౌరులకు సత్వర సేవలు అందిస్తున్నాం. గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో కలిసి జీవించాలని, నేరప్రక్రియకు పాల్పడి ఇబ్బందులు పడవద్దని ఎస్ఐ కిషోర్‌బాబు పేర్కొన్నారు.

? దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. దీంతో గత ఆరు నెలలుగా దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. ఇకపై కూడా నిఘా ఉంచుతాం.

? పేకాట, కోడి పందేలను అరికడతారా.

! మండలంలోని ఇప్పటికే పలు ప్రాంతాల్లో పేకాట, కోడి పందేల స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశాం. నిర్వాహకులకు హెచ్చరించాం. నిబంధనలు, చట్టాన్ని అతిక్రమిస్తే ఉక్కుపాదం మోపుతాం.

? మండలంలో నేరాల సంఖ్య ఏవిధంగా ఉంది.

! గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాలు తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా రాత్రుళ్ల గస్తీలు, తిరునాళ్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాం.

? స్టేషన్‌లో సిబ్బందికి, పౌరులకు మధ్య ఎలాంటి సంబంధం ఉంది.

! వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ స్నేహ పూర్వకంగా పలుకరిస్తాం. వారికి అవసరమైన వసతులు కల్పిస్తున్నాం. గౌరవ ప్రదంగా నడుచుకొని వారికి సేవలు అందిస్తున్నాం.

ముర్రా జాతి లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనకు తీసుకొచ్చిన ముర్రాజాతి లేగదూడలు

కొండాపురం, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుజంగాలపల్లెలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆరు నెలల లోపు ముర్రా జాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో గ్రామంలోని 46 లేగదూడలను వాటి యజమానులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లేగదూడలను సంరక్షించుకొని మేలుజాతి పాడిపశువులుగా అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రాంతీయ పశువైద్యశాల కలిగిరి, సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ దూడలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించి 7 నుంచి 10 రోజులలోపల నట్టల నివారణ మందులు వాడుకోవాలన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలలో ప్రథమ స్థానం లో ఎం.వెంకటరమణయ్య దూడను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. పాల్గొన్న రైతులకు కాల్షియం టానిక్, మినరల్ మిక్చర్ బ్లాక్, నట్టల నివారణ మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు రాజశేఖర్, శిద్ధనకొండూరు పశువైద్యాధికారి డాక్టర్ వీరహరన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య

కావలిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి) : బలవంతపు భూసేకరణ ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం వెంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కావలి మండలం ఆనెమడుగు తదితర గ్రామాల్లో బీపీసీఎల్ కంపెనీకి కట్టబెట్టేందుకు 800 ఎకరాలకుపైగా బలవంతపు భూసేకరణ చేయబోతున్నారన్నారు. ఆయా గ్రామాల రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, గీత కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తుల వారు, రైతుల బతుకుదెరువు బుగ్గిపాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం బీపీసీఎల్ కొరకు చేయనున్న భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి ఉన్నతాధికారులకు విన్నవించామని, అయినప్పటికీ ప్రభుత్వం భూసేకరణకు పట్టుబట్టడం దుర్మార్గమన్నారు. పచ్చని పల్లెటూర్లలో పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ, ఉపాధి భద్రత బాధ్యత రాష్ట్రప్రభుత్వపై ఉందన్నారు. కావలి కాలువ కింద 74 వేల ఎకరాలకు నీరు ఇస్తామని ఇప్పటి వరకు కాలువ చివరి వరకు నీరు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సీఐటీయు గౌరవాధ్యక్షుడు పెంచలయ్య పాల్గొన్నారు.

కందుకూరు ప్రాంతంలో భారీవర్షం

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కందుకూరు ప్రాంతంలో శుక్రవారం ఉదయం భారీవర్షం కురిసింది. ఉదయం ఆరుగంటల నుంచి ఏడున్నర వరకు అనేకప్రాంతాల్లో కుండపోత వర్షం కురవగా కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఉరుములు మెరుపులతో వాతావరణంలో బీభత్సం నెలకొంది. ఉరుములు మెరుపుల ధాటిని బట్టి అనేకచోట్ల పిడుగులు పడడంతో అనేకచోట్ల విద్యుల్ లైన్ల కండెన్సర్లు కాలిపోవటంతో మధ్యాహ్నం వరకు అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం జరిగింది. పోకూరు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి నలదలపూరు, గుడ్లూరు, దారకానిపాడు సబ్ స్టేషన్లకు వెళ్లే ప్రధానలైనుకు నష్టం జరగటంతో ఆ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో మధ్యాహ్నం తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగింది. పోకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అనేక గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఏఈ మధుబాబు తమ సిబ్బందితో మరమ్మతులు పూర్తి చేయించి సరఫరాను పునరుద్ధరించారు. కందుకూరు మండలంలో 4 సెం.మీటర్లు, ఉలవపాడు 2 సెం.మీటర్లు, గుడ్లూరు 1.8 సెం.మీటర్లు, వలేటివారిపాలెంలో 1.5 సెం.మీటర్ల వర్షపాతం నమోదవగా లింగసముద్రం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం ప్రభావంతో ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లో ఉన్న మామిడితోటలకు, రాళ్లపాడు ఆయకట్టులో సాగులో ఉన్న పత్తికి మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కందుకూరు ప్రాంతంలో వేలాది ఎకరాలలో సాగులో ఉన్న జామాయిల్, సరుగుడు తోటలకు ఎంతో మేలని భావిస్తున్నారు. అలాగే వేసవిపైర్లుగా సాగుచేసే నువ్వు, పెసర తదితర పైర్లు సాగుకు ఈ వర్షంతో ఎంతో అదను అనుకూలించినట్లని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీవర్షం కురిసినా గాలి పెద్దగా లేకపోవటంతో మామిడితోటలకు కూడా నష్టం వాటిల్లలేదు.

చల్లబడ్డ వాతావరణం

లింగసముద్రం : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా శుక్రవారం మండలంలో చిరుజల్లులు కురిశాయి. దీంతో గ్రామాల్లో వాతావరణం చల్లబడింది. తెల్లవారుజామున 4 గంటల నుంచే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. ఉదయం 9 గంటల వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. రోజుల నుంచి మండే ఎండలు, వేడి గాలులతో ఇబ్బందులుపడ్డ ప్రజలు ఈ వాతావరణంతో ఉపశమనం పొందారు.

డ్రైనేజీ నీరు భూమిలోకి ఇంకకుండా చర్యలు



డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

కావలి, మే 16(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ నీరు భూమిలోకి ఇంకకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 26వ వార్డులో రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న డ్రైనేజీలో నీరు సక్రమంగా పారకుండా భూమిలోకి ఇంకి పరిసర ప్రాంతాల్లోని బావులు, బోర్‌లలో మురుగు నీరు వస్తోందని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి డ్రైనేజీని పరిశీలించి నీటి పారుదలకు ఆటంకంగా ఉన్న చెత్తా చెదారన్ని తొలగింపచేశారు. అనంతరం డ్రైనేజీ నీరు భూమిలోకి ఇంక కుండి కాలువలో బెడ్ కాంక్రీట్ వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ పలుకూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవటం ద్వారా నష్టాల నుంచి రైతులు తప్పించుకోవచ్చని మండల ప్రకృతి వ్యవసాయ అధికారి ధనమ్మ తెలిపారు. మండలంలోని పలుకూరులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించటం వల్ల చేకూరే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం కురిసిన భారీవర్షం వల్ల భూములు పదునైనందున పీఎండీఎస్ విధానంలో 25 రకాల విత్తనాలను భూమిలో చల్లుకుని 40రోజుల తర్వాత కలియదున్నితే భూసారం ఎంతో పెరుగుతుందని, తద్వారా ఖరీఫ్, రబీలలో సాగుచేసే పంటలలో అధికదిగుబడులు సాధించటంతో పాటు చీడపీడల నుంచి కూడా రక్షణ పొందవచ్చని తెలిపారు. రబీలో సాగుచేసే శనగలో గతకొంత కాలంగా రైతులను ఎండుతెగులు ఇబ్బందిపెడుతున్నందున ఎండుతెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పొగాకులో మల్లె నివారణకు పాటించాల్సిన పద్ధతులు, చీడపీడల నిర్మూలనకు ఉపయోగించే కషాయాల తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద నార్నె రోశయ్య, డీఎంఎంటీ మాధవరావు, మహిళారైతులు, ఐపీఆర్‌పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కాకర్లపాలెం రోడ్డు అధ్వానం

వలేటివారిపాలెం, మే 16(ఆంధ్రజ్యోతి): తారురోడ్డు చూశాం, మట్టిరోడ్డు చూశాం, సిమెంట్‌రోడ్డు చూశాం ఇప్పుడు కంకరరాళ్ల రోడ్డు చూస్తున్నాం. మండలంలోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుంచి కాకర్లపాలెంలోకి వెళ్లే సుమారు రెండు కిలో మీటర్లు రోడ్డంతా కంకరరాళ్లే, బంతుల సైజులో ఉన్న కంకరరాళ్ల రోడ్డుపై నడుస్తూ వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. మెటల్‌రోడ్డుపై ఉన్న మట్టి వర్షానికి కొట్టుకపోవడంతో కంకరరాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల టైర్లకింద కంకరరాళ్లు పడి టైర్లు స్లిప్ అయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు రాకపోకల సమయాలలో టైర్ల కింద కంకరరాళ్లు పడి రోడ్డుపై వెళ్లే పాదచారులకు తగిలి రక్తగాయాలవుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే లేరు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆ రెండు కిలోమీటర్లు తారు రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు



కొత్తపేట వద్ద రోడ్డుపై పూడ్చిన గుంతలు

కలిగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): కలిగిరి మండలం గుంపర్లపాడు కొత్తపేట, జమ్మవరం గ్రామాల మీదుగా, ఏఎస్‌పేట మండలంకు వెళ్లే లింకు రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి నరకంగా మారింది. ఈ మార్గం ద్వారా విజయవాడ, కావలి, కందుకూరు తదితర ప్రాంతాల నుంచి ఏఎస్ పేట, ఆత్మకూరు ప్రాంతాలకు నిత్యం ప్రయాణాలు చేసేవారు ఈ గుంతలవద్ద ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ఈ క్రమంలో పలుమార్లు ఈ మార్గంలో ప్రయాణికుల ఇబ్బందులపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన అధికారులు గత వారం రోజులుగా రోడ్డుకు తాత్కాలికంగా ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జమ్మవరం, కొత్తపేట ప్రాంతాల వద్ద ప్యాచ్‌వర్క్‌లు దాదాపు పూర్తయ్యాయి. గుంపర్లపాడు వద్ద కొంతమేర గుంతలమయంగా ఉన్న రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు వేయడం పూర్తయితే కలిగిరి, ఏఎస్‌పేట మండలాల ప్రజలు ఈ మార్గంలో తమ ప్రయాణం సాఫీగా జరుగుతుందని పేర్కొంటున్నారు.

చెరువు కలుజు వాగు ఆక్రమణ

● ఆందోళనలో రైతులు ● చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు



ఇరువైపులా ఆక్రమణలతో పిల్ల కాలువలా మారిన కలుజు వాగు

కావలి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): కావలి మండలం చలంచర్లలో చెరువు కలుజు ఆక్రమణ లు జోరుగా సాగుతున్నాయి. గ్రామానికి వెళ్లే దారిలోని చెరువు కలుజు దగ్గర నుంచి గుండాలమ్మవాగు వరకు ఆక్రమణలకు గురవుతున్నా అటు పాలకులు ఇటు అధికారుల పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామానికి వెళ్లే దారి పక్కన కలుజు వాగుకు ఒక పక్క వైసీపీ సానుభూతి పరులు వాగును పూడ్చి మామిడి, టెంకాయచెట్లు నాటితే మరోపక్క టీడీపీ సానుభూతి పరులు ఇటీవల వాగును కొంత మేర పూడ్చి మట్టి తోలారు. కలుజు దగ్గర నుంచి గుండాలమ్మ వాగు వరకు కలుజు వాగుకు ఇరువైపుల వ్యవసాయ భూములు కావడంతో ఆక్రమణలతో వాగు కుచించుకుపోయి చిన్న పంట కాలువలా మారింది. దీంతో అధిక వర్షాలు కురిసినప్పుడు చలంచర్ల చెరువు నిండి వర్షపు నీరు మొత్తం కలుజు వాగుకు పడటంతో చలంచర్ల ఎస్సీకాలనీలోని వర్షపు నీరు నిల్వ చేరుతుంది. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మాలకొండకు భక్తుల పాదయాత్ర



ఇరుముడి కట్టించుకుంటున్న నృసింహుడి మాలధారులు

వలేటివారిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, అంకభూపాలపురం, కాకర్లపాలెం, పోలినేని చెరువు, ఉప్పలపాడు, పోలినేనిపాలెం, బంగారక్కపాలెం తదితర గ్రామాల్లోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి మాలలు ధరించిన భక్తులు శుక్రవారం ఇరుముడి కట్టుకొని మాలకొండకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అయా గ్రామాల్లో సుమారు 5 వందల మంది భక్తులు మాలలు ధరించి 41 రోజులు ఎంతో నిష్ఠతతో నృసింహుడికి పూజలు చేశారు. శనివారం నరసింహస్వామి జయంతోత్సవాల సందర్భంగా కాలినడకన మాలకొండకు వెళ్లి స్వామివారికి ఇరుముడి సమర్పించి మొక్కులు చెల్లించనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దాతలు సాయంతో మాలాధారులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వేదగిరీశుడికి పుష్పయాగం



స్వామి వారికి పుష్పయాగం చేస్తున్న అర్చకులు

ఏకాంతసేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్, మే 16,(ఆంధ్ర జ్యోతి) : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామికి శుక్రవారం పుష్పయాగం నేత్ర పర్వంగా జరిగింది. పది రోజుల నుంచి అంగరంగ వైభవంగా జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఏకాంత సేవతో ముగిశాయి. చివరి రోజు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. విశాఖకు చెందిన సౌభాగ్య భువనేశ్వరీ పీఠం నుంచి రామానంద భారతి స్వామి వారు ఆలయానికి విచ్చేసి స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి చెప్పారు. దేవస్థానంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిత్యం అధికారులను సమన్వయం చేసుకుని ఎక్కడా లోపాలు రానివ్వకుండా భక్తులకు సర్వసౌకర్యాలు కల్పించారని తెలిపారు.



జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్, తదితరులు

భారత్ మాతాకీ జై!

వింజమూరులో తిరంగా విజయోత్సవ ర్యాలీ

భారత్ మాతాకీ జై... జై జవాన్.. జయహో భారత్! అంటూ విద్యార్థుల నినాదాలతో వింజమూరు హోరెత్తిపోయింది. ఆపరేషన్ సిందూర్ విజయం సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 70 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో మంగళ సెంటర్ నుంచి శివాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, మాలేపాటి చైతన్య, మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, రెవెన్యూ, పోలీస్ అధికారులతోపాటు తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతోపాటు విద్యార్థులు, యువత భారీ ఎత్తున పాల్గొన్నది.

- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)



నేడు బీట్ ద హీట్

ప్రజలకు అవహన కల్పించాలి
టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(హరనాథపురం), మే 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై శుక్రవారం అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'బీట్ ద హీట్'లో అన్నీ శాఖల అధికారులు ప్రజలకు వేసవిలో ఉపశమనం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎండ వేడిమి నుంచి సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ప్రముఖ, రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్స్, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయటం, మొక్కలు నాటేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

చెక్, క్లీన్, కవర్

- డెంగ్యూ నివారణకు కార్యాచరణ
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత
- నెల్లూరులో ప్రత్యేక ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు, సిబ్బంది, పీఎంపీలు తదితరులు

నెల్లూరు (వైద్యం), మే 16 (ఆంధ్రజ్యోతి) : చెక్, క్లీన్, కవర్ విధానంతో డెంగ్యూ వ్యాధి నివారణ చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. డెంగ్యూ నివారణ దినం సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి గుప్తా పార్క్ వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. డెంగ్యూ నివారణకు కృషి చేస్తామంటూ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఈజిప్టయ్ అనే దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి సోకుతుదని చెప్పారు. కంటి నొప్పి, కండ్లు ఎర్రబారటం, కండరాల నొప్పులు, జుట్టు ఊడిపోవటం, చర్మంపై ఎర్రటి గుండ్రటి మచ్చలు, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వం వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగ్యూ నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ఇంటి చుట్టూ దోమల ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వలు లేకుండా చెక్ చేసుకోవాలన్నారు. నిల్వలను వెంటనే తొలగించి క్లీన్ చేయాలని, అలాగే నీటి తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉండేలా కవర్ చేయాలని సూచించారు. ఈ మూడు పద్ధతులు తప్పకుండా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డెమో కనకరత్నం, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు, జిల్లా పీఎంపీ అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాక్షిక దత్తత కోసం నమోదు చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), మే 16(ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న చైల్డ్‌కేర్ కేంద్రంలో ఉన్న పిల్లలను పాక్షిక దత్తత తీసుకోడానికి ఆసక్తిగల తల్లిదండ్రులు నమోదు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కేంద్రంలోని 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలను పాక్షిక దత్తత తీసుకోడానికి ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో ఉన్న బాలల సంక్షణాధికారిని సంప్రదించాలని కోరారు.

రక్తపోటు పట్టిక	సాధారణం	స్టేజ్-1	స్టేజ్-2	స్టేజ్-3
	120/80	140/90	160/100	180/110 అంతకంటే ఎక్కువ

ఉరుకులు పరుగుల జీవితం. పొద్దున లేచింది మొదలు అర్ధరాత్రి పడుకునే వరకు ఒత్తిడి. భవిష్యత్తు పై ఆందోళన. జీవితంలో ఎక్కడ ఏ అంచనాలు తప్పినా ముంచుకొచ్చే కోపతాపాలు, నిరాశ నిస్పృహ.. ఫలితంగా నరాల్లో పోటెత్తే నెత్తుటి వేగం అదుపుతప్పి రేకెత్తించే అలజడి. వైద్య పరిభాషలో చెప్పాలంటే హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు). సాధారణ భాషలో దీనినే బీపీ అని కూడా అంటారు. ఆదిలోనే దీనిని అదుపు చేయకపోతే ప్రాణాంతకంగా మారుతుంది.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

- ఎక్కువైతే రక్తపోటు బారిన పడ్డట్టే!
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే
- బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లే అవకాశం
- జిల్లాలో 4 లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- నేడు ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం

ఒత్తిడి పెంచుకోవద్దు!



నేటి సమాజంలో మనిషి అలవాట్లు, ఆహారపు పద్ధతుల వల్ల అనేక ప్రాణాంతక రోగాల బారినపడుతున్నారు. మధుమేహం తర్వాత ప్రమాదకరమైన రక్తపోటుకు బారిన పడుతున్నారు. ఇది శరీరమంతా వ్యాపించి ప్రధాన అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది పట్టణవాసుల్లేనే ఎక్కువగా ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 82 వేల మంది బాధితులు ఉన్నారు అయితే జిల్లాలో 4 లక్షల మందికిపైగా రక్తపోటు వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చిన్నపెద్ద అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రక్తపోటు బారిన పడుతున్నారు. రక్తపోటుపై నిర్లక్ష్యం చేస్తే అది గుండెపోటుకు కూడా దారి తీసే అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. వ్యాధి వల్ల మూత్ర పిండాలు, కంటి జబ్బు లు వచ్చే అవకాశం ఉందని, ప్రధాన అవయవాలను దెబ్బతీస్తుందని స్పష్టం చేస్తున్నారు.



ప్రతి వంద మందిలో 15 మందికి..

ఈ రక్తపోటు వల్ల తీవ్ర అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రతి వంద మందిలో 15 మంది దాకా గ్రామాలలో వ్యాధిగ్రస్థులు ఉండగా పట్టణ ప్రాంతాలలో 20 మందికిపైగా ఆ సంఖ్య ఉంటోంది.

నివారణ ఇలా..

- ఆహారంలో తీసుకునే రోజువారి ఉప్పు 5 గ్రాముల కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో కొవ్వు పదార్థాల పరిమితి మించకూడదు.
- అధిక బరువు ఉన్నట్టయితే బరువు తగ్గేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేస్తూ ఉండాలి.
- మద్యం తాగే అలవాటు ఉంటే మోతాదు మించకుండా చూసుకోవాలి.
- పొగ తాగడం పూర్తిగా మానివేయాలి.
- రక్తపోటు ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి.
- అధిక రక్తపోటు ఉన్నట్టయితే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.

అప్రమత్తంగా ఉండాలి



రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. రక్తపోటుపై నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరుగుతుంది. ఇది శరీరంలోని అనేక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రధానంగా అధిక రక్తపోటు కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధిపై నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ డయాలసిస్‌కు దారి తీస్తుంది. దీర్ఘకాలకంగా బీపీ ఉండి నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు దెబ్బతింటాయి. సడన్‌గా వచ్చే హై బీపీని మందులతో నయంచేసుకునే అవకాశం ఉంది. వైద్యులను సంప్రదించి వ్యాధిని కంట్రోల్‌లో పెట్టుకోవాలి.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ వైద్యాధికారి



రక్తనాళాలపై దీని ప్రభావం ఎక్కువే

బీపీ ప్రభావం ఎక్కువగా రక్తనాళాలపై ఉంటుంది. శరరంలోని ప్రధాన రక్తనాళాలు అధిక రక్తపోటు వల్ల దెబ్బతినే అవకాశం ఉంది. రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. అధిక రక్తపోటు వల్ల ఒక్కోసారి మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. రక్తనాళాలులో కొవ్వు పేరుకుపోయి రక్తం సరఫరా ఆగిపోయి కూడా బ్రెయిన్ స్ట్రోకుకు గురయ్యే ప్రమాదం ఉంది. జిల్లాలో వ్యాధిగ్రస్థులు 4 లక్షల మందికిపైగా ఉన్నారు.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

నెల్లూరులో బాధితులు సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. రక్తపోటుపై అవగాహన లేకపోవడంతో తీవ్ర వ్యాధులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షలు విధిగా చేయించుకుని తగిన వైద్య చికిత్సలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పొగాకు కొనుగోళ్ల మందగమనం

- పురోగతి లేని ధరలు
- నిరాశలో రైతులు



గిట్టుబాటు ధర కోసం నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

మర్రిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): వేలం కేంద్రాల్లో వ్యాపారులు ఆచితూచి వ్యవహరిస్తుండడంతో పొగాకు కొనుగోళ్లు మందగమనంగా సాగుతున్నాయి. కొనుగోళ్లు మొదలై రెండు నెలలు గడుస్తున్నా పొగాకు ధరల్లో పురోగతి కనిపించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. గత ఏడాది మంచి ధరలు లభించడంతో పోటీపడి అధికంగా ఖర్చుచేసి పరిమితిని మించి పొగాకును సాగుచేశారు. తీరా అన్ని రకాల బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. ఎక్కువ సంఖ్యలో తిరస్కరణకు గురవుతున్నాయి. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా తమ వద్ద నిల్వ ఉన్న పొగాకు బరువు తగ్గి, రంగు మారి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని కర్షకులు కలవవపడుతున్నారు.

5861.91 హెక్టార్లలో పొగాకు సాగు

మర్రిపాడు మండలంలోని డీసీపల్లి బోర్డు పరిధిలో 1738.42 పొగాకు బ్యారన్‌లు ఉండగా 2069 మంది రైతులు 5861.91 హెక్టార్లలో పొగాకు సాగుచేశారు. రైతులు 7.41 మిలియన్ కేజీలకు అనుమతి పొందగా, 10.60 మిలియన్ కేజీల మేర దిగుబడి వచ్చినట్లు తొలుత అధికారులు అంచనా వేశారు. కానీ అందుకు భిన్నంగా పంట రైతు చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఆశించిన మేర ధరలు లేవంటూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు నిరసన వ్యక్తంచేసి తమ గోడును అధికారులకు విన్నవించుకున్నారు. ప్రతీరోజూ వేలం కేంద్రం నుంచి 100 బేళ్లకు పైగా తిరస్కరణకు గురవుతున్నాయని, శుక్రవారం వేలం కేంద్రానికి 540 బేళ్లు రాగా 117 బేళ్లను తిరస్కరించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

అక్రమ మైనింగ్ నిగ్గు తేల్చండి

- కలెక్టర్‌కు వైసీపీ ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), మే 16 (ఆంధ్రజ్యోత) : సైదాపురంలో అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, నెల్లూరు నగర పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇసుక తరలింపుపై నిగ్గు తేల్చాలని వైసీపీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆ పార్టీకి చెందిన వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అక్రమాలు కొనసాగితే కేంద్ర ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

19 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

నెల్లూరు(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈనెల 19 నుంచి నిర్వహిస్తున్న ట్లు ఆర్ఐవో టీ వర ప్రసాద్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు శనివారంతో పూర్తి కానున్నాయని, ఎగ్జామినర్లుగా నియమితులైన అధ్యాపకులను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు రిలీవ్ చేసి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రానికి పంపించాలని సూచించారు. మొదటి స్పెల్‌లో 19వతేదీ నుంచి సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టులు, రెండో స్పెల్‌లో 21వతేదీ నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందని వెల్లడించారు.

535 మంది గైర్హాజరు..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం ఫిజిక్స్-1, 2, ఎకనామిక్స్-1, 2 పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 535 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 7,803 మంది హాజరు కావాల్సి ఉండగా 7,323 మంది హాజరుకాగా 480 మంది గైర్హాజర య్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1058 మంది హాజరు కావాల్సి ఉండగా 1003 మంది హాజరుకాగా 55 మంది గైర్హాజర య్యారు. ఆర్ఐవో టీ వరప్రసాదరావు 17 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 9, ఫ్లయింగ్ స్క్వాడ్ 26 కలిపి మొత్తం 52 కేంద్రాలను పరిశీలించారు.

మూల్యాంకన విధులకు హాజరుకాని సిబ్బందిపై బోర్డు నిబంధనలకు అనుగుణంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహకార సంఘాల సీఈవోలకు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), మే 16(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఎన్‌డీడీసీబీ సమావేశ మందిరంలో సహకార సంఘాల సీఈవోలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా సహకారశాఖాధికారి గురప్ప వాయిదా మీరిన బకాయిలపై చట్టపరమైన చర్యలు అనే అంశంపై వివరించారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న

వాహనం పట్టివేత

సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవపాళెంలోని చేపల గుంటలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. బెంగళూరు నుంచి లారీలో సుమారు 70 డమ్ముల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం మత్స్యశాఖ అధికారి పోట్టేయ్య, వీఆర్వో మోహన్ సమక్షంలో పోలీసులు చికెన్ వ్యర్థాలను సంగం కొండ వద్ద గుంత తీసి పూడ్చిపెట్టారు. చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మురళి అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో

వృద్ధుడి మృతి

సీతారామపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన స్థానిక ఆరు లైన్ల జాతీయ రహదారి సమీపం లో శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండుపల్లి గ్రామానికి చెందిన నల్లమేకల వెంగయ్య (63) రెండురోజుల క్రితం కట్టెల కోసం అడవికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో దారితప్పి జాతీయ రహదారిపై వస్తూ మృతి చెందాడన్నారు. తల, శరీరంపై గాయాలు ఉండడంతో వెంగయ్య మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంతోషరావు

వ్యవసాయ కనెక్షన్లను

మంజూరు చేయండి

- పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి
- విద్యుత్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు (జడ్పీ), మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులను మంజూరు చేయాలని జిల్లా విద్యుత్ అధికారులను సీఎండీ సంతోషరావు ఆదేశించారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన ఆయన విద్యుత్‌భవన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని, పెండింగ్ కనెక్షన్లను వెంటనే మంజూరుచేయాలన్నారు. వేసవిలో నిరంతర సరఫరా పటిష్టంగా చేయాలన్నారు. సౌరవిద్యుత్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, పెద్ద ఎత్తున చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది స్థానిక హెడ్ క్వార్టర్‌లో నివాసం ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నాయని, దీనికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, ఎస్ఈ విజయన్, నోడల్ అధికారి బాలచంద్ర, ఈఈలు ఎం. శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్ చౌదరి, శ్రీనువాసులు, లక్ష్మీనారాయణ, పరంధామయ్య పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో పామూరురోడ్డు సర్కిల్‌లో రీసర్వే



పామూరురోడ్డు సర్కిల్‌లో మాదాల మోహనరావు ఇంటివద్ద సర్వే నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డు సర్కిల్‌లో సర్వే ఉన్నతాధికారులు శుక్రవారం రీ సర్వే నిర్వహించారు. సర్కిల్ అభివృద్ధిలో భాగంగా ఇక్కడ పదిహేను రోజులక్రితం మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టి పలు గృహాల ప్రహరీగోడలు, ఆక్రమితస్థలంలో ఉన్నట్లు భావించిన నిర్మాణాలను కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఆక్రమణల తొలగింపు పేరుతో అక్రమంగా మా నిర్మాణాలను కూల్చివేశారని, వాస్తవానికి మేము ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని ఉన్నతాధికారులతో రీ సర్వే చేయించాక ఆక్రమణల తొలగింపు చేయాలని కొందరు బాధితులు కోరినా మున్సిపల్ అధికారులు పెడచెవిన పెట్టి ఏకపక్షంగా కూల్చివేతలకు పాల్పడ్డారని సవాల్‌చేస్తూ మాదాల మోహనరావు అనే వ్యక్తి హైకోర్టులో రిట్‌పిటీషన్ దాఖలు చేశారు. దీంతో సర్కిల్ అభివృద్ధి పనులపై స్టే విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఉన్నతస్థాయిలో సమగ్రంగా సర్వేచేసి నివేదిక ఇవ్వాలని అప్పటి వరకు ఎలాంటి ఆక్రమణల తొలగింపుకు పాల్పడవద్దని సూచిస్తూ 8వారాల స్టే విధించింది. హైకోర్టు ఆదేశాలతో శుక్రవారం సర్వేశాఖ ఏడీ రఘురామరాజు కందుకూరు డీఐ ప్రభాకర్, మండల సర్వేయరు మాటూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బందిని వెంటబెట్టుకుని సర్వే నిర్వహించారు. పట్టణంలోని పామూరు రోడ్డులో పొగాకు బోర్డు నుంచి రిలయన్స్ మార్ట్ వరకు రోడ్డుకి ఇరువైపులా సర్వే చేశారు. గతంలో రెండు దఫాలు సర్వేజరిగి ఉందని తొలుత మండల సర్వేయరు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారని, మరో విడత డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేస్ నిర్వహించిన సర్వేలో తొలుత నిర్ధారించిన హద్దుల కన్నా మరో మూడు అడుగుల వరకు ఆక్రమణ ఉన్నట్లు నిర్ధారించారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే హైకోర్టు ఆదేశాలతో జరుగుతున్నందున సమగ్రంగా వాస్తవ పరిస్థితిని, హద్దులను, ఆక్రమణలను నిర్ధారిస్తూ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా కోర్టుకు నివేదిస్తామని, కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.